www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 249 | గురువారం 01-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

బ్యాంకులకు టోకరా..!

Shri Lakshmi Cotsyn Limited
(An ISO 9001 : 2008 Certified Co.)

- మాల్యా, మోడీ, కొఠారిల బాటలో అగర్వాల్
- రూ.4 వేల కోట్లు స్వాహా!?
- రూ.515 కోట్లకు ఆర్‌పీ ఇన్ఫో మోసం
- సీబీఐ కేసు నమోదు

లక్నో/కోల్‌కతా : కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి బ్యాంకు కుంభకోణాలు పెరిగిపోయాయి. అధికార పార్టీ నేతలు, వారి అండదండలు పుష్కలంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు ఇష్టానుసారం బ్యాంకుల్లో అప్పులు తీసుకొని తిరిగి చెల్లించిన దాఖలాలు కనిపించడం లేదు. బ్యాంకు కుంభకోణాలకు సంబంధించి ఇప్పటికే అనేక కేసులు వెలుగులోకి రాగా తాజాగా ఉత్తరప్రదేశ్‌లో మరో మోసం బహిర్గతమైంది. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, విక్రమ్ కొఠారీ బాటలో కాన్పూరుకు చెందిన వస్త్ర వ్యాపారి ఎంపీ అగర్వాల్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన రూ.3,972 కోట్ల మేరకు 16 బ్యాంకుల కన్సార్టియం నుంచి రుణాలు పొంది, మోసగించినట్లు వార్తలు వచ్చాయి. ఆయన యజమానిగా ఉన్న శ్రీ లక్ష్మి కోట్సిన్ లిమిటెడ్‌కు సెంట్రల్ బ్యాంక్ నేతృత్వంలోని కన్సార్టియం ఈ రుణాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. రుణాలు రాబట్టుకునేందుకు ఈ లీడ్ బ్యాంక్ ఇప్పటికే అగర్వాల్ ఆస్తులను వేలం వేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ కంపెనీ బ్యాలెన్స్ షీట్ ప్రకారం ఆస్తుల విలువ రూ.1,495 కోట్లుగా తేల్చారు. రూ.3,972 కోట్లు రాబట్టుకునేందుకు సెంట్రల్ బ్యాంకు డెట్ రికవరీ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ఖాయిలాపడిన పరిశ్రమగా పరిగణించి, రాజీ కుదిర్చేందుకు 2016 నవంబరు 30న ఈ కేసును నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు బదిలీ చేశారు. శ్రీ లక్ష్మి కోట్సిన్ లిమిటెడ్‌కు అగర్వాల్ చైర్మన్, సీఈఓగా వ్యవహరిస్తున్నారు. టెక్స్‌టైల్స్‌తోపాటు ఆటోమొబైల్స్‌ను ఈ కంపెనీ తయారు చేస్తోంది.

ఐడీబీఐకి రూ.515 కోట్లు టోపీ

మరోవైపు పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన ఆర్‌పీ ఇన్ఫో సిస్టమ్, ఆ సంస్థ డైరెక్టర్లపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) బుధవారం కేసు నమోదు చేసింది. రూ.515.15 కోట్ల మేరకు ఐడీబీఐ బ్యాంకును మోసగించినందుకు కంపెనీ డైరెక్టర్లు శివాజీ పంజ, కౌస్తుబ్ రే, వినయ్ బఫ్నా, ఆర్థిక విభాగం ఉపాధ్యక్షుడు దేబ్‌నాథ్‌పాల్, గుర్తు తెలియని బ్యాంకు అధికారులపై ఆరోపణలను నమోదు చేసింది. వీరు నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ నేరాలకు పాల్పడినట్లు సీబీఐ పేర్కొంది. ఐడీబీఐ బ్యాంకును రూ.180.44 కోట్ల మేరకు మోసగించినందుకు జూన్‌లో ఈ కంపెనీపై కేసు నమోదైంది.



కార్తీ చిదంబరం అరెస్టు...!

ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో.... రూ.10 లక్షల లంచం తీసుకున్నారని ఆరోపణ

చెన్నై: కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరాన్ని ఐఎన్ఎక్స్ మీడియా కేసులో సీబీఐ అధికారులు బుధవారం చెన్నైలో అరెస్టు చేశారు. లండన్ నుంచి బుధవారం ఉదయం చెన్నై విమానాశ్రయానికి చేరుకున్న కార్తీని ఏడుగురు సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ని ఢిల్లీకి తరలించనున్నట్లు సమాచారం.ఐఎన్ఎక్స్ మీడియా అంశంలో ఫెరా నిబంధనలు ఉల్లంఘించారని కార్తిపై ఆరోపణలు ఉన్నాయి. 2007లో చిదంబరం ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఐఎన్ఎక్స్ మీడియా సంస్థకు ఎఫ్ఐపీబీ అనుమతి ఇప్పించేందుకు కార్తి రూ.10లక్షల లంచం తీసుకున్నారని సీబీఐ ఆరోపణ. కేసు నమోదు చేసిన సీబీఐ

- మిగతా 2 లో





అతిలోక సుందరికి

అంతిమ వీడ్కోలు



తల్లడిల్లిన చిత్రజగత్తు

అంతిమయాత్రలో అభిమానుల కంటతడి

ప్రభుత్వలాంఛనాలతో అంత్యక్రియలు

హాజరైన బాలీవుడ్, టాలీవుడ్, కొలీవుడ్, మాలీవుడ్,శాండిల్‌వుడ్ ప్రముఖులు

శ్రీదేవి అంటే శ్రీదేవే...
ఆ పేరుతో పోలిక ఏ పేరుకూ ఉండదు.
ఆమె సూపర్, మెగాస్టార్లను మించిన స్టార్..!
ఇప్పుడు ఆ తార.. తారాలోకంలోకి వెళ్లిపోయింది..!
దాదాపు మూడు దశాబ్దాలపాటు ఆమెను తలవని తలపులేవి?
ఆమె ఎవరో తెలియని తలువులేవి..?
పదహారేళ్ల వయస్సు నుంచి చాందినీలు, సంగీతాల దాకా...
ఎన్ని లక్షల హృదయాలను కొల్లగొట్టింది ఆమె..!
ఆ సిరిదేవి అలా అలా నవ్వుతున్న ఓ సిరిమల్లెపువ్వులా
కోట్లాది గుండెలకు గుర్తుండిపోతుంది!
ఆమె భౌతికంగా కనుమరుగైనా
ఆమె నవ్వుల వెలుగులు మాత్రం
జనం మధ్య ఉండిపోయాయి..!

11లో

మళ్లీ నీటి వివాదం

ఆంధ్ర - తెలంగాణ అధికారుల వాగ్యుద్ధం

అడ్డుకున్న పక్కరాష్ట్ర అధికారులు

ఏపీ అధికారుల ఆగ్రహం

విశాలాంధ్ర - విజయపురిసౌత్ : నాగార్జునసాగర్ నీటిపై ఏపీ, తెలంగాణ మధ్య మరోసారి వివాదం చెలరేగింది. అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ఏపీ నీటివాటా పూర్తయిందని, అందువల్ల కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేసేది లేదని తెలంగాణ అధికారులు మొండికేశారు. గేట్లు మూసేశారు. కృష్ణా ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఆంధ్రా ప్రాంతానికి కుడికాలువకు కేటాయించిన నీటి విడుదల పూర్తైందంటూ కుడికాలువకు నీటి విడుదలను తెలంగాణ అధికారులు బుధవారం ఉదయం 6.30గం॥లకు నిలిపివేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బత్తుల వెంకటస్వామి, డీఈ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, మిగిలిన ఆంధ్రా జేఈలు ప్రాజెక్టుపై ఉన్న కంట్రోల్ రూమ్‌కు చేరుకొని తెలంగాణ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఈఎన్‌సీ ఆదేశాల మేరకు నీటి విడుదలను ఆపివేశామని తెలంగాణ అధికారులు చెప్పారు. తిరిగి నీటి విడుదల చేయాలంటే ఉన్నతాధికారుల అనుమతులు

- మిగతా 2 లో



సాగర్ గేటు వద్ద తెలంగాణ అధికారులతో మాట్లాడుతున్న డీఈ వెంకటేశ్వరరావు

రూ. 100 కోట్ల అక్రమ మైనింగ్
మాజీ మంత్రి రావెల సంచలన వ్యాఖ్యలు 11లో



ఉప ఎన్నికల్లో

బీజేపీకి ఎదురుదెబ్బ

- ఎంపీలోని ముంగాలిలో కాంగ్రెస్ గెలుపు, కొలారస్‌లో ముందంజ
- ఒడిశాలో బీజేడీ విజయం

2లో

త్రిపుర ఎర్రదండుదే

- ఎగ్జిట్ పోల్స్‌పై సందేహాలు
- గతంలోనూ అంచనాలు తప్పాయి : సురవరం



హైదరాబాద్ : త్రిపుర అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో వామపక్ష సంఘటనదే విజయమన్న విశ్వాసాన్ని భారతకమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి వ్యక్తం చేశారు. బీజేపీ విజయం సాధిస్తుందన్న రెండు ఎగ్జిట్‌పోల్స్‌పై అనుమానాలను వ్యక్తం చేశారు. త్రిపురలో వామపక్షసంఘటన తిరిగి అధికారంలోకి వస్తుందని, ఇందులో ఎటువంటి అనుమానం లేదని స్పష్టం చేశారు. బీహార్, ఢిల్లీ అసెంబ్లీలకు సంబంధించి ఎగ్జిట్‌పోల్స్ కూడా తప్పని తేలిందన్న విషయాన్ని సురవరం గుర్తుచేశారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు సంబంధించి తాజాగా వచ్చిన ఎగ్జిట్‌పోల్స్ పట్ల వ్యక్తిగతంగా తనకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఒక ఎగ్జిట్‌పోల్ బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమి 51 శాతం ఓట్లు పొందుతుందని పేర్కొనగా మరో ఎగ్జిట్‌పోల్ పాలక వామపక్ష సంఘటన 45-46 శాతం ఓట్లు పొందుతుందని పేర్కొన్నదని ఆ ఓట్ల శాతంలో తేడా 'తక్కువే' అని సురవరం అన్నారు. సీ-ఓటరు ఎగ్జిట్‌పోల్ వామపక్ష సంఘటనకు అనుకూలంగా వున్నదని చెప్పారు. 44.3 శాతం ఓట్లతో సీపీఐ(ఎం) 26 నుండి 34 సీట్లు, 42.8 శాతం ఓట్లతో బీజేపీ, మిత్రపక్షాలు 24 నుంచి 32 సీట్లు, 7.2 శాతం ఓట్లతో కాంగ్రెస్ పార్టీ రెండు సీట్లు గెలుచుకోవచ్చునని సీ-ఓటరు ఎగ్జిట్‌పోల్ అంచనావేసింది. "త్రిపురలో బీజేపీ విజయం సాధించగలుగుతుందని నేను అనుకోవడంలేదు. వామపక్ష సంఘటన విజయం సాధిస్తుందని మేము చాలా గట్టి నమ్మకంతో ఉన్నాం" అని సురవరం తెలిపారు. "అవును, అక్కడ కొన్ని వర్గాలలో ప్రభుత్వ వ్యతిరేకత ఉండడం సహజమే. అత్యధిక సంఖ్యలో ప్రజలు వామపక్ష సంఘటన

- మిగతా 2 లో



సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శిగా జంగాల అజయ్‌కుమార్

3లో



జయేంద్ర సరస్వతి కన్నుమూత

64 ఏళ్లు కంచి పీఠాధిపతిగా సేవలు

ప్రముఖుల సంతాపాలు

12లో


ఇంటర్ పరీక్షలకు 97 శాతం హాజరు



- 18.095 మంది గైర్హాజరు
- మచిలీపట్నం, బాపట్లలో మాల్‌ప్రాక్టీస్

3లో

ఇదీ లోకం!



కదలని 'కమిషనరేట్'లు

- ప్రతిపాదనల దశలోనే అమరావతి
- అడుగుపడని గుంటూరు, తిరుపతి, రాజమహేంద్రవరం
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనైనా ప్రకటించేనా...



విశాలాంధ్రబ్యూరో - అమరావతి: రాష్ట్ర విభజన జరిగిన నాలుగేళ్లు కావస్తున్నా, కొత్త పోలీస్ కమిషనరేట్‌ల ఏర్పాటుపై ప్రభుత్వం పెద్దగా దృష్టి సారించటంలేదు. రాష్ట్ర విభజన సమయంలో విజయవాడ, విశాఖపట్నం మాత్రమే పోలీస్ కమిషనరేట్‌లుగా ఉండగా, గుంటూరు, తిరుపతి, రాజమహేంద్రవరం అర్బన్ పోలీసు జిల్లాలుగా ఉన్నాయి. విభజన తర్వాత విజయవాడ పోలీస్ కమిషనరేట్‌ను రెండుమార్లు అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం, కొత్త కమిషనరేట్ ఏర్పాటు, అర్బన్ పోలీసు జిల్లాల అప్‌గ్రేడేషన్‌కు అంతగా ప్రాధాన్యం ఇవ్వటంలేదు. రాష్ట్రంలోని పట్టణాలు, నగరాల పరిధి విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటు అవసరం పెరుగుతోంది. శాంతి భద్రతల పరిరక్షణతోపాటు నేరాలను అదుపు చేసేందుకు పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న పోలీస్ కమిషనరేట్‌లు, అర్బన్ పోలీసు జిల్లాలను అప్‌గ్రేడ్ చేయాలని గతంలోనే ప్రభుత్వం భావించింది. విజయవాడకు గతంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) హోదా కలిగిన అధికారి పోలీస్ కమిషనర్‌గా ఉండేవారు. విభజనతో ఒక్కసారిగా

- మిగతా 2 లో



అభివాదం చేస్తున్న రామకృష్ణ, రాఘవులు, జేవీఎస్ఎన్ మూర్తి తదితరులు

ఇంకెన్నాళ్లీ మోసం

- హోదా కోసం మాతో కలిసిరా..
- పెట్టుబడుల కోసం మహిళలను అవమానిస్తారా..
- రైల్వేజోన్, గిరిజన వర్సిటీ ఇవ్వాల్సిందే
- చంద్రబాబుపై రాఘవులు, రామకృష్ణ ధ్వజం
- 5 నుంచి ఢిల్లీలో దీక్ష చేస్తామని ప్రకటన

3లో

టర్కీలో కమ్యూనిస్టుల విస్తృత ప్రచారం



అంకారా : టర్కీ నిరాశలో కూరుకుపోలేదు, ప్రజల ప్రత్యామ్నాయాన్ని పటిష్టం చేయాలి అన్న నినాదంతో టర్కీ కమ్యూనిస్టు పార్టీ విస్తృతంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. 'కాంతివంతమైన 2018' కోసం కృషి చేయాలని కమ్యూనిస్టు పార్టీ అనటోలియా ప్రాంతంలోని వివిధ కేంద్రాలలో సభలు నిర్వహించారు. దేశంలోని 14 ప్రాంతాలలో సమావేశాలు నిర్వహించి ప్రజాప్రత్యామ్నాయాన్ని పటిష్టం చేయాలని కోరుతూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమం జనవరి 20వ తేదీన ప్రారంభమై ఫిబ్రవరి 2వరకు కొనసాగింది. ప్రజాప్రత్యామ్నాయ నిర్మాణం కోసం కొన్యా, ఇస్తాంబుల్, యుస్కుడర్, జివేజి, సిలివ్రి, ఇజ్మిర్, అంకారా, అదన, అంటల్య, ఇస్తాంబుల్-సరియర్, శామ్‌సన్, కెసన్ తదితర 16 ప్రాంతాలలో ప్రజాప్రత్యామ్నాయం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాదిమంది కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం కోసం దరఖాస్తున్న చేశారు.

అల్జీరియాలో ఎర్డొగన్ పర్యటన



అల్జీర్స్ : టర్కీ అధ్యక్షుడు ఎర్డొగన్ అల్జీరియాలో పర్యటిస్తున్నారు. రెండు దేశాల మధ్య సహకారాన్ని వివిధ రంగాలకు విస్తరించాలని నిర్ణయించినట్లు అల్జీరియా అధ్యక్షుడు అబ్దల్అజీజ్ బౌటిఫ్లికతో జరిపిన చర్చలను ఎర్డొగన్ వివరించారు. ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించు కోవాలని, ఉమ్మడి ప్రయోజనకర అంశాలను అమలుచేయాలని కూడా ఇరువురు నేతలు భావించారు. సిరియా సంక్షోభాన్ని కూడా వారు చర్చించారు. ఎర్డొగన్ ఈ సందర్భంగా అల్జీరియా ప్రధానమంత్రి అహమ్మద్ ఒయుహాతోను భేటీ అయ్యారు. అల్జీరియా, టర్కీ వాణిజ్య ఫోరం సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సుకు రెండు దేశాల కంపెనీలు, వాణిజ్యవేత్తలు భారీగా హాజరయ్యారు. ఎర్డొగన్ పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య ఇంధనం, ఉన్నతవిద్య, దౌత్య విభాగం, సాంస్కృతిక, టూరిజం, వ్యవసాయరంగాలలో భాగస్వామ్య ఒప్పందాలను, అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నారు. ఎర్డొగన్ అల్జీరియాలో పర్యటించడం ఇది రెండవసారి.

రుణభారంపై శ్రీలంకలో నిరసన ర్యాలీ

జాఫ్నా : కుటుంబాలు, అలాగే దేశంపై రుణభారం పెరిగినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవటంలేదని నిరసన తెలియజేస్తూ జాఫ్నా నగరంలో వేలాదిమంది ర్యాలీ జరిపారు. మైక్రోఫైనాన్స్ కంపెనీలు అత్యధిక వడ్డీలు వసూలు చేస్తున్న ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నదని వారు నినాదాలు చేశారు. మా కుటుంబాలు, దేశం రుణవూబిలో కూరుకు పోయాయి. దీని పరిష్కారం ఏమిటి? రుణాలు తీసుకోవడం నిలిపివేసి ఉద్యోగావకాశాలు కల్పించాలి. ప్రజాసంస్థలను పటిష్టం చేయాలని నినాదాలు చేస్తూ బ్యానర్లను పట్టుకొని నిరసన తెలిపారు.

ప్రసిద్ధిచెందిన వీరసింఘం హాలు నుంచి ప్రదర్శన బయలుదేరింది. అధిక వడ్డీలతో అల్లాడిపోతున్న వేలాదిమంది మహిళలు కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. 2009లో అంతర్యుద్ధ ముగిసింది. ఇదే అదనుగా అనేక మైక్రో ఫైనాన్స్ కంపెనీలు వెలిసి భారీ వడ్డీలకు ప్రజలకు రుణాలు అందజేశాయి. జిల్లా కలెక్టర్‌తో సమానమైన ప్రభుత్వ ఏజెంటుకి వినతిపత్రం అందజేశారు.



అనైతికంగా వ్యవహరిస్తున్న మైక్రో ఫైనాన్స్ కంపెనీలపై నిషేధం విధించాలని ప్రదర్శకులు కోరారు. సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం తక్కువ వడ్డీలకి రుణాలు అందించి అంతర్యుద్ధంలో దెబ్బతిన్న ప్రజలను ఆదుకోవాలని కోరారు.

నాటో, ఈయూల ప్లాన్‌కు నిరసనగా

గ్రీసులో కమ్యూనిస్టుల భారీ ర్యాలీ

ఏథెన్స్ : నాటో-ఈయూ సామ్రాజ్యవాదుల ఎత్తుగడలకు వాటిలో గ్రీసును ఇరికించేందుకు పన్నుతున్న వ్యూహానికి నిరసనగా దేశ రాజధాని ఏథెన్స్ నగరంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. త్వరలో థెస్సలొనికి నగరంలోను ర్యాలీ నిర్వహించాలని కమ్యూనిస్టు పార్టీ ఏర్పాట్లు చేస్తున్నది. ఏథెన్స్‌లోని సింటగమ స్క్వేర్‌లో ప్రదర్శన జరిగింది. ప్రజలు సామ్రాజ్యవాదుల ఎత్తుగడలను నిరసించారు. బాల్కన్ దేశాలలోను, పశ్చిమాసియాలోను సామ్రాజ్యవాదుల చర్యల మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నినదిస్తూ వారి ఎత్తుగడలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ప్రధాన కార్యదర్శి డిమిట్రిస్‌కౌట్సుంబస్ ర్యాలీనుద్దేశించి మాట్లాడుతూ ఇటీవల టర్కీ గ్రీసు మధ్య తలెత్తిన సమస్యలు అమెరికా, నాటో, ఈయూల ప్రమాదకరమైన ఎత్తుగడల మూలంగానే తలెత్తాయని విమర్శించారు. సామ్రాజ్యవాదులకు లొంగిపోయిన సిర్జా ప్రభుత్వాన్ని విమర్శించారు. థెస్సలొనికి నగరంలో మార్చి 6వ తేదీన భారీ ర్యాలీ జరపాలని



నిర్ణయించారు. సామ్రాజ్యవాదుల ఎత్తుగడలను కొనసాగనివ్వరాదని ఆయన ప్రజలను కోరారు.

సాల్వడార్‌లో ఎన్నికల ప్రచారం



శాన్‌సాల్వడార్ : సాల్వడార్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమం ముమ్మరమయ్యింది. మరో 5 రోజులలో పార్లమెంటు, మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలు వామపక్ష పార్టీ ఫరబుంధొమార్టీ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్‌కు (ఎఫ్ఎంఎల్ఎన్) అత్యంత కీలకమైనవి. ఇంతవరకు సాధించిన సామాజిక విజయాలను పరిరక్షించాలని వామపక్ష పార్టీ నిర్ణయించింది. ఈ అభివృద్ధి కొనసాగించేందుకు సుదీర్ఘకాలంలో ప్రజలు ప్రభావితం చేస్తున్న ఎఫ్ఎంఎల్ఎన్ పార్టీకి మద్దతు ఇవ్వవలసిందిగా ప్రజలకు ఆ పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది. నగరంలో పార్టీకి మద్దతుగా జరిగిన భారీ ర్యాలీలో పార్టీ తరఫున పోటీచేస్తున్న అనబెల్‌బెల్లొసొ మాట్లాడారు. ఇంతవరకు అమలు చేసిన సామాజిక కార్యక్రమాలను కొనసాగిస్తామని, ప్రజలందరికీ మరింతగా ఆరోగ్యం చేకూర్చే, భద్రతను మెరుగుపరిచే కార్యక్రమలను కొనసాగిస్తామని, దేశం తిరోగమనం చెందడానికి అనుమతించబోమని ఆమె అన్నారు. యువత క్రియాశీలక పాత్ర వహించకుండా దేశం పురోగతి చెందడం సాధ్యంకాదని చెప్పారు. పార్టీ సూత్రీకరణలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. శాన్‌సాల్వడార్ నగర మేయర్ పదవికి ఎఫ్ఎంఎల్ఎన్‌పార్టీ ప్రధాన కార్యదర్శి మెదర్‌డొ గొంజాలెజ్ పోటీ చేస్తున్నారు.

అమెరికాలో పెరగనున్న వడ్డీరేట్లు

వాషింగ్టన్ : వడ్డీరేట్లను నెమ్మదిగా పెంచనున్నట్లు అమెరికా ఫెడరల్ రిజర్వ్ (సెంట్రల్ బ్యాంక్) ఛైర్మన్ జెరోంపావెల్ కాంగ్రెస్ సభ్యులకు తెలియజేశారు. 2017 ద్వితీయార్థంలోను దేశ ఆర్థిక వ్యవస్థ నిలకడగా వృద్ధి చెందిందని ఆయన పేర్కొన్నారు. ఆర్థికరంగం విస్తరించిన నేపథ్యంలో వడ్డీరేట్లను పెంచాలని నిర్ణయించినట్లుగా ఫెడరల్ రిజర్వ్ అధికారులు భావిస్తున్నారు. సెమీవార్షిక ద్రవ్యవిధాన నివేదికను గతవారం ఫెడరల్ రిజర్వ్ కాంగ్రెస్‌కు అందజేసింది. ఈ సందర్భంగా పావెల్ మాట్లాడుతూ క్రమంగా ద్రవ్య విధానాన్ని తగ్గించడంవల్ల లేబర్ మార్కెట్ బలపడి వేగంగా ద్రవ్యోల్బణం 2 శాతానికి తగ్గుతుందని అన్నారు. నెలవారీ ఉద్యోగాల కల్పన పెరుగుతున్నదని చెప్పారు. 2017 జులై నుండి డిసెంబర్ నాటికి 1,79,000 ఉద్యోగాలు సృష్టించినట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి నాటికి అదనంగా మరో 20,000 ఉద్యోగాలు కల్పించినట్లు లేబర్ బ్యూరో గణాంకాలను ఉటంకించారు. ఈ విధంగా ఉద్యోగాల కల్పన కొనసాగినట్లయితే నిరుద్యోగం రేటు 4.1 శాతం నుంచి 0.75 శాతానికి తగ్గుతుందని పావెల్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కమ్యూనిస్టులతో మదురో భేటీ

కారకాస్ : వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురొ తమ మిత్ర పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ నేతలతో తాజాగా భేటీ అయ్యారు. కమ్యూనిస్టు నేతలు కొన్ని అంశాలపై విమర్శ చేశారని అత్యధిక అంశాలలో తాను విప్లవనాయకుడినని ప్రశంసించారని మదురొ చెప్పారు. మదురొ చిన్నతనం నుంచి విప్లవవాదిగానే పెరిగాడు. ఉమ్మడి చర్చకు విలువ ఉందని గ్రహించారు. బస్సు డ్రైవరుగా పనిచేసిన మదురొ ఇతరులు చెప్పేది వినేందుకు, నేర్చుకునేందుకు సిద్ధంగా ఉంటారు. ఏప్రిల్‌లో జరగనున్న అధ్యక్ష ఎన్నికలకు ఆయన సంసిద్ధమవుతున్నారు. బొలివేరియన్ విప్లవ నాయకుడు, మాజీ అధ్యక్షుడు హ్యూగొఛావెజ్ అనుయాయుడుగా కొనసాగుతున్నారు. దేశంలో పేద, అణగారిన వర్గాల అభ్యున్నతికోసం, సంక్షేమంకోసం పెన్షన్లు, ప్రత్యేక అలవెన్సులు, ఇళ్ల నిర్మాణాలు, వ్యవసాయ భూముల పంపిణీ, ఆరోగ్య పథకాలను ప్రవేశపెట్టి కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ దేశంలో పేదరికం దశాబ్ది కాలంలో పెరిగింది. మదురొతో జరిగిన సమావేశంలో కమ్యూనిస్టు నేతలు కేవలం బూర్జువా



నాయకులను ప్రభుత్వంనుంచి తొలగించినంత మాత్రాన సరిపోదని ఆ వర్గానికిగల రాజకీయ, ఆర్థికశక్తిని బద్దలుకొట్టాలని అప్పుడే సోషలిస్టు సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని సూచించారు. అలాగే చమురు విక్రయాలవల్ల వచ్చే లాభాలను అణగారిన వర్గాల ప్రజలను పేదరికంనుంచి బయట పడవేసేందుకు ఖర్చుచేయాలని ప్రజలను విప్లవ పంథాలో నడిపించాలని సూచించారు. కార్పొరేట్ శక్తులు ఆర్థిక వ్యవస్థపైన, మాస్‌మీడియాపైన పట్టును సాధించారని, దానిని బలహీనపరచకుండా సోషలిస్టు సమాజ నిర్మాణం సాధ్యంకాదని కమ్యూనిస్టులు సూచించారు. చమురు ధరలు గణనీయంగా పడిపోవడంపల్ల అంతక్రితం వస్తున్న ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. ఇదే సమయంలో అమెరికా విధించిన ఆర్థిక దిగ్బంధం కారణంగా ప్రజలు తీవ్ర కష్టాలను ఎదుర్కోవలసివచ్చింది.

బీజేపీకి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ : దేశంలోని రెండు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశాలోని బైజేపూర్‌లో అధికార పార్టీ బిజూ జనతాదళ్(బీజేడీ) అభ్యర్థి రీటా సాహు తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి అశోక్ పాణిగ్రాహిపై విజయం సాధించారు. ఇక ఎంపీలో గతవారం ఉప ఎన్నికలు జరిగిన ముంగాలి, కొలారస్ స్థానాల్లో కాంగ్రెస్ దూసుకెళుతోంది.

ముంగాలిలో కాంగ్రెస్ అభ్యర్థి బ్రిజేంద్ర సింగ్ యాదవ్ 2,124 ఓట్ల తేడాతో తన సమీప బీజేపీ అభ్యర్థి భాయ్‌సాహెబ్ యాదవ్‌ను ఓడించారు. కొలారాస్‌లో కాంగ్రెస్‌కు చెందిన మహేంద్ర సింగ్ యాదవ్ 16వ రౌండులో 4,836 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. వచ్చే ఏడాది ఎన్నికలకు వెళ్లనున్న ఈ బీజేపీ పాలిత రాష్ట్రంలో ప్రజలు ఇచ్చిన ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ముంగాలిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే మహేంద్ర సింగ్ కలుఖేదా, కొలారస్‌లో రామ్ సింగ్ యాదవ్‌ల మరణంతో ఇక్కడ ఉప ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది.

ఇక ఒడిశా విషయానికొస్తే, బైజేపూర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార బీజేడీ భారీ మెజార్టీతో గెలిచింది. బీజేడీ అభ్యర్థి రీటా సాహు సుమారు 42 వేల ఓట్ల మెజార్టీతో తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి అశోక్ పాణిగ్రాహిపై విజయం సాధించారు.

కార్తి చిదంబరం అరెస్టు...!

(మొదటిపేజీ తరువాయి)

కార్తి, పీటర్ ముఖర్జియా, ఇంద్రాణి ముఖర్జియాకు చెందిన సంస్థలు, ఇళ్లపై దాడులు నిర్వహించింది. ముంబై, చెన్నై, ఢిల్లీల్లోని 14ప్రాంతాల్లో సీబీఐ అధికారులు సోదాలు జరిపారు. విదేశీ పెట్టుబడుల సమీకరణకు అనుమతి ఇవ్వాలని ఐఎన్ఎక్స్ మీడియా ఎఫ్ఐపీబీని అభ్యర్థించింది. ఐతే, కార్తి చిదంబరం నిర్వహిస్తున్న కన్సల్టెన్సీ సంస్థ ద్వారా దరఖాస్తు వెళ్లిన తరువాతే ఐఎన్ఎక్స్‌కు అనుమతి వచ్చింది. దీంతో మంత్రి కుమారుడిగా కార్తి అక్రమాలకు పాల్పడినట్లు సీబీఐ ఆరోపించింది.

గత ఏడాది మేలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆయనపై కేసు నమోదు చేసింది. ఈ కేసులో విచారణకు సహకరించడంలేదని కార్తిని సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఐఎన్ఎక్స్ మనీ లాండరింగ్ కేసులో మంగళవారం కార్తికి చెందిన సీఏ ఎస్. భాస్కరరామన్‌కు ఢిల్లీ కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీని విధించిన విషయం తెలిసిందే.

కాంగ్రెస్ పార్టీ ఫైర్...!

కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తి చిదంబరాన్ని సీబీఐ అరెస్ట్ చేయడంపై కాంగ్రెస్ పార్టీ ఘాటుగా స్పందించింది. ఉద్దేశపూర్వకంగానే కార్తిని అరెస్ట్ చేశారని, కేంద్ర ప్రభుత్వం తమ కుంభకోణాలు, నిర్వహణ లోపాలను కప్పిపుచ్చుకోవడానికి, వేరే అంశాలపై ప్రజల దృష్టి మరల్చడానికే ఇలాంటివి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ రణ్‌దీప్ సుర్జేవాలా ఆరోపించారు. కార్తి అరెస్ట్ వల్ల కాంగ్రెస్ పార్టీ నిజాలు మాట్లాడటం మానుకోదని, మోదీ ప్రభుత్వంలోని అవినీతిని వెలికితీయడం విషయంలో వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. చిదంబరం, ఆయన కుటుంబసభ్యులను లక్ష్యంగా చేసుకున్నంత మాత్రాన తమ దృష్టిని మరల్చలేరని వ్యాఖ్యానించారు.

త్రిపుర ఎర్రదండుదే

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం పట్ల సంతోషంతో, సంతృప్తితో ఉన్నారు" అని చెప్పారు. త్రిపుర అసెంబ్లీలోని 60 నియోజకవర్గాలలోని 59 సీట్లకు ఫిబ్రవరి 18వ తేదీన పోలింగ్ నిర్వహించారు. సీపీఐ(ఎం) అభ్యర్థి రామేంద్ర నారాయణ్ దేవ్‌వర్మ ఈ నెలారంభంలో మృతి చెందిన కారణంగా చారిలం నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహించలేదు. ఈ నియోజకవర్గంలో మార్చి 12వ తేదీన పోలింగ్ జరుగుతుంది. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మార్చి 3వ తేదీన జరుగుతుంది.

కదలని 'కమిషనరేట్'లు

(మొదటిపేజీ తరువాయి)

కమిషనరేట్‌స్థాయిని అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ (ఏడీజీపీ)స్థాయికి పెంచారు. ఆరు నెలల క్రితం కమిషనరేట్‌కు పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) హోదా కల్పించారు. ఏడీజీపీస్థాయిలో కమిషనర్‌గా ఉన్న డీ గౌతం సవాంగ్‌కు డీజీపీ క్యాడర్‌కు పదోన్నతి లభించటంతో కమషనరేట్‌ను కూడా అప్‌గ్రేడ్ చేశారు. కమిషనరేట్‌ను అప్‌గ్రేడ్ చేయటంతోపాటు అదనపు పోలీస్ కమిషనర్ (అదనపు సీపీ), జాయింట్ పోలీస్ కమిషనర్ (జేసీపీ) అదనంగా డిప్యూటీ పోలీస్ కమిషనర్ (డీసీపీ) పోస్టులతోపాటు అదనపు డీసీపీ, కొత్త ఏసీపీ జోన్‌లను ఏర్పాటు చేశారు. అయితే నాలుగేళ్ల క్రితం ప్రతిపాదించిన అమరావతి పోలీస్ కమిషనరేట్ నేటికీ ఆవిర్భవించలేదు. విజయవాడ పోలీస్ కమిషనరేట్, గుంటూరు రూరల్, కృష్ణా ఎస్పీ పరిధిలోని పలు మండలాలతో అమరావతి పోలీస్ కమిషనరేట్ ఏర్పాటుపై పెద్ద ఎత్తున కసరత్తు జరిగింది. సీఎం చంద్రబాబు, హోంశాఖ ఉన్నతాధికారులు, డీజీపీ, రాజధాని ప్రాంత ప్రాధికారసంస్థ (సీఆర్‌డీఏ) ఉన్నతాధికారులు పలు దఫాలుగా చర్చలు జరిపారు. ఎన్ని జోన్‌లు ఉండాలి, ఎంత మంది అధికారులు, స్టేషన్లు, సిబ్బంది తదితర వాటిపై కూడా ప్రతిపాదనలు రూపొందించారు. అయితే కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని స్టేషన్ల విలీనంపై అభ్యంతరాలు వ్యక్తంకావటంతో ఆ ప్రతిపాదనకాస్త మరుగున పడిపోయింది. అమరావతి పోలీస్ కమిషనరేట్‌ను దృష్టిలో పెట్టుకునే తుళ్లూరులో కొత్తగా పోలీస్ సబ్ డివిజన్‌ను కూడా ఏర్పాటు చేశారు. అయితే అమరావతిలో రాజధాని నిర్మాణం పూర్తికానుందన కొత్త కమిషనరేట్ ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం పక్కన పెట్టినట్లు సమాచారం.

భద్రత బాధ్యత గుంటూరు రూరల్‌కే

అమరావతి ప్రాంతంలో భద్రతా చర్యల బాధ్యతను ప్రభుత్వం గుంటూరు రూరల్ పోలీసులకు అప్పగించింది. ఆ జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో బందోబస్తు, ట్రాఫిక్, నిఘా తదితర వ్యవస్థలు పని చేస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాలు, ఇతర ముఖ్య సమావేశాలు, వీవీఐపీల పర్యటనల సమయంలో మాత్రం ఇతర జిల్లాల నుంచి అధికారులు, సిబ్బందిని రప్పిస్తున్నారు. మార్చి ఐదో తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. ఆ సమావేశాల్లో కొత్త కమిషనరేట్‌లు, అర్బన్ జిల్లాల అప్‌గ్రేడేషన్ ప్రభుత్వం ప్రతిపాదించే సూచనలు కనిపిస్తున్నాయి.

మూడు కమిషనరేట్‌లపై ఆశలు : రాష్ట్రంలో కొత్తగా మరో మూడు పోలీస్ కమిషనరేట్‌లపై పోలీసు అధికారులలో ఆశలు రేకెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న గుంటూరు అర్బన్ పోలీసు జిల్లాను కమిషనరేట్‌గా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదన నాలుగేళ్ల క్రితమే వచ్చింది. రాజధాని ప్రాంతాన్ని మినహాయించి గుంటూరు అర్బన్‌ను విస్తరించి కొత్త కమిషనరేట్ ఏర్పాటు చేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఇప్పటికే ఉంది. అలాగే ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న తిరుపతికి దేశ, విదేశాల నుంచి భక్తుల లక్షలాదిగా వస్తుండటం, తిరుపతి పరిధి పెరిగిన నేపథ్యంలో పోలీస్ కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. ప్రస్తుతం పోలీసు అర్బన్ జిల్లాలో ఎస్పీస్థాయి అధికారి ఉండగా, అప్‌గ్రేడ్ అయితే డీఐజీస్థాయి అధికారి కమిషనర్‌గా వచ్చే అవకాశం ఉంది. అలాగే రాజమహేంద్రవరంలోనూ కొత్త కమిషనరేట్ ఏర్పాటు ప్రతిపాదనలకు మోక్షం లభించలేదు. అదే సమయంలో ఐజీస్థాయి అధికారి కమిషనర్‌గా ఉన్న విశాఖ పోలీస్ కమిషనరేట్‌ను అదనపు డీజీపీస్థాయి అధికారి ఉండే కమిషనరేట్‌గా అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉంది. ఇటీవల జాతీయ, అంతర్జాతీయస్థాయి సదస్సులకు విశాఖ వేదికగా మారటంతోపాటు కేంద్రప్రభుత్వ సంస్థలు, అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఉంది. వీటన్నింటిపైనా ఈసారి అసెంబ్లీ సమావేశాల్లోనైనా ప్రభుత్వం ప్రతిపాదించాలనే డిమాండు ఉంది.

పెరిగిన ఎంపీల జీతాలు

నియోజకవర్గ అలవెన్స్ రూ. 60వేలు

ఫర్నీచర్ అలవెన్స్ రూ. లక్ష : కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ : పార్లమెంట్ సభ్యుల జీతాలు పెరిగాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఎంపీల నియోజకవర్గ అలవెన్సు, ఫర్నీచర్ అలవెన్సు, కమ్యూనికేషన్ వ్యయాలు గణనీయంగా పెరగనున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఎంపీలకు నియోజకవర్గ అలవెన్స్‌ను నెలకు రూ. 45,000 నుంచి రూ. 60,000కు పెంచాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఒక్కసారి ఫర్నీచర్ అలవెన్స్‌ను ప్రస్తుతం ఉన్న రూ. 75,000 నుంచి లక్ష రూపాయలకు పెంచాలని మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఎంపీల జీతాలు ద్రవ్యోల్బణానికి అనుసంధానించి ప్రతి ఐదు సంవత్సరాలకు సవరించే విధంగా శాశ్వత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మూలవేతనంతో కలిపి ఎంపీలకు నెలకు రూ. 50,000 రెమ్యునరేషన్ చెల్లిస్తున్నారు. ఇతర ప్రోత్సాహకాలతో పాటు రూ. 45,000 నియోజకవర్గ అలవెన్స్ ఇస్తున్నారు. కేంద్రం నెలకు ఒక్క ఎంపీ కోసం రూ. 2.7 లక్షలు వెచ్చిస్తోంది. ఇప్పటి వరకు స్పీకర్ మినహా లోకసభలో 536 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఇద్దరు నామినేట్ అయిన ఆంగ్లో-ఇండియన్లు. 8 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. రాజ్యసభలో 239 మంది సభ్యులు ఉన్నారు.

మళ్లీ నీటి వివాదం

(మొదటిపేజీ తరువాయి)


అవసరమన్నారు. అనంతరం మధ్యాహ్నం తిరిగి సమావేశం కావాలని ఇరు ప్రాంతాల ఇంజనీరింగ్ అధికారులు నిర్ణయించారు. ఆంధ్రా ఇంజనీర్లను కంట్రోల్ రూమ్‌కు వెళ్లనీయకుండా ప్రధాన గేటు వద్ద తెలంగాణ పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో గురజాల డీఎస్పీ కేవీవీఎస్ ప్రసాద్, మాచర్ల టౌన్, రూరల్ సీఐలు దిలీప్, సాంబశివరావులు గేటు తీయాలని సిబ్బందిని హెచ్చరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో డ్యామ్ ఆర్‌ఐ అక్కడకు చేరుకొని గేటు తెరిపించారు. అనంతరం సమావేశమైన ఇరు రాష్ట్రాల అధికారులు ఉన్నతాధికారులతో చర్చలు జరిపి కృష్ణా బోర్డుకు సమాచారం చేరవేశారు. అనంతరం కృష్ణా బోర్డు రోజుకు 2వేల క్యూసెక్కుల నీటిని ఐదు రోజుల పాటు విడుదల చేసేందుకు అంగీకరించింది. దీంతో వివాదం సద్దు మణిగింది.

యూనివర్సిటీల బంద్ సక్సెస్

విద్యార్థి, యువజన సంఘాలకు సీపీఐ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీల బంద్ చేపట్టి, విజయవంతం గావించినందుకు ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విద్యార్థి, యువజన సంఘాలకు అభినందనలు తెలిపారు.

ఏపీకి కేంద్రం మొండిచెయ్యి చూపినందుకు నిరసనగా విద్యార్థి, యువజన సంఘాలు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావడం అభినందనీయం. బీజేపీ, టీడీపీ వైఖరుల ఫలితంగా రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యార్థులు, యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. పార్లమెంటు సాక్షిగా చేసిన చట్టాలు, ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిన మోడీ ప్రభుత్వం బూటకపు వాగ్దానాలు చేసిందనేది వాస్తవం. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన చట్టంలోని అంశాలు అమలు చేయకుండా, కేంద్ర బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకుండా ద్రోహం చేయడాన్ని రాష్ట్ర ప్రజానీకం యావన్మందీ ముక్త కంఠంతో ఖండిస్తున్నారు. విద్యార్థి, యువజన సంఘాలు మరో అడుగు ముందుకేసి రాష్ట్రంలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ-తిరుపతి, శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ- అనంతపురం, ఆచార్య నాగార్జున



వర్సిటీ-గుంటూరు, రాయలసీమ వర్సిటీ-కర్నూలు, ఆంధ్రా వర్సిటీ-విశాఖపట్నం, అంబేద్కర్ వర్సిటీ-శ్రీకాకుళం, నన్నయ, జేఎన్‌టీయూ యూనివర్సిటీలలో బుధవారం బంద్ జయప్రదంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్, డివైఎఫ్ఐలకు, విద్యార్థి, యువజనలోకానికి ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి తరఫున అభినందనలు తెలియజేస్తున్నానని ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో మార్చి 5 నుండి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న సందర్భంగా కేంద్రానికి నిరసన గళం వినిపించేందుకు మరిన్ని ఉద్యమాలకు సన్నద్ధం కావాలని విద్యార్థి, యువజనులకు పిలుపునిచ్చారు. మార్చి 6న రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని రామకృష్ణ కోరారు.

ఏయూ బంద్ ప్రశాంతం

విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ బుధవారం ఏయూలో బంద్ ప్రశాంతంగా జరిగింది. అన్ని విశ్వవిద్యాలయాల బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో వర్సిటీలోని పలు విభాగాల వద్ద విద్యార్థి సంఘాలు నిరసన ప్రదర్శన జరిపాయి. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలు నెరవేర్చాలని డిమాండు చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్, నగర కార్యదర్శి అమర్, కన్నబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర, నగర కార్యదర్శి వి.రామనాయుడు ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు ఎల్.జి.నాయుడు, కార్యదర్శి గణేష్, డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు పృథ్వీ, రవితేజ, మోహన్, సిహెచ్.శ్రావణి, గౌతమ్ పాల్గొన్నారు.

గ్రామీణ జీవన ప్రమాణాల మెరుగుదలపై కేంద్రం చర్చ

మంత్రి కాల్వ శ్రీనివాసులు

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో : గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పర్చటంపై కేంద్ర దృష్టి సారించింది. ఇందులో భాగంగా బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ అధ్యక్షతన వివిధ రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు, గృహనిర్మాణశాఖ మంత్రుల సమావే శం ఇండియా హేబిటేట్ సెంటర్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వచ్చే ఆర్థిక సంవత్సరంలో గ్రామీణాభివృద్ధి కోసం ఏ మేరకు నిధులు విడుదల చేయాలి, లక్ష్యాలను ఏ మేరకు నిర్దేశించుకోవాలో సమీక్ష జరిగింద న్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి గ్రామీణ గృహనిర్మాణం విషయంలో 7వ స్థానంలో ఉన్నామని, అయితే కేంద్రం వద్ద కొన్ని వివరాలు లేకపోవటంతో అభివృద్ధి తక్కువగా కనిపించింద న్నారు. ఏపీలో 23వేల ఇళ్ల నిర్మాణం జరిగితే కేవలం 7749 ఇళ్ల ప్రగతి మాత్రమే కనిపించింద న్నారు. 2011లో సామాజిక, ఆర్థిక కుల గణన పేరుతో అర్హులైన లబ్ధిదారుల జాబితాను తయారు చేశారని, అయితే అర్హులైన చాలా మందిని తీసుకోలేదన్నారు.



క్లౌడ్ కనెక్ట్‌ను ఆవిష్కరించిన డెస్క్ ఎరా

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: క్లౌడ్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ డెస్క్ ఎరా తన క్లౌడ్ కనెక్ట్ ప్రోగ్రామ్‌కు సంబంధించి రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలో క్లౌడ్ సెంటర్‌ను నెలకొల్పనుంది. రానున్న రెండేళ్లలో 1000కి పైగా ఉద్యోగావకాశాలు కల్పించనుంది. ఈ భాగస్వామ్య సదస్సు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్‌ల సమక్షంలో డెస్క్ ఎరా సీఈఓ శశాంక్ దీక్షిత్ ఒప్పందాలపై సంతకలు చేశారు. ఈ సందర్భంగా దీక్షిత్ మాట్లాడుతూ, ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, సరళవంతమైన వ్యాపారంలో ఏపీ అగ్రస్థానంలో నిలిచిందన్నారు.

సాఫ్ట్‌వేర్ వృత్తినిపుణులతో కూడిన నైపుణ్య సిబ్బందిని రాష్ట్రం కలిగివుందని, ఈ అనుబంధాన్ని తాము ముందుకు తీసుకెళతామని తెలిపారు. స్థానిక మార్కెట్లలో పటిష్ట మౌలిక వసతులను ఏర్పరచడంపై తమ సంస్థ ఆసక్తితో ఉందని తెలిపారు.

ఇంకెన్నాళ్లీ మోసం

హోదా కోసం మాతో కలిసిరా..

పెట్టుబడుల కోసం మహిళలను అవమానిస్తారా..

రైల్వేజోన్, గిరిజన వర్సిటీ ఇవ్వాల్సిందే

చంద్రబాబుపై రాఘవులు, రామకృష్ణ ధ్వజం

5నుంచి ఢిల్లీలో దీక్ష చేస్తామని ప్రకటన



విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే సరిపోదని, వామపక్షాల నాయకత్వంలో జరుగుతున్న పోరాటంలో కలిసి రావాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణలు కోరారు.

జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రైల్వే జోన్ సాధనకు బుధవారం వామపక్షాలు చేపట్టిన మహాధర్నాకు రాఘవులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ హోదా వల్ల ఒరిగేది ఏమీ లేదని, రాష్ట్రానికి మంచి ప్యాకేజీ వస్తుందని మొదటి మూడేళ్లు చెప్పిన చంద్రబాబుకు నాల్గవ ఏట బడ్జెట్‌లో కేంద్రం మొండిచేయి చూపిందన్నారు. వామపక్షాల నాయకత్వంలో ప్రత్యేక హోదా ఉద్యమం హోరెత్తి విపక్షాలన్నీ కలుస్తున్న తరుణంలో స్వరం మార్చిన చంద్రబాబు హోదా ఇవ్వాలనడం సరిపోదని, తమతో కలిసి ఉద్యమించాలని అన్నారు. హోదా వస్తే లాభాలేంటో చంద్రబాబే అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశారని, 11 రాష్ట్రాల్లో ప్రత్యేక హోదా ఉంటే ఆ రాష్ట్రాల్లో పరిశ్రమల రాయితీలు, పన్నుల రాయితీలు, ప్రయోజనాలు చెప్పిన చంద్రబాబు బీజేపీ నేతల వత్తిళ్లకు తలొగ్గి హోదా వల్ల ఉపయోగం లేదని చెప్పారని రాఘవులు తెలిపారు.

పెట్టుబడుల కోసం సమ్మిట్‌లలో మహిళలను కించపరుస్తూ డ్యాన్స్‌లు చేయించారని, ప్రత్యేక హోదా కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు డ్యాన్స్ వేస్తే పెట్టుబడుదారులు తరలి వస్తారని రాఘవులు ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ మోసకారిగా మరోసారి రుజువు చేసుకున్నారన్నారు. విశాఖ ఉక్కు ఇవ్వలేదని, పోరాడి సాధించుకున్నామని, అలాగే రైల్వే జోన్ కూడా సాధించుకుంటామని చెప్పారు. ఎంపీలు ఎవరు అడ్డు చెప్పారో కేంద్రం తెలియజేయాలన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీతో పాటు గిరిజన యూనివర్సిటీ, కడపకు స్టీల్ ఫ్యాక్టరీ, అనంతపురానికి సెంట్రల్ యూనివర్సిటీ విభజన హామీల్లో వేసని, వీటిని అమలు చేయని బీజేపీతో చంద్రబాబు స్వప్రయోజనం కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడం దుర్మార్గమన్నారు. పోలవరం నిర్మాణానికి రూ.58 వేల కోట్లు ఖర్చవుతుందని, ఇందులో రూ.38 వేల కోట్లు ముంపు నిర్వాసితులకు పరిహారం ఇవ్వాల్సి ఉందని అన్నారు. వీటిపై మాట్లాడని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టు ఎలా నిర్మిస్తారన్నారు. ప్రత్యేక తరగతి హోదా వస్తే పెట్టుబడిదారులు పరిశ్రమలు పెట్టేందుకు రాష్ట్రానికి వస్తారన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలైన డీసీఐతోపాటు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు పూనుకుంటే చంద్రబాబు నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం వామపక్షాలు పెద్దఎత్తున ఉద్యమిస్తాయని రాఘవులు స్పష్టం చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నందున ప్రత్యేక హోదా కోసం ఢిల్లీ వీధులు దద్దరిల్లేలా దీక్షలు చేపడతామన్నారు. మార్చి 1న గుంటూరులో హోదా కోసం రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని, 2న మండల కేంద్రాల్లో వామపక్షాలు దీక్షలు, ఆందోళనలు నిర్వహిస్తారని, 3న తిరుపతిలో వేలాది మంది విద్యార్థులతో మానవహారం, 4న విశాఖ బీచ్ రోడ్డులో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, వామపక్ష పార్టీలు సంయుక్తంగా కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి, 5 నుంచి ఢిల్లీలో హోదా కోసం ఉద్యమిస్తామన్నారు. బీజేపీ నేతలు ఇకనైనా సిగ్గులేని రాజకీయాలు మానుకొని రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడాలన్నారు. రూ.16 వేల కోట్లు లోటు బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు ఇస్తే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. రైల్వే జోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీతోపాటు గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ నెలకొల్పాలన్నారు. శంకుస్థాపనలు చేసిన శిలాఫలకాలకు కనీసం నిధులు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. మోడీ రాష్ట్రాన్ని దగా చేస్తుంటే, ముఖ్యమంత్రిని పూచిక పుల్లలా చూస్తుంటే, ప్రధానమంత్రి అపాయింట్ మెంట్‌కు చంద్రబాబుకు ఏడాది పట్టినా అక్కడే వేలాడదం రాష్ట్ర ప్రయోజనాలకు ముప్పేనన్నారు. వెంకయ్యనాయుడు, చంద్రబాబుల వల్లే రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రానికి హోదా రాకపోయినా వెంకయ్యనాయుడుకు ఉప రాష్ట్రపతి హోదా లభించిందన్నారు.

చంద్రబాబు సొంత అవసరాల కోసమే బీజేపీతో కొనసాగుతున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి కాలేదని, అభివృద్ధి చెందింది టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, అవినీతి అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులేనని అన్నారు. చివరకు చనిపోయినవారి పింఛన్లు కూడా తినేస్తున్న టీడీపీ జన్మభూమి కమిటీ సభ్యులు గ్రామాల్లో, పట్టణాల్లో కోట్లకు పడగలెత్తారని రామకృష్ణ విమర్శించారు. రాష్ట్రంలోని 640 మండలాల్లో ఎక్కడైనా నిరుపేదకు ఎకరా భూమి ఇచ్చారా అని ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తులకు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా పాలిస్తున్నారే తప్ప పేదలను పట్టించుకోవడం లేదన్నారు.

సీపీఐ ఎంఎల్ (న్యూ డెమొక్రసీ) నాయకుడు వై.కొండయ్య మాట్లాడుతూ చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలను మోసం చేయడమే నేర్చుకున్నారన్నారు. అబద్ధాలు చెప్పడంలో ఆయన అగ్రగణ్యుడన్నారు. ఈ ధర్నాలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నర్సింగరావు మాట్లాడారు. ఈ ఆందోళనలో సీపీఐ, సీపీఎం జిల్లా, నగర కార్యదర్శులు బాలేపల్లి వెంకటరమణ, కె.లోకనాథం, ఎం.పైడిరాజు, బి.గంగా రావు పాల్గొనగా, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జేవీ ప్రభాకర్ ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శిగా జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర -మంగళగిరి : సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తిరిగి ఎన్నికయ్యారు. మంగళగిరిలో మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా 24వ మహాసభల ముగింపు రోజైన బుధవారం నూతన సమితిని ఎన్నుకున్నారు. కార్యవర్గసభ్యులుగా చిన్ని తిరుపతయ్య, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఎ.మారుతీప్రసాద్, సీఆర్ మోహన్, షేక్ హుస్సేన్, చవ్వా బాలస్వామిరెడ్డి, పులి సాంబశివరావు, కోట మాల్యాద్రి, గొర్టిముక్కల బాలాజీ, జేటీ శ్రీధర్, చెరుకుమల్లి సింగారావు, తాసా రాంబాబు, బైరాపట్నం రామకృష్ణ, శరణం విజయ్‌కుమార్, ముసునూరి రమేష్, పచ్చల సాంబశివరావు, కేసాని కోటేశ్వరరావు, బూదాల శ్రీనివాసరావు, మందపాటి రమణారెడ్డి, ఆహ్వానితులుగా ఉప్పలపాటి రంగయ్య, వేణుగోపాల్ ఎన్నికయ్యారు. నూతన నాయకత్వాన్ని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు అభినందించారు. ఈ ఏడాది కమ్యూనిస్టులకు పోరాట కాలం అని, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసి ప్రజలకు చేరువ కావాలని వారు ఆకాంక్షించారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ సీపీఐ కార్యదర్శిగా రెండవమారు ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ ధన్య వాదాలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

ఇంటర్ పరీక్షలకు 97 శాతం హాజరు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ప్రారంభమైన ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 97 శాతం హాజరయ్యారు. స్థానిక గేట్‌వే హోటల్‌లో బుధవారం 6 గంటలకు ఇంటర్ ప్రథమ ప్రశ్నాపత్రం సెట్-3ను మంత్రి గంటా శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు పాల్గొన్న కార్యదర్శి ఉదయలక్ష్మి ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగానే పరీక్షా కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. విజయవాడ నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,443 పరీక్షా కేంద్రాల ద్వారా ఇంటర్మీడియెట్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. తొలి రోజున మొదటి సంవత్సరం పరీక్షలకు 5,25,985 మంది విద్యార్థులకుగాను 5,07,890 మంది హాజరయ్యారని, 18,095 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులతోపాటు తాత్కాలిక వైద్య కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. అలాగే సీసీ టీవీ కెమేరాలను ఏర్పాటు చేశామని, దానివల్ల కంట్రోల్ రూం ద్వారా పరీక్షల నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్, ఫోటోస్టాట్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు లేదా ఫిర్యాదులు చేసేందుకు ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ఇది 24 గంటలు పని చేస్తుందన్నారు. ఏ సమస్య ఉన్నా 0866-2974130 నెంబర్ నందు సంప్రదించవచ్చునన్నారు. మొదటిరోజు రాష్ట్రవ్యాప్తంగా ఇద్దరు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కి పాల్పడటం జరిగిందని, మచిలీపట్నంలోని పవిత్ర జూనియర్ కళాశాల కేంద్రంలో ఒక విద్యార్థి, బాపట్లలోని సోషల్ వెల్ఫేర్ కళాశాల కేంద్రంలో ఒక విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు గుర్తించామని, వారిని మాల్‌ప్రాక్టీస్ కమిటీ ముందు హాజరుపర్చి విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఉదయలక్ష్మి చెప్పారు.

డీఏ పెంపునకు జీవో

2017 జనవరి 1 నుంచి వర్తింపు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2.096 శాతం కరవు భత్యాన్ని (డీఏ) ప్రభుత్వం పెంచింది. బేసిక్ పేపై చెల్లించే ఈ డీఏను 2017 జనవరి 1 నుంచి అమలు చేయనుంది. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 22.008 శాతంగా ఉన్న డీఏను 24.104 శాతానికి పెంచింది. పెంచిన డీఏపై ఆర్థికశాఖ బుధవారం మార్గదర్శకాలను జారీ చేసింది. గత ఏడాది ఆగస్టులో 3.668 శాతం డీఏను ప్రభుత్వం పెంచగా, తాజాగా 2.096 శాతం పెంచింది. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు 2015 వేతన సవరణ తరువాత రెగ్యులర్ వేతనాన్ని తీసుకుంటున్న అన్ని జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, గ్రంథాలయ సంస్థల్లో పని చేస్తున్న వారికి కూడా ఈ డీఏ వర్తిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, విశ్వ విద్యాలయాల్లో పని చేస్తున్న వారికి కూడా డీఏ వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. 2006 వేతన సవరణ ద్వారా జీతాలు పొందుతున్న ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థల్లో, న్యాయశాఖలో పని చేస్తున్న ఉద్యోగులకూ పెంచిన డీఏను అమలు చేయనున్నారు. ఈ డీఏ మొత్తాన్ని మార్చి నెల జీతంతో కలిపి ఏప్రిల్ నెలలో నగదు రూపంలో చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది జనవరి1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు డీఏ బకాయిల మొత్తాన్ని ఉద్యోగుల జీపీఎఫ్‌లో ఖాతాలో ఏప్రిల్ నెలలోనే జమ చేయనున్నట్లు ఆర్థికశాఖ తెలియజేసింది.

కేంద్ర అధికారుల డిప్యుటేషన్ ఏడాది పొడిగింపు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి :రాష్ట్రంలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న కేంద్ర సివిల్ సర్వీసు అధికారుల డిప్యుటేషన్‌ను ప్రభుత్వం పొడిగించింది. విభజన నేపథ్యంలో తాత్కాలికంగా కొన్ని కొత్త పోస్టులను ప్రభుత్వం సృష్టించింది. వాటితోపాటు కొన్ని శాఖల్లో డిప్యుటేషన్‌పై 11 మంది కేంద్ర సివిల్ సర్వీసు అధికారులు పని చేస్తున్నారు. వీరి డిప్యుటేషన్ ఈ ఏడాది ఫిబ్రవరి 28తో ముగియగా, మరో ఏడాదిపాటు డిప్యుటేషన్‌ను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి (పొలిటికల్) ఎస్ శ్రీకాంత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐఆర్ఎస్ అధికారులు ఎం రామారావు న్యూఢిల్లీలోని ఆంధ్రా భవన్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా, జీ కోమల్ కిశోర్ యువజన సర్వీసులశాఖ ప్రత్యేక కమిషనర్‌గా, ఐఆర్‌టీఎస్ డాక్టర్ ఏ శ్రీకాంత్ న్యూఢిల్లీలో ఏపీ భవన్ అదనపు కమిషనర్‌గా, పోస్టల్ సర్వీసెస్‌కు చెందిన కె సంధ్యారాణి విద్యాశాఖ కమిషనర్‌గా, కల్నల్ వీ రాముడు (కాలికట్ పీఎంజీ) సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల కార్యదర్శిగా, 1998 ఐపీ అండ్ టీఏఎస్ బ్యాచ్‌కి చెందిన హేమ ముని వెంకటప్ప ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శిగా, లెఫ్టినెంట్ కల్నల్ ఎం అశోక్‌బాబు ప్రొటోకాల్ డైరెక్టర్‌గా, ఐఆర్ఎస్ అధికారి వైవీఎస్‌టీ సాయి ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శిగా, ఐఐఎస్ అధికారి ఎస్ వెంకటేశ్వర్ సమాచారశాఖ కమిషనర్‌గా, ఐఆర్ఏఎస్ అధికారి కేవీవీ సత్యనారాయణ ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శిగా, మరో కేంద్ర సివిల్ సర్వీసెస్ అధికారి కె గురుమూర్తి జీఏడీ అదనపు కార్యదర్శిగా పని చేస్తున్నారు. వీరిలో కొందరు 2014 నుంచి, మరికొందరు 2015, 2016, 2017 నుంచి డిప్యుటేషన్‌పై రాష్ట్రంలో పని చేస్తున్నారు. తాజా ఉత్తర్వులతో వీరి డిప్యుటేషన్ కాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు ఉంటుంది.

సీఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌తో లావాదేవీలు

ఏప్రిల్ నుంచి అమలు - రేసీట్ మాడ్యూల్‌ను ప్రారంభించిన సీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర ఆర్థిక శాఖకు సంబంధించిన సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (సి.ఎఫ్.ఎం.ఎస్) ను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర ఐటీ శాఖ, సాప్ సంస్థ రూపొందించిన ఈ కొత్త వ్యవస్థ - సీఎఫ్ఎంఎస్ రిసీట్‌ల మాడ్యూల్‌ను ముఖ్యమంత్రి బుధవారం ఉండవల్లి నివాసం వద్ద గ్రీవెన్స్ హాల్‌లో ప్రారంభించారు. గతంలో సంక్లిష్టంగా ఉన్న ఆర్థిక లావాదేవీల విధానం ఇప్పుడు సరళతరమయ్యేలా ఈ వ్యవస్థ ఉపకరిస్తుందన్నారు. తాను ముఖ్యమంత్రి అయిన వెంటనే ఈ ఆలోచనను అధికారులతో పొలుపంచుకున్నానని అయితే ప్రభుత్వం మారడం వల్ల కొంతకాలం ఈ ప్రతిపాదన పక్కకు వెళ్లి ఇప్పుడు ఈ విధానం ఆచరణ రూపం దాల్చిందన్నారు. దీనివల్ల ప్రభుత్వ శాఖల ఆర్థిక లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోకి అనుసంధానమవు తాయన్నారు. ఆర్బీఐతో కూడా లావాదేవీలు సులభతరంగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించవచ్చునన్నారు. ఈ వ్యవస్థ సమర్థవంతంగా కింది స్థాయి వరకు అమలు చేయాలంటే గ్రామ పంచాయతీ స్థాయిలోని హాట్ స్పాట్‌లను ఏర్పాటు చేసుకునే ప్రక్రియ ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రతి ప్రభుత్వ శాఖలోని ఖర్చులు, ఆదాయం ఎలా జరుగుతుందో ఎప్పటికప్పుడు ఈ కొత్త ప్రక్రియ ద్వారా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ పరిజ్ఞానంపై 300 ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని, ప్రజల్లో కూడా దీనిపై అవగాహన కల్పించాలన్నారు.

నేడు రేసీట్‌ల వరకే మాడ్యూల్‌ను ప్రారంభించామని, ఖర్చులు, ఇతర మాడ్యూళ్లను కూడా మార్చి నెలాఖరు కల్లా అందుబాటులోకి తెచ్చి ఏప్రిల్ నుంచి ఈ కొత్త విధానం ద్వారానే లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలో ఆదాయాన్ని బట్టి వ్యయం ఉంటుందని, దీనిని ఒక క్రమపద్ధతిలో నిర్వహణలోకి తీసుకొస్తే ఇంకా ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందన్నారు. ఈ ఆలోచనకు ముఖ్యమంత్రి అంకురార్పణ చేసి ఇప్పుడు అమలులోకి తెచ్చారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జె.సత్యనారాయణ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.సాంబశివ రావు, ఎస్.ఏ.పి సీఎండీ డిఎస్ గుప్త, ఆర్థిక కార్యదర్శి రవిచంద్ర తదితరులు మాట్లాడారు, సీఎఫ్ ఎంఎస్ పోర్టల్ ద్వారా వృత్తి పన్ను చెల్లింపు నమూనాను ఈ సందర్భంగా విజయవంతంగా ప్రదర్శించి చూపారు.

రైతాంగ ఉద్యమాలకు తీరని లోటు

ప్రబోధ్ పాండా స్మృతి

సంస్మరణ సభలో వక్తలు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ప్రబోధ్ పాండా ఆకస్మిక మరణం రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం సాగించిన పాండా ఆశయాలను అమలు చేయడమే ఆ మహనీయునికిచ్చే ఘనమైన నివాళిగా వారు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం దాసరిభవన్‌లో పాండా సంస్మరణ కార్యక్రమం జరిగింది. సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్నీడు ఎలమందరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పాండా చిత్రపటానికి ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రావుల వెంకయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాలు నుంచి పాండా మూడు సార్లు ఎంపీగా గెలిచినప్పటికీ నిరాడంబరంగా జీవించారని , రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించే విషయమై ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు డ్రాఫ్ట్ రూపకల్పనలో పాండాతోపాటు అతుల్‌కుమార్ అంజన్ ముఖ్య పాత్రలను పోషించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఉధృతమవుతున్న రుణమాఫీ, రైతుల ఆత్మహత్యల నివారణ ఉద్యమాల నేపథ్యంలో దేశంలోని 184 రైతు సంఘాలను ఐక్యం చేసేందుకు పాండా ఎనలేని కృషి చేసారన్నారు. రైతు సంఘాల ఐక్యతకు కేంద్రబిందువుగా మారిన తరుణంలో ఆకస్మికంగా మరణించడం తీరని లోటుగా ఆయన అభివర్ణిస్తూ, పాండా కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాల్లో పాండా చాలా హుందాగా వ్యవహరించేవారన్నారు. వ్యవసాయ రంగాన్ని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చాలా నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఈ చర్యతో దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ఏపీ రైతు సంఘం (సీపీఎం) రాష్ట్ర అధ్యక్షుడు వై కేశవరావు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయరంగం అతలాకుతలవడంతో అనేక రాష్ట్రాల రైతులు రోడెక్కి ఆందోళన, ఉద్యమాల ద్వారా ఫలితాలను సాధిస్తున్నారని,ఈ సమయంలో పాండా దూరం కావడం దురదృష్టకరమన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతితోపాటు రైతాంగ సమస్యల పరిష్కారం కోసమే జీవితాన్ని అంకితం చేసిన మహనీయునిగా పాండాను కీర్తించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్ మాట్లాడుతూ పాండా స్ఫూర్తితో గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల సమస్యలపై పోరాటాలు సాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజానాట్యమండలి కళాకారుడు ఆర్ పిచ్చయ్య అభ్యుదయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీనటి శ్రీదేవి మృతిపై సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసి, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు వెంకట సుబ్బయ్యతోపాటు పలువురు నాయకులు హాజరయ్యారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

గుంటూరు జిల్లా సీపీఐ మహాసభలో ఓబులేసు పిలుపు



విశాలాంధ్ర -మంగళగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి ఊబిలో కూరుకుపోవటంతో ప్రజల్లో రోజు రోజుకూ వాటి ప్రతిష్ట దిగజారిపోతోందని, ఈ నేపథ్యంలో భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) నిర్మాణాన్ని పటిష్టపర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి ఓబులేసు అన్నారు. మంగళగిరి పట్టణంలో సోమవారం నుంచి జరుగుతున్న సీపీఐ గుంటూరు జిల్లా 24వ మహాసభలు బుధవారం ముగిశాయి. ముగింపు సభలో ఓబులేసు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ అవినీతి పరుల భరతం పడతానని చెప్పిన ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో వేలకోట్ల కుంభకోణానికి పాల్పడిన విజయ్‌మాల్యా, లలిత్‌మోడీ, సంజయ్ బండారీ, నీరవ్‌మోడీ విదేశాలకు పారిపోయినా ఏమీచేయలేక నిస్సహాయ స్థితిలో ఉండిపోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం మాటలు చెబుతూ అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంతీసుకున్న ఆర్థిక, రాజకీయ చర్యల కారణంగా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ట రోజు రోజుకూ దిగజారిపోయి ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. ఇక రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కూడా తప్పులు మీద తప్పులు చేస్తోందన్నారు. చంద్రబాబు అసత్యాలు వల్లిస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. దీంతో ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వంపై కూడా వ్యతిరేకత పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ నిర్మాణాన్ని బలపర్చుకునే దిశగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని ఓబులేసు అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రానున్న కాలంలో ప్రజా సమస్యలపై పోరాటాలకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకురావాలంటే గ్రామశాఖల దగ్గర నుంచి పార్టీని బలోపేతం చేసుకోవాలని, అందుకు తగిన రీతిలో గ్రామస్థాయిలో ప్రజా సంఘాల నిర్మాణంలో ప్రతి కార్యకర్త భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు ప్రతినిధులను ఉత్తేజపరిచాయి.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు : ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-విజయవాడ : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మెను అరెస్టులు చేసి అణచివేయాలనుకోవడం అవివేకమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు దిగిన విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా సమ్మె చేస్తున్న కార్మికులను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో దాదాపు 24 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పీస్ రేట్ పద్ధతిపై అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నారన్నారు. వీరంతా అతి తక్కువ వేతనాలకు పనులు చేస్తూ, మధ్య దళారుల ద్వారా చెల్లింపుల వల్ల నష్టపోతున్నారన్నారు. విశాఖపట్నంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు మద్దతుగా ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల రమణ, సీఐటీయూ నాయకుడు కుమార్‌లను అరెస్ట్ చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న వీరికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండు చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తున్న విద్యుత్ కార్మికులను బెదిరిస్తే సహించేది లేదని, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని లేకుంటే రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఓబులేసు హెచ్చరించారు.

నైపుణ్య శిక్షణ, ముద్రపై ప్రధాని మోడీ సమీక్ష



విశాలాంధ్ర-అమరావతి : ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోడీ ఢిల్లీలోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకెవివై), ప్రధాన మంత్రి ముద్ర (మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ రీఫైనాన్స్ ఏజెన్సీ) యోజన (పీఎంఎంవై) పథకాలను బుధవారం సమీక్షించారు. సచివాలయంలోని సీఎస్ సమావేశ మందిరం నుంచి ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. నేషనల్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) ద్వారా 75 శాతం పీఎంకేవీవై నిధులు వినియోగించి యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించినట్లు అధికారులు ప్రధానికి వివరించారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సుల వివరాలు, పరిశ్రమలు, ప్రైవేటు రంగ భాగస్వామ్య గురించి తెలుపుతూ 33 భాగస్వామ్య పరిశ్రమలు రూ.100 కోట్లు సహాయం అందించాన్నారు. ఈ పథకం ద్వారా శిక్షణ పొంది ఉపాధి పొందినవారి వివరాలు, ముద్ర పథకం ద్వారా రుణాలు తీసుకున్న, చెల్లించినవారి వివరాలను వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, పశుసంవర్థక శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది పాల్గొన్నారు.

సంపాదకీయం

ఆందోళనలో ఆర్థిక వ్యవస్థ

మోడీ నాలుగేళ్ల పాలనలో ఆర్థికవ్యవస్థ అధ్వాన్నంగా తయారైంది. పులిమీద స్వారీ చేస్తున్న వ్యక్తిలాగానే భారత ఆర్థిక వ్యవస్థ ప్రమాదకర మార్గంలో పయనిస్తోంది. 2017–18 ఆర్థిక సర్వే కూడా ఈ వాస్తవాన్ని నిజాయితీతో గుర్తించింది. ఈ ఆర్థిక సంక్షోభానికి ప్రభుత్వమే కారణం కావడం దేశంలో ఎన్నడూ జరగలేదు. అది 2017 ప్రత్యేకతగా నిలిచింది. గతంలో 1965–67, 1973–74 సంవత్సరాల్లో ద్రవ్యోల్బణం అతిగా పెరగడం వల్ల ప్రజా జీవితం దుర్భరంగా మారింది. అయితే అందుకు కారణం ప్రభుత్వ విధానాల్లో లేదు. వ్యవసాయోత్పత్తి పతనం, కరవు, చమురు ధరల షాక్ తదితర కారణాలతో ఆ పరిస్థితి తలెత్తింది. కాబట్టి ప్రభుత్వమే దీనికి బాధ్యత వహించాలని అనలేం. అయితే ప్రభుత్వం ఈ పరిస్థితిని అంచనా వేయలేకపోయిందని విమర్శించవచ్చు. 2017లో పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నమైంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం ప్రతికూలత ప్రభావం కన్నా ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థకు చేటు తెచ్చింది. ప్రభుత్వ నిర్ణయాల వల్ల అంతగా ప్రజలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనడం స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ఎన్నడూ చోటుచేసుకోలేదు. మోడీ హయాంలో వరసగా నాలుగేళ్లుగా ఆర్థిక వ్యవస్థలో చేసిన ప్రయోగాలు భారీ నష్టాన్ని కలిగించాయి. ముఖ్యంగా 2016 నవంబరులో చేపట్టిన పెద్దనోట్ల రద్దు, జవహర్‌లాల్ నెహ్రూ 1947 ఆగస్టు 15 అర్ధరాత్రి చేసిన 'ట్రిస్ట్ విత్ డెస్టినీ (విధిని కలిసిన వేళ) ప్రసంగం సందర్భాన్ని వికారంగా అనుకరిస్తూ వస్తు, సేవల పన్ను(జీఎస్టీ)ను ప్రవేశపెట్టడంతో చిన్న ఉత్పత్తి రంగం కుదేలయింది. తమకు అవసరమైన సేవలు, సరకులు పొందడానికి పౌరులు ఎక్కువ డబ్బు ముట్టజెప్పారు. జీఎస్టీ అమలు తర్వాత ప్రత్యక్ష పన్ను చెల్లింపుదార్ల సంఖ్య 50 శాతం పెరిగిందని సర్వే తెలిపింది. జీఎస్టీ వల్ల ద్రవ్యోల్బణం అదుపులో ఉందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. వాస్తవానికి సరకులు, సేవల ఖర్చు పెరిగింది. స్థూల జాతీయోత్పత్తి వృద్ధికి చెందిన గణాంకాలను ఉటంకిస్తూ ప్రజలపై ఈ విచ్ఛిన్నకర చర్యల ప్రభావాన్ని తక్కువ చేసి చూపే ధోరణిని ప్రభుత్వం ప్రదర్శిస్తోంది. స్థూల జాతీయోత్పత్తి అంచనాలు దుర్బలంగా ఉన్నాయని ఆర్థిక సర్వేనే ప్రతికూల వ్యాఖ్యలు చేసింది. ఆర్థిక వ్యవస్థలోని ఒక రంగం స్థూల జాతీయోత్పత్తిలో సాపేక్షంగా తక్కువ వాటా ఉన్నప్పటికీ జనాభాలో అత్యధిక శాతానికి ఉద్యోగిత కల్పిస్తున్నప్పుడు.. స్థూల జాతీయోత్పత్తి వృద్ధిరేటులో వచ్చే చిన్న మార్పులే విస్తృత ప్రజానీకం జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. కాబట్టి స్థూల జాతీయోత్పత్తిలో చిన్న మార్పునకు కారణమైన చర్యలతో పెద్దగా ఇబ్బంది ఉండదనే ప్రభుత్వ ప్రతినిధుల వాదన సమర్థనీయం కాదు. వ్యవసాయరంగం, చిన్న ఉత్పత్తి రంగం.. రెండు కూడా ప్రభుత్వ చర్యల వల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇవి జనాభాలో అత్యధిక శాతానికి ఉద్యోగిత కల్పించడానికి కారణమవుతున్నాయి. వీటి పనితీరు కుంటుపడితే ద్రవ్యోల్బణం, రైతుల్లో నిరాశ, అశాంతి, నిరుద్యోగం పెరుగుతాయి. రాజకీయ, సామాజిక అనాసక్తత పెచ్చుమీరుతుంది. వీటిలోనూ చిన్న ఉత్పత్తిరంగాన్ని జీఎస్టీ కుళ్లబొడిచింది. జీఎస్టీ 'పన్ను తాటస్థ్యం' లక్ష్యంగా పెట్టుకుంది. అంటే గతంలో సేకరించిన స్థాయిలోనే పన్నులు సేకరించడం. చిన్న ఉత్పత్తి రంగంపై విధిస్తున్న సగటు పన్నురేటు పెరగడం అంటే పెద్ద పెట్టుబడుల రంగంపై విధిస్తున్న సగటు పన్నురేటు తగ్గించడంగా ఉంటుంది. కాబట్టి పన్ను తాటస్థ్యం ఉన్నా.. జీఎస్టీ అనేది పన్ను భారాన్ని పెద్ద పెట్టుబడులుండే రంగం నుంచి చిన్న ఉత్పత్తి రంగానికి పునఃపంపిణీ చేసేదిగా ఉంటుంది. జీఎస్టీ తర్వాత పన్ను సేకరణ పడిపోయింది. ఈ పరిస్థితుల్లో చిన్న ఉత్పత్తి రంగానికి పన్నురేట్లు తగ్గించడం ద్వారా ఉపశమనం అందించే అవకాశం లేదు. కాబట్టి చిన్న ఉత్పత్తిరంగంపై జరుగుతున్న దాడి అధికారులు చెబుతున్నట్టు తాత్కాలికమైనది కాదు, శాశ్వతమైనది. చిన్న ఉత్పత్తిరంగంలో వర్కింగ్ క్యాపిటల్ వ్యయం పెరుగుతున్నది. ఇది మౌలిక నిర్మాణంలో జరుగుతున్న మార్పు. ఇలా దేశచరిత్రలోనే 2017 ఒక ప్రత్యేకత సంతరించుకున్నది. ఆ ప్రత్యేకత ఏమంటే.. కష్టజీవులపైన ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రత్యక్ష దాడి చేయడమే. ఈ నేపథ్యంలో 2018లో జీవన వ్యయం పెరగబోతోంది. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. వాటి గిరాకీ దేశీయంగానూ పెరగడం వల్ల జీవన వ్యయం మరింత భారం కానుంది. చమురు ధరలు తగ్గుతున్నప్పుడే పరిస్థితి మెరుగుకానప్పుడు అవి పెరుగుతున్నప్పుడు ఎలా మెరుగవుతుంది? ఇరాన్‌పై ఆంక్షలు విధించాలని ట్రంప్ ఉవ్విళ్లూరుతున్నాడు. అదే జరిగితే చమురు ధరలు పెరుగుతాయి. దీనితో ద్రవ్యోల్బణం, విదేశీ మారకద్రవ్యపు చెల్లింపుల శేషం, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు తదితర అంశాలపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుంది. మరోవైపు ఎగుమతుల వృద్ధిరేటు పెరిగే అవకాశం కనిపించడం లేదు. అమెరికా మరింతగా రక్షిత విధానాలను అవలంబించటం మూలంగా సాఫ్ట్‌వేర్ ఔట్‌సోర్సింగ్ మీద ప్రతికూల ప్రభావం పడి భారతదేశ సేవారంగ ఎగుమతులు దెబ్బతింటాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి మెరుగవుతున్నదని చెబుతున్నప్పటికీ ఐటీ సంబంధిత సేవలలో ఉపాధి ఇప్పటికే క్షీణిస్తున్నది. భారత ఆర్థిక వ్యవస్థపై ఏర్పడిన ఒత్తిళ్లకు ఇది సూచికగా ఉన్నది. రాబోయే నెలల్లో ఈ ఒత్తిళ్లు మరింతగా పెరుగుతాయి. పారిశ్రామిక రంగం పనితీరు కూడా కనాకష్టంగా ఉంది. నోట్లరద్దు తర్వాత మన పరిశ్రమలు తమ ఉత్పత్తి సామర్థ్యంలో 75శాతం కంటే తక్కువ వినియోగించుకుంటు న్నాయి. స్టాక్‌మార్కెట్ బుడగ పతనమైతే విదేశీ ద్రవ్య పెట్టుబడులు దేశాన్ని వదలిపోతాయి. ఈ క్రమం ఇప్పటికే మొదలైందని చెప్పుకోవచ్చు. ఇది వేగవంతమైతే, ఆర్థిక మాంద్యం నెలకొంటుంది. ఈ బుడగ పతనం కాకపోయినా అమెరికాలో వడ్డీ రేట్లు పెంచినా పెట్టుబడులు భారత్‌నుంచి ఆ దేశానికి తరలిపోతాయి. ఫెడరల్ రిజర్వ్‌బోర్డు ఛైర్మన్ జెరోమి పోవెల్ వడ్డీరేట్లు పెంచాలనే ఆలోచనలో ఉన్నారు. అమేరకు రిపబ్లికన్లు కూడా డిమాండు చేస్తున్నారు. 2007లో స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) లో స్థూల స్థిర పెట్టుబడి రూపొందడం 35.6శాతం దాకా చోటు చేసుకుంది. ఇది 2017లో 26.4 శాతానికి దిగిపోయింది. అలాగే జీడీపీలో దేశీయ ఆదా నిష్పత్తి కూడా 38.3 శాతం నుంచి 29.0శాతానికి పడిపోయింది. భారతదేశ చరిత్రలో ఇటువంటి పెట్టుబడి అటుపోట్లు ఎన్నడూ సంభవించలేదు. పెట్టుబడులు, ఆదా రేట్లు రెండూ పడిపోవడం అనూహ్యమైన పరిణామం. 1991లో 'బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్' సంక్షోభం తరుణంలో కూడా అలా జరగలేదు. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితుల నుంచి ఆర్థిక వ్యవస్థను బయటపడేయటానికి కావాల్సిన నూతన మార్గాలను అన్వేషించడంలో మోడీ సర్కారు నిజాయితీ ప్రదర్శించ లేదు. 'రక్షిత విధానం టెర్రరిజం అంత ప్రమాదకారి' అని దావోస్‌లో భారత ప్రధాని ప్రకటించారు. భారతదేశంలోని ఉత్పత్తిని, విదేశీ మారక ద్రవ్య చెల్లింపుల శేషాన్ని రక్షించుకోవటం, దుందుడుకుగా అయ్యే దిగుమతులను అడ్డగించటం వంటి విషయాలపై ప్రభుత్వానికి సరియైన వ్యూహం లేదని దీనితో తేటతెల్లమౌతున్నది. ఆర్థిక వ్యవస్థకు తక్షణం ఎదురవుతున్న లేదా కొనసాగుతున్న ప్రమాదాలను ఎదుర్కొన డానికి చైనా మాదిరిగా భారత్ వద్ద ఎటువంటి నిర్దిష్ట వ్యూహాలు లేవని స్పష్టమవుతోంది. ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం నేపథ్యంలో అంతకుముందువలే కాకుండా దేశీయ మార్కెట్‌ను విస్తరించుకోవలసిన అవసరాన్ని, ఎగుమతుల మార్కెట్‌పై అతిగా ఆధారపడవలసిన అవసరాన్ని చైనా గుర్తించినది. అందుకే అక్కడి ప్రజలు చైనా ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారు. సంక్షోభం తర్వాత ఈ లక్ష్యాన్ని చేరుకోవటానికి బలమైన విత్త ప్రేరకాన్ని అందించటమే కాకుండా చైనా ప్రభుత్వం కార్మికుల వేతనాలను కూడా బాగా పెంచింది. అలా వేతనాలను పెంచటంతో చైనా ఎగుమతులకు పోటీనిచ్చే శక్తి సన్నగిల్లినప్పటికీ దేశీయ మార్కెట్ విస్తృతమైంది. వాణిజ్య ఆధారిత మారకపు విలువ పెరగటానికి చాలాకాలం తర్వాత అనుమతించటం చైనా దృక్పథంలో వచ్చిన మార్పును సూచిస్తోంది. చైనా తన ఎగుమతులపై ఆధారపడుతుందా లేక దేశీయ మార్కెట్‌ను విస్తృత పరచటంపై తన దృష్టిని కేంద్రీకరిస్తుందా అనే విషయం ఇంకా పూర్తిగా స్పష్టం కాలేదు. అయితే భారతదేశంలోని అధికార వర్గాలలో ఈ విషయాల గురించి మౌనం రాజ్యమేలుతున్నట్టు తాజా ఆర్థికసర్వేని బట్టి అర్థమవుతోంది. ఏ విధంగా చూసినా.. భారత భవిష్యత్తు ఆర్థిక దృశ్యం ఆందోళనకరంగా ఉందనీ, అందుకు మోడీ సర్కారు తగిన మూల్యం చెల్లించుకోబోతున్నదని తేటతెల్లమవుతున్నది. ఆర్థిక స్థితిగతులే రాజకీయ భవితవ్యాన్ని నిర్ధారిస్తాయనడంలో సందేహం లేదు. కాబట్టి పతనమవుతున్న ఆర్థిక పరిస్థితులే బీజేపీ, మోడీ సర్కారు పతనానికి సంకేతాలనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

మోడీ అంకెలగారడీతో బహుపరాక్!


రావుల వెంకయ్య

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత నాల్గవ సంవత్సరం బడ్జెట్ ఫిబ్రవరి 1వ తేది ఆర్భాటంగా ప్రవేశ పెట్టారు. ఇది దాదాపు చివరి పూర్తి స్థాయి బడ్జెట్ అవుతుంది. వచ్చే సంవత్సరం ప్రవేశపెట్టే బడ్జెట్ కేవలం ఓట్ ఆన్ అకౌంట్ గా ఉంటుంది. ఈ బడ్జెట్‌లో గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేకంగా వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసినట్లుగా గొప్పలు చెప్పుకున్నారు. తరచి చూస్తే అది అంకెల గారడీగా మాత్రమే ఉంది.

మొత్తం బడ్జెట్ 21 లక్షల 57 వేల కోట్లు అయితే అందులో వ్యవసాయ రంగానికి రూ.2,39,882 కోట్లు. గత సంవత్సరం రూ.2,06,871 కోట్లు. అంటే తేడా 33 వేల కోట్లు మాత్రమే ! బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెరిగింది 13% మాత్రమే. దీనికి ఇంత ఆర్భాటం అవసరమా? దీని వలన రైతుల అభివృద్ధి ఎలా సాధ్యం అవుతుంది? భారతదేశంలో 60% ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. వారి సగటు అభివృద్ధి రేటు 2.1% మాత్రమే ఉంది. ఇప్పుడు నరేంద్ర మోడీ 14% వృద్ధి రేటుకి తీసుకు వెళతానంటున్నారు. 2022 నాటికి వ్యవసాయదారుల ఆదాయం రెట్టింపు చేస్తామంటున్నారు. ఇప్పుడు రైతుకొచ్చే సగటు ఆదాయం నెలకు రూ.6,350లుగా ఉంది. వచ్చే 5 సంవత్సరాలకు 12,700 కి రావాలన్న మాట. బడ్జెట్‌లో కేటాయింపులు చాలా నిరుత్సాహంగా ఉన్నాయి. వివిధ పథకాలకు 2017–18 కేటాయింపులు 2018–19 కేటాయింపులు చూస్తే తేటతెల్లమవుతుంది. ప్రధాన మంత్రి సిచాయి (నీటిపారుదల రంగం) రూ.7,377 కోట్ల నుండి 8851 కోట్లు రాష్ట్రీయ కృషి వికాస్‌కి 4,750 కోట్ల రూపాయలు ఉంటే ఇప్పుడు 3,600 కోట్లు, ఆహార భద్రత మిషన్‌కి 1720కోట్ల నుండి 1690, జాతీయ భూసార పరీక్షలకు 452కోట్ల నుండి 400, ఆయిల్ పామ్ తోటల అభివృద్ధి 403కోట్ల నుండి 400, సమగ్ర మార్కెటింగ్ పథకం 1189 కోట్ల నుండి 1050, సేంద్రీయ పంటల అభివృద్ధికి 350 కోట్ల నుండి 360, వ్యవసాయ యంత్రాలకు 550 నుండి 1165 కి పెంచారు. దీనిని బట్టి వ్యవసాయ రంగానికి కేటాయిపుల ప్రాధాన్యత ఏమిటో అర్థమవుతుంది.

ఈ రోజు వ్యవసాయ రంగానికి ప్రతిబంధకంగా ఉన్న అంశాలు గిట్టుబాటు ధరలు, రుణమాఫీ, పంటల బీమా అమలు, ప్రకృతి వైపరీత్యాలకు నష్ట పరిహారం, సాగునీటి వ్యవస్థ. ప్రధానమైనది గిట్టుబాటు ధరలు. డా॥ స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం 50% కలిపి కనీస మద్దతు ధరలు నిర్ణయిస్తామన్నారు. ఇప్పటికే రబీకి అమలు జరిపాం. ఇక ఖరీఫ్‌కి మాత్రమే మిగిలి ఉందంటున్నారు. ఉత్పత్తి ఖర్చు, అంటే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, దుక్కి దున్నుట, భూమి కౌలు, కూలి రేట్లు, రైతు కుటుంబం మొత్తం చేసే శ్రమ, పెట్టుబడికి వడ్డీ ఇవి కలిపితే ఉత్పత్తి ఖర్చు అవుతుంది. దాన్ని పరిగణలోనికి తీసుకోవాలి. ధాన్యం ఉత్పత్తి ఖర్చులు క్వింటాల్‌కు రూ.1484 ఖర్చు అవుతుంది. దానికి 50% 742 కలిపితే రూ.2,226 అవుతుంది. ఇప్పుడు ప్రభుత్వం ప్రకటించింది రూ.1550 మాత్రమే. ఉత్పత్తి ఖర్చులు లెక్కింపు సమగ్రంగా లేదు. రైతు కుటుంబం మొత్తం చేసే శ్రమ పరిగణనలోనికి తీసుకోవడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా అన్ని పంటలకు ప్రకటించడం లేదు. 23 పంటలకు మాత్రమే ప్రకటించారు. 4 సంవత్సరాల నుండి గుర్తు రాని డా॥ స్వామినాథన్ కమిటీ సిఫారసులు ఇప్పుడు నరేంద్ర మోడీ గారికి అకస్మాత్తుగా ఎందుకు గుర్తుకు వచ్చాయి. 2015లో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేసి డా॥ స్వామినాథన్ కమిటీ సిఫారసులు ఆచరణ సాధ్యం కాదని అమలు జరుపలేమని రాత పూర్వకంగా ఇచ్చిన ప్రభుత్వం 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రైతుల ఓట్లు పొందాలనే ఉద్దేశంతో డా॥ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేస్తామంటున్నారు.

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు వ్యాపారస్తులు కొనుగోలు చేయకపోతే ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తామంటున్నారు. బడ్జెట్‌లో కేవలం 200 కోట్ల రూపాయలు ఈ పద్దు కింద కేటాయించి వ్యాపారస్తులకు పోటీగా కొనుగోలు చేయడం సాధ్యమేనా? రైతు సంఘాల డిమాండ్ ప్రకారం లక్ష కోట్లు కేటాయిస్తేనే అది సాధ్యమవుతుంది. అగ్రిమార్కెట్ మౌలిక సదుపాయాలకు 2000 కోట్లు కేటాయించారు. ఇది ఏమూలకు సరిపోతుంది. ఇప్పుడు రైతుల పంటలో 6% మాత్రమే మార్కెట్ యార్డుల ద్వారా అమ్ముకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలకు, రైతుల నష్ట పరిహారానికి బడ్జెట్‌లో కేటాయింపే లేదు.

> ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగం కేటాయింపులు చూస్తే అంకెల గారడీలా కనిపిస్తుంది. తరచి చూస్తే రైతుల పాలిట "వట్టి విస్తరి – మంచినీళ్లు" అనే సామెత గుర్తుకు వస్తుంది. మాయల మాంత్రికుడిలా ఉన్న నరేంద్ర మోడీ మాటలు చూసి రైతులు మోసపోకండి. సమగ్ర రైతు ఉద్యమాల ద్వారానే వ్యవసాయం బాగుపడుతుంది. దాని కోసం రైతులంతా ఐక్యంగా బలమైన రైతు ఉద్యమాన్ని చేపడదాం.. రైతు సమస్యలను పరిష్కరించుకుందాం.



ఈ రోజు రైతుల రుణాల సమస్య జటిలంగా మారింది. గత సంవత్సరం రూ.10 లక్షల కోట్లు ఉంటే అదనంగా లక్ష కోట్లు పెంచి 11 లక్షలు చేశారు. అసలు రైతుల రుణ అవసరాలకు కావాల్సింది రూ.20 లక్షల కోట్లు. సగం కూడా ప్రభుత్వ రంగ సంస్థల నుండి రుణాలు పొందలేని రైతులు, ఫైనాన్స్, వడ్డీ వ్యాపారస్తుల నుండి అధిక వడ్డీలకు రుణాలు తీసుకుంటున్నారు. పాలక వర్గాలు రైతుల ఓట్ల కోసం రుణమాఫీని ఒక ఆయుధంగా వాడుకుంటున్నారు. అందుకనే రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్న రుణ విమోచన చట్టం ఊసే ఈ బడ్జెట్ ప్రసంగంలో రాలేదు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కూడా పూర్తిగా రైతుకి ఉపయోగపడేదానికన్నా బీమా కంపెనీల యజమానులకే ఉపయోగపడుతుంది. బడ్జెట్‌లో దీనికి కేటాయించింది రూ.13 వేల కోట్లు మాత్రమే. మొత్తం రైతాంగానికి వర్తింపచేయాలంటే ఇది ఏ మాత్రం సరిపోదు.

ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగం కేటాయింపులు చూస్తే అంకెల గారడీలా కనిపిస్తుంది. తరచి చూస్తే రైతుల పాలిట "వట్టి విస్తరి – మంచినీళ్లు" అనే సామెత గుర్తుకు వస్తుంది. మాయల మాంత్రికుడిలా ఉన్న నరేంద్ర మోడీ మాటలు చూసి రైతులు మోసపోకండి. సమగ్ర రైతు ఉద్యమాల ద్వారానే వ్యవసాయం బాగుపడుతుంది. దాని కోసం రైతులంతా ఐక్యంగా బలమైన రైతు ఉద్యమాన్ని చేపడదాం.. రైతు సమస్యలను పరిష్కరించుకుందాం.

వ్యాస రచయిత : ఉపాధ్యక్షులు,
అఖిల భారత రైతు సంఘం

ఉపాధి హామీ రద్దుకు బీజేపీ కసరత్తు

అరుణ్ శ్రీవాత్సవ


జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎన్ఆర్ఈజీపి) రద్దుకు నరేంద్రమోడీ సర్కార్ రంగం సిద్ధం చేస్తోందా..? అంటే అవుననే జవాబు వస్తోంది. నిజానికి, 2014 ఎన్నికలకు ముందే బీజేపీ ముఖ్య నేతలకు ఈ పథకాన్ని రద్దు చేయాలన్న ఆలోచన తట్టింది. ఈ విషయంలో నేతలందరూ దాదాపుగా సానుకూలంగానే ఉన్నప్పటికీ లబ్ధిదారుల నుంచి వ్యతిరేక వస్తుందనే భయంతో ఉపాధి హామీ పథకానికి చరమగీతం పాడే ధైర్యాన్ని బీజేపీ సర్కారు చేయలేదు. ఎన్నికల తర్వాత కూడా ఈ అంశం చర్చకు రాగా గ్రామీణ ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతుందని భావించిన కమలనాథులు వెనకడుగువేశారు.

తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఈ పథకం 'ఫ్లాప్' అంటూ ప్రచారం చేశారు. వాస్తవానికి పేదరికాన్ని నిర్మూలించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఎన్ఆర్ఈజీపి అందులో సఫలం కాకపోయినా పూర్తిగా విఫలమైందని చెప్పలేం. గ్రామాల్లోని పేదలను చేరుకోవాలనే నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ బీజేపీ మాత్రం దీంతో పాటు లబ్ధిదారులపై అక్కసును పెంచుకుంది. ఈ పథకం ద్వారా 4.3 కోట్ల మంది పేదలకు ఉపాధి లభించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఈ పథకానికి కేటాయించిన నిధులు చాలావరకు ప్రభుత్వ అధికారులు, మధ్యవర్తుల చేతులు మారాయి. తత్ఫలితంగా పక్కదారి పట్టాయి.

సామాజిక సంక్షేమం నేపథ్య ప్రభుత్వ పథకాన్ని ఏ నాడు సమర్థించకపోయినప్పటికీ దీని రద్దు ఆలోచనను మానుకోక బీజేపీకి తప్పలేదు. ఈక్రమంలో నిర్వహణ యంత్రాంగంలో కొన్ని మార్పులు చేసి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు దీన్ని వినియోగించుకోవాలని భావించింది. ఈ పథకం నిధులలో భారీస్థాయిలో కోతలు విధించింది. అయినప్పటికీ ఈ పథకం కొనసాగుతున్నది. పదేళ్ల కిందట ప్రవేశపెట్టిన ఎన్ఆర్ఈజీపి పేదలకు రాజకీయ గళాన్నిస్తోంది. దురదృష్టవశాత్తు, ఈ వర్గానికి చెందిన ఓటర్లు బీజేపీ వైపు మళ్లలేదు. ఈ కారణంగానే మోడీ సర్కారు ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులను పూర్తిగా తగ్గించేసింది.

ఎన్ఆర్ఈజీపి ఓ విప్లవాత్మక పథకం. కానీ మధ్యవర్తుల ప్రమేయం దీన్ని నీరుగార్చింది. పేదరికాన్ని నిర్మూలించడంలో ఈ పథకం పూర్తిగా విఫలమవుతోందన్న ఆరోపణలు ఊపందుకున్నాయి. పనుల కల్పనలోనూ విఫలమవుతోందన్న వాదనలు ఉన్నాయి. ఇవన్నీ కూడా పథకం రద్దుకు సరిపడ కారణాలు కావు. యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) ప్రభుత్వం పేదలకు లబ్ధి చేకూర్చే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకంపై చాలా మంది కన్నుకుట్టింది. దీనిపై పెద్దఎత్తున చర్చలు సాగాయి. ఏదిఏమైనా తమ రాజకీయ సామర్థ్యాన్ని వినియోగించి పేదలకు చేరువయ్యే ఈ పథకాన్ని యూపీఏ సర్కారు ప్రవేశపెట్టడంలో సఫలమైంది.

ఉపాధి హామీ పథకం అమలు ద్వారా పంచాయతీలు బలోపేతమై మరింత క్రియాశీలంగా వ్యవహరిస్తాయని, పేదలకు న్యాయం జరుగుతుందని నేతలు అంచనా వేశారు. అలాంటిదేమీ జరగకపోగా లోభులు, అవినీతి



రాజకీయ నేతలకు ఇది జన్మనిచ్చినట్లయింది. స్థానిక పనులకు సంబంధించిన ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలను గుర్తించి పేదలకు ఉపాధి కల్పించే సదుద్దేశంతో ప్రవేశపెట్టిన పథకం కొంతమంది ధనదాహార్తుల కారణంగా అప్రతిష్టపాలైంది. కొత్తగా ఎన్నికైన పంచాయతీ సభ్యులు సైతం ఈ పథకానికి పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయారు. ప్రభుత్వ అధికారుల ఉచ్చులో నుంచి దాన్ని బయట పడవేయలేకపోయారు. గ్రామీణ పేదల భవిష్యత్‌ను మలచడంలో పంచాయతీల వైఫల్యమే బ్యాంకు ఖాతాల ద్వారా వేతనాల చెల్లింపు డిమాండును తెరపైకి తెచ్చింది. దేశంలో ఆర్థికంగా అత్యంత వెనుకబడిన ప్రాంతాలకు ఎన్ఆర్ఈజీపి పథకాన్ని పరిమితం చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనలకు క్షేత్రస్థాయిలో వ్యతిరేకత ఎదురైంది. ప్రతిపక్ష పార్టీలు సైతం నిరసించాయి. బీజేపీకి చెందిన కొందరు ముఖ్యమంత్రులు ఇష్టపడుతున్న కారణంగానే ఈ పథకాన్ని రద్దు చేయడం కుదరలేదన్న వాదవ కూడా ఉంది. కొన్ని రాష్ట్రాల్లో స్థానిక బీజేపీ ప్రభుత్వాలకు ఈ పథకం దోహదపడిందనడంలో ఎట్టి సందేహం లేదు. వాస్తవానికి శక్తిమంతమైన ఓటర్ల వర్గాన్ని ఏర్పాటు చేసే ఆలోచనకు పాలకులు విరుద్ధం. పార్టీకి మద్దతిచ్చే వర్గాలకు, పట్టణాల్లోని మధ్యతరగతి ఓటర్లకు దీటుగా ఓటు బ్యాంకు సృష్టికి బీజేపీ నాయకత్వంలో ఒకరిద్దరు నేతలు మాత్రమే అనుకూలంగా ఉండడంతో పెద్ద తేడా ఏమీ రాబోదు.

ఇటీవల ఉపాధి హామీ పథకం కింద చెల్లింపులను దాదాపు 19 రాష్ట్రాలలో స్తంభింపజేశారు. జార్ఖండ్, కర్ణాటక, కేరళ, బీహార్, ఉత్తరాఖండ్, త్రిపుర, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రతో సహా 12 రాష్ట్రాలకు ఈ పథకానికి సంబంధించిన నిధులను కేంద్రం విడుదల చేయలేదు. 2017, సెప్టెంబరు నుంచి చెల్లింపులు జరగలేదు. 92 మిలియన్లకుపైగా కార్మికులకు సమయానికి వేతనాలు అందలేదు. ఈ నేపథ్యంలో వేతన బకాయిలు మొత్తం రూ.3,066 కోట్లకు చేరుకున్నట్టు క్షేత్రస్థాయి సంస్థల నెట్వర్క్ 'ఎన్ఆర్ఈజీపి సంఘర్ష్ మోర్చా' ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్రం నిధులను విడుదల చేయాలంటే ప్రతి ఏడాది సెప్టెంబరు 30 తర్వాత అన్ని రాష్ట్రాలు ఆయా ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్లను క్రమంతప్పకుండా పంపాల్సి ఉంటుంది.

ఎన్ఆర్ఈజీపి మార్గదర్శకాల ప్రకారం మస్టర్ రోల్స్ మూసివేతకు 15 రోజుల్లోగా కార్మికులకు చెల్లింపులు జరగాలి. వేతనాలను చెల్లించకపోతే జాప్యం జరిగినన్ని నాళ్లు రోజుకు నిర్దేశిత రేటు చొప్పున పరిహారాన్ని అందించాలి. కానీ ఈ జాప్యానికి సంబంధించి ఎలాంటి న్యాయపరమైన పరిహారాన్ని వారికి అందించలేదు. 2016–17 ఆర్థిక సంవత్సరంలో 43శాతం చొప్పున మొత్తం వేతన బకాయి రూ.1,208 కోట్లకు రూ.519 కోట్లు పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని కేంద్రప్రభుత్వం అంచనా వేసింది. 2017లో తొలి నాలుగు నెలల్లోనే బడ్జెట్‌లో కేటాయించిన దానిలో దాదాపు 80శాతం ఖర్చు అయింది. అదనంగా రూ.17వేల కోట్లు కావాలని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ (ఎంవోఆర్‌డీ) చేసిన విజ్ఞప్తిని కేంద్రప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతానికి 6శాతం మేర నిధులు మిగిలివుండడంతో ఖర్చు, పని విషయాల్లో అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

ఇక్కడ ఆశ్చర్యకర విషయం ఒకటుంది. అదేమంటే.. చాలా రాష్ట్రాల్లో కనిష్ఠ వేతనాలకన్నా తక్కువగా కార్మికులకు చెల్లిస్తున్నాయి. ఈ జాబితాలో 14 రాష్ట్రాలు ఉండడం గమనార్హం. కనీస వేతనాల చట్టం లేదా ఎంజీఎన్ఆర్ఈజీపి వేతన ప్రస్తుత రేటు (ఏది ఎక్కువైతే అది) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు నైపుణ్యంలేని వ్యవసాయ కార్మికులకు ప్రస్తుత కనిష్ఠ వేతన రేటును నిర్ణయించినట్టు 2014 ఎన్ఆర్ఈజీపి వేతన ఇండెక్స్‌లో పేర్కొన్నట్టు యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహేంద్ర దేవ్ కమిటీ పేర్కొంది. కాగా, మోడీ సర్కారు ఎంవోఆర్‌డీ అదనపు కార్యదర్శి నేతృత్వంలో మరో కమిటీని ఏర్పాటు చేసింది. నైపుణ్యత ఆధారంగా వేతనాలు నిర్ణయించే వెసులుబాటు లేదంటూ కొత్త కమిటీ నివేదిక అందించింది. ఇక్కడ న్యాయం, కార్మికుల చట్టపరమైన హక్కులు పరిగణనలోకి తీసుకోలేదు.

ఇదిలావుండగా, ఈ మధ్యనే ముగ్గురు సామాజిక శాస్త్రవేత్తలు స్వతంత్రంగా అధ్యయనాలు నిర్వహించగా వేతనాలు, పరిహారం చెల్లింపు విషయంలో కేంద్రం ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తోందని, కార్మికుల పట్ల బాధ్యతలను నిరాకరిస్తోందని వెల్లడైంది. 2016–17 ఆర్థికసంవత్సరంలో 3,466 గ్రామ పంచాయతీలు ఎన్ఆర్ఈజీపి మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) కింద జరిపిన 90లక్షలకుపైగా లావాదేవీలను, 2017–18లో 3,603 పంచాయతీలు జరిపిన 45లక్షల లావాదేవీలను పరిశీలిస్తే... కేంద్రప్రభుత్వం చెప్పినట్లుగా 85శాతం కాదు కేవలం 32శాతం చెల్లింపులే సమయానికి జరిగినట్టు స్పష్టమైంది.

సమస్యల వలయంలో కస్తూరిభా పాఠశాలలు

కామిడి సతీష్ రెడ్డి

నిరుపేద బాలికలకు నాణ్యమైన విద్యను అందించి వారిని ప్రయోజకులను చేయాలనే దృఢ నిశ్చయంతో కేంద్ర ప్రభుత్వం కస్తూరిభా పాఠశాలలను నెలకొల్పింది. గతంలో మండలానికి ఒక కస్తూరిభా పాఠశాల నెలకొల్పాలనే ఆలోచనలో వున్నా ప్రస్తుతం ప్రతీ నియోజకవర్గంలో రెండు నుండి మూడు కస్తూరిభా పాఠశాలలను నెలకొల్పారు. దాదాపు అన్ని కస్తూరిభా పాఠశాలలకు సొంత భవనాలు కట్టించారు. ఆధునిక హంగులతో తరగతి గదులు, బాలికల వసతికి ప్రత్యేక గదులను కట్టించారు. ఒక్కో కస్తూరిభా పాఠశాలలో సుమారు 250 మంది నుండి 400 మంది వరకు బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి విద్యాబోధన చేయడానికి అనుభవంగల ఉపాధ్యాయులను (మహిళా టీచర్లు) నియమించారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన సాగుతుంది. కొన్ని ప్రాంతాలలో కస్తూరిభా పాఠశాలలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. వీటిపైన సరైన పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయని కథనాలు వినిపిస్తున్నాయి. తాజాగా తెలంగాణలోని మహబూబాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలలోని కస్తూరిభా పాఠశాలల్లో నాణ్యత లేని భోజనం కారణంగా అనేక మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పురుగుల అన్నం, ఉడకని కూరలు పెడుతూ బాలికల కడుపులు మాడుస్తున్నారు. పాఠశాల ఆవరణలు దుర్గంధ భరితంగా ఉండడం, సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తూ బాలికలు అనారోగ్యానికి గురయ్యేలా చేస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురు మండల కేంద్రంలోని కస్తూరిభా పాఠశాలలో ఇటీవల కలుషితమైన ఆహారం తీసుకోవడం వలన 55 మంది బాలికలు తీవ్ర అస్వస్థతకు గురై అనుపత్రుల్లో చికిత్స పొందడం రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. విచిత్రమైన విషయం ఏమంటే బియ్యంలో ఉండే పురుగులను శుభ్రం చేయకుండా పురుగుల అన్నాన్నే వండి పెడుతున్నారని తెలుస్తుంది.

ఆసిఫాబాద్ జిల్లా కౌటాల కస్తూరిభా పాఠశాలలో ఇదే పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్లు, బాత్రూంలు సరిగా శుభ్రం చేయకపోవడం, మురుగునీరు చుట్టూ చేరి దుర్గంధం వెదజల్లడం అన్ని పాఠశాలల్లోని దుస్థితికి అద్దం పడుతోంది. బాలికలకు జ్వరం, వాంతులు, కడుపునొప్పి వచ్చినా పాఠశాలల్లో అధికారుల అశ్రద్ధ, కాంట్రాక్టర్ల అవగాహణ లోపం వల్ల సైడ్ డ్రైయిన్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో పాఠశాల ప్రహారీ పక్కన నీటి గుంటలు ఏర్పడి దోమలకు అడ్డాగా మారుతున్నాయి. విద్యార్థినులకు రుచికరమైన భోజనం పెట్టాల్సి వున్నా వారి కడుపు మాడ్చి, సరైన నాణ్యతగల భోజనం పెట్టకుండా కాలం వెల్లదీస్తున్నారు. తద్వారా బాలికలు సరైన పౌష్టికాహారం అందక అనారోగ్యం పాలవుతున్నారు. ప్రభుత్వం, విద్యాధికారులు స్పందించి కస్తూరిభా పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి. నాణ్యమైన భోజనం అందించాలి. ఏఎన్ఎంలను కస్తూరిభా పాఠశాలల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలి. కలెక్టర్లు, జిల్లా అధికారులు తరచూ సందర్శిస్తూ పాఠశాలలు మెరుగ్గా నడిచేలా ప్రణాళికలు రూపొందించాలి.


కొమ్మ మీద
కోయిలమ్మ!

విశాలాంధ్ర
బతుకు
The Life

గురువారం
01 మార్చి 2018

హోలీ... రంగుల రంగేళి!



ఇలా ప్రకృతి అంతా మైమరిచి వసంతాగమనానికి రంగులు పులుముకుంటే మనుషులు కూడా ప్రకృతిలోని రంగులతో పాటు కృత్రిమ రంగులను కూడా పులుముకుని వసంతునికి స్వాగతం పలకడానికి ముందుకు వస్తారు. ఇలా స్వాగత గీతికలు పలకడమే హోలీ పండగ చేయడం...

ఇంతకుముందు కాలంలో మోదుగుపూలు తెచ్చి మెత్తగా నూరి ఆ నూరిన ముద్దను నీళ్ళల్లో కలిపి ఒకరిపై ఒకరు చల్లుకుంటూ వసంతునికి ఆగమగీతం పాడేవాళ్ళు. కానీ నేడు ప్రకృతి నాగరికతా బంధంలో చిక్కుకునిపోయింది. అపార్ట్‌మెంట్ వ్యవస్థలో చెట్లు అన్నవే కానరాకుండాపోతున్నాయి. ఇక మోదుగుపూలకు స్థానమెక్కడ. ఈ తరానికి అసలు ఆ పూలు ఎలా ఉంటాయో కూడా తెలియవేమో!

రంగురంగుల నీళ్ళు, టమాటాలు, కోడిగుడ్లతో కొట్టుకుంటూ ఇప్పుడు హోలీ ఆడుతున్నారు. ఎలా ఆడినా ఈ హోలీ పండగే ఒక ప్రత్యేకమైనది. మానవాళి మధ్య ఆత్మీయతానురాగాల్ని వృద్ధి చేస్తుంది. సర్వులకూ స్నేహ పరిమళాన్ని అందిస్తుంది. కులం, మతం, ప్రాంతం, వయస్సుతో సంబంధం లేకుండా ఈ వసంతోత్సవాన్ని అంతా ఆడతారు. స్త్రీ, పురుష తేడా లేకుండా అంతా కలిసి సంతోషంగా జరుపుకునే పండగ హోలీ. అలాంటి హోలీని ఆహ్వానించడంలో, హర్షించడంలో, ఆనందించడంలో అందరికంటే మనమూ ఓ అడుగు ముందుండాల్సిందే కదా!

నింగిలోని రంగుల హరివిల్లు ఇంద్రధనుస్సును నేల మీదే ఆవిష్కరించే పండగ హోలీ..."హోలీర రంగ హోలీ, చమ్మకేళిర హోలీ గుల్లా గుల్లా తిర్గినాదే హోలీ" అంటే తెలంగాణ జిల్లాల్లో హోలీ ఉత్సవాలను ఎక్కువగా జరుపుతుంటారు. ప్రకృతి పులకరింపే హోలీ అని అంటారు. వసంత పంచమిన పురుడు పోసుకున్న ప్రకృతి ఫాల్గుణ పౌర్ణమిన యవ్వనంలోకి అడుగిడుతుందా అన్నట్టుగా లేలేత ఎరుపుదనాన్ని సొంతం చేసుకున్న చిగుళ్లు పచ్చచ్చని రంగులోకి మారుతుంటాయి. దాన్ని చూచిన మామిడి తన సంతోషాన్ని జారవిడుస్తున్నట్లుగా పిందెలన్నీ కొమ్మకొమ్మకు వేలాడుతుంటాయి. మాద్దిడి రెమ్మలన్నీ ఎర్రని పూతతో వసంతునికి స్వాగత గీతాలు పాడుతుంటాయి. వేప...వెన్నెల లాంటి తెల్లని పూతను దిగంతాల దాకా వెదజల్లుతుంది. చెట్లన్నీ పచ్చని చిగుళ్ళు వేసి వసంతానికి స్వాగత తోరణాలు కడుతుంటాయి.

కృత్రిమ రంగులతో జాగ్రత్త....!

హోలీ అనగానే అందరికీ గుర్తుకొచ్చేవి రంగులే. హోలీ అంటేనే రంగుల పండగ. ఒకరిమీద ఒకరు రంగులు చల్లుకోవడమే ఈ పండగ విశేషం. అలాగని ఏవి పడితే అవి ఉపయోగించకూడదు. అవి సహజమైనవై ఉండాలి. పూర్వకాలంలో ప్రకృతిలో పువ్వులు, పండ్లు ద్వారా లభించే రంగులనే చల్లుకునేవారు. ఇప్పుడు ఉపయోగించేవన్నీ రసాయనాలతో కూడిన రంగులే. ఈ రంగులను పులుముకోవడం ఇటీవలకాలంలో పరిపాటిగా మారింది. దీనివల్ల చర్మరోగాలు వస్తున్నాయని అనేక సర్వేలు చెబుతున్నాయి. ఈ రంగులు కళ్ళల్లో పడితే కంటిచూపు దెబ్బతింటుంది. చూపు పూర్తిగా పోయే అవకాశాలూ ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తూనే ఉన్నారు. శరీరతత్వానికి పడని రంగుల వల్ల చర్మం కమిలిపోవడం, పొక్కులు రావడం లాంటివి జరుగుతుంటాయి. కాబట్టి రంగుల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

ఎన్నెన్నో పేర్లు...!

మనదేశంలో ప్రతి పండగకు ఒక విశిష్టత, ఒక నేపథ్యం, ఒక చరిత్ర ఉంటుంది. హోలీ పండగకూ ఇవన్నీ ఉన్నాయి. విశిష్టమైన పండగలుగా చెప్పుకునేవాటిలో హోలీ ఒకటి. దీనికి చాలా పేర్లు కూడా ఉన్నాయి. చాలా కథలు ప్రాచుర్యంలో న్నాయి. దీనినే వసంతోత్సవం, కామదహనం అని కూడా వ్యవహరిస్తారు. కాముని పున్నమి, మన్మథ పూర్ణిమ అని కూడా పిలుస్తారు. ఉత్తరాదివారు కాముని కాల్చిన మంటలు ఇవేనంటూ హోలీ నాడు మంటలు కూడా వేస్తారు.

హోలిక అనే రాక్షసి నుంచి ప్రహ్లాదుడిని రక్షించిన రోజు ఇదేనని చెబుతారు. హోలిక మంటల్లో ఆహుతి అయిన రోజు కనుక ఈ పేరుతోనే హోలీ జరుపుతారంటారు. కొంతమంది శ్రీకృష్ణుని బృందావన లీలలను స్మరిస్తూ ఈ వసంతోత్సవాలను జరుపుకుంటారు. యశోదాదేవి బాలకృష్ణుడిని ఊయలలో పడుకోబెట్టిన రోజుగా భావించి ఈ రోజునే బాలకృష్ణుని ప్రతిమను ఊయలలో ఉంచి డోలోత్సవాన్ని జరుపుతారు. ప్రేమకు చిహ్నమైన రాధాకృష్ణుల ప్రతిమలను ఊయల ఊపడం ఈ డోలా పూర్ణిమ ప్రత్యేకత. హోలీకి సంబంధించి వీటన్నింటినీ మించి ప్రచారంలో ఉన్న కథ మరొకటి ఉంది. అది...శివుడికి తపోభంగం కలిగించడానికి మన్మథుడు వసంతగీతం పాడాడు. దీంతో ప్రకృతి అంతా పరవశించింది. చెట్టుపుట్టలు అన్నీ చైతన్యాన్ని పొందాయి. ఆ మార్పుతో పరమేశ్వరునికి తపోభంగం అయ్యింది. దీంతో తన మూడో నేత్రాన్ని తెరిచి మన్మథుడిని బూడిద చేశాడు. కామానికి ప్రతిరూపమైన మన్మథుడిని బూడిద చేసిన ఈ రోజునే హోలీ చేసుకోవడమూ ఆనవాయితీగా మారిందంటారు. ఈ కారణంగానే హోలీ పండగ రోజున భస్మము చల్లుకొంటారని చెబుతారు. కామము అంటే కోరిక. కోరికను దహించుట వలనే కామదహనం అనే పేరు ఈ పండగకు వచ్చింది. అధర్మంతో కోరికలు పెంచుకుంటే అథానుపాలు కాక తప్పదు అని చెప్పడానికే ఈ కామదహనం అనే పండగను చేస్తారు.

– అంగం శ్రీనివాసులు,
హైదరాబాద్.



ప్రకృతిని పరిరక్షిద్దాం!

హోలీ పండగ దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన పండగ. భిన్నత్వంలో ఏకత్వానికి చిహ్నంగానూ ఈ పండగ కనిపిస్తుంది. మన దక్షిణాది రాష్ట్రాల్లో కంటే ఉత్తరాది రాష్ట్రాల్లో దీనిని బహు సరదాగా, సంతోషంగా, ఘనంగా జరుపుకుంటారు. ఈ రోజు భస్మంతో పాటు గోగుపూవుల రంగు, పసుపు కుంకుమలు చల్లుకోవడం సంప్రదాయంగా వస్తోంది. భస్మం, పసుపు నీళ్ళు, గోగుపూవుల రసంతో కొన్ని చర్మవ్యాధులు కూడా నయమవుతాయి. చదువుతో విజ్ఞానం అందుతుందనే కారణంతో ఈ రోజున చదువుల తల్లినీ పూజిస్తారు. కవులు, గాయకులు ప్రకృతి పరవశంపై కవితలు రాయడమూ మనకు తెలిసిందే.

శ్రీకృష్ణదేవరాయలు తన భువన విజయంలో హోలీ ఉత్సవాలను వసంతోత్సవాల పేరిట ఘనంగా నిర్వహించేవారట. కవితా గోష్ఠులను జరిపేవారట. ఇలా ఈ హోలీ పండగ మనుషులను దగ్గర చేయడమే కాదు మానసికానందాన్నీ కలిగిసుతంది. జైమిని ముని రచించిన ఉత్తర మీమాంస అనే గ్రంథంలోనూ హోలీ పండగ వివరాలు ఉన్నాయి. ఏదేమైనా ప్రకృతి పరవశత్వానికి మచ్చుతునకగా నిలిచే ఈ హోలీనాడు పర్యావరణ హితమైన సహజమైన రంగులు మాత్రమే ఉపయోగిద్దాం అనే నినాదంతో పాటు ప్రకృతి సంపదను కాపాడదామన్న కర్తవ్యదీక్షకూ పూనుకోవాల్సిన అవసరం ఉంది. సర్వత్రా సర్వులూ ఇందులో భాగస్వాములు అవుతారని ఆశిద్దాం.

జుట్టుకి రంగులంటాయా...!



హోలీలో ఆనందంగా పాలు పంచుకోవాలని అందరికీ ఉంటుంది. కానీ, ఈ రంగులు ఒంటిమీద, జుట్టుమీద పడితే వచ్చే దుష్ప్రభావాల గురించిన ఆందోళన ఉంటుంది. రంగుల్లో వాడుతున్న రసాయనాలు చర్మాన్ని, వెంట్రుకలను నాశనం చేస్తాయన్నది నూటికి నూరుపాళ్ళు నిజమే. ఈ రంగులు మీద పడ్డాయంటే ఒక పట్టాన పోవు. దీర్ఘకాలం వెన్నంటి ఉంటాయి. ఇలాకాకుండా ఉండాలంటే హోలీ ఆడడానికి ముందు, ఆ తర్వాత కొన్ని జాగ్రత్తలు తీసుకోండి. ప్రత్యేకించి జుట్టు కోసం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.

- రసాయనాలతో కూడిన మందులకు పూర్తిగా దూరంగా ఉండడం మంచిది. ఒకవేళ వాడినా వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ మొహం, జుట్టు మీద పడకుండా చూసుకోండి.
- రసాయనాలతో కూడిన రంగులకు బదులుగా సహజమైన రంగులను ఎంచుకోండి.
- హోలీ ఆడడానికి ముందే జుట్టుకి బాగా నూనె పట్టించండి. జుట్టు కంటే జుట్టు కుదుళ్ళ దగ్గర ఎక్కువ ఆయిల్ ఉండేలా చూసుకోండి. మీకు ఇష్టమైన ఏ ఆయిల్‌ను అయినా రాసుకోవచ్చు. కొబ్బరినూనె, బాదం నూనె లేదా ఆలివ్ ఆయిల్. ఏదో రాశాం అన్నట్టుగా కాకుండా బాగా ఒత్తుగా, ప్రతి వెంట్రుకకూ ఆయిల్ ఉండేలా చూసుకోండి. ఈ నూనె కఠినమైన రసాయనాల కారణంగా జుట్టు పాడవకుండా చూస్తుంది.
- హోలీ తర్వాత తలస్నానానికి షాంపూని ఉపయోగించకండి. ఈ చిట్కాను కొన్ని రోజుల ముందు నుంచే పాటిస్తే ఇంకా మంచిది. షాంపూ జుట్టుని పొడిగా చేసేస్తుంది. దీంతో రంగులు జుట్టుమీద ఎక్కువ ప్రభావం చూపిస్తాయి.
- జుట్టుకి ఎక్కువ పొడిబారిపోకుండా వీలైనంత మాయిశ్చరైజర్ ఉండేలా చూసుకోండి. ఇందుకోసం ప్రత్యేకించి ఏమీ చేయనక్కర్లేదు. షాంపూ ఉపయోగించడం మానేస్తే చాలు. సహజమైన నూనెలు అవే వృద్ధి చెందుతాయి. జుట్టుని బలంగా ఉంచుతాయి. రంగుల ప్రభావం పడకుండా చూస్తాయి.
- హోలీ ఆడేటప్పుడు కురులను వదిలేయకుండా పైకి ముడిపెట్టేయండి. అప్పుడు రంగుపడినా జుట్టు అంతా అంటదు. కొంతభాగానికే ఉంటుంది.
- జుట్టు మీద అసలు రంగు పడకుండా జుట్టుకి మేలిముసుగేయండి. లేదంటే కనీసం స్కార్ఫ్ చుట్టేయండి.
- రంగులు చల్లుకోవడం అయిపోయిన తర్వాత తలస్నానం చేసేటప్పుడు ముందుగా తలమీద మామూలు నీళ్ళు పోయండి. మూడు వంతుల రంగు వదిలిపోయేవరకూ నీళ్ళు పోయండి. ఆ తర్వాతే షాంపూ ఉపయోగించండి. ఇంకా రంగులు ఉంటే నేరుగా షాంపూతో రుద్దండి. అయితే దీనివల్ల ఎక్కువ జుట్టు రాలిపోయే అవకాశమూ ఉంటుంది.
- తలస్నానం అయిపోయిన తర్వాత తలకు నిమ్మరసం రాయండి. ఇది రంగుల కారణంగా పోయిన పీహెచ్ సమతుల్యతను తిరిగి తీసుకొస్తుంది. అయితే నిమ్మరసం రాసుకున్న తర్వాత ఎండలోకి వెళ్ళకూడదు.
- జుట్టు ఆరిపోయిన వెంటనే మళ్ళీ ఆయిల్ రాసేయండి. దీనివల్ల రంగుల కారణంగా పొడిబారిపోయిన జుట్టుకి తిరిగి తేమ అందుతుంది. ఇప్పుడు కూడా ఏ ఆయిల్ అయినా రాసుకోవచ్చు. ఆముదం, కొబ్బరినూనె కలిపి రాసుకోవడం అన్నింటికంటే మంచిది. ఈ చిట్కాలన్నీ పాటించండి. ఎలాంటి ఒత్తిడీ, ఇబ్బందీ లేకుండా హోలీని ఆనందంగా జరుపుకోండి.



హోలీ డ్రింక్!



హోలీ డ్రింక్ పేరు కొత్తగా ఉందా. ప్రతి పండగకి ఒక ప్రత్యేకమైన వంటకం ఉంటుంది కదా! అలాంటిదే ఇది కూడా. దీని అసలు పేరు తాందాయి. దీనినే సర్దాయి అని కూడా పిలుస్తారు. దీని పేరు వింటేనే అర్థమవుతోంది కదా ఇది మన వంటకం కాదని. అవును, దీనిని రాజస్థాన్, ఉత్తర భారతదేశంలో ఎక్కువగా తయారుచేస్తారు. ప్రత్యేకించి హోలీ రోజున ఈ స్వీట్ డ్రింక్‌ను తయారుచేసుకోవడం అక్కడ ఆనవాయితీ. వీలైతే ఈసారి మీరూ తయారు చేసి చూడండి. కొత్త వంటకమని ఏమీ సందేహించనక్కర్లేదు. రుచిలో అమోఘంగా ఉంటుంది. మంచి పోషకాలూ ఉంటాయి. వేసవి వేడి ప్రారంభ కాలంలో ఒంటికి తగిన చల్లదనాన్ని ఇది అందిస్తుంది. మరెందుకు ఇక ఆలస్యం. దీని తయారీ విధానం తెలుసుకుందాం.

కావలసిన పదార్థాలు

గులాబీ రేకులు రెండు టేబుల్ స్పూన్‌లు, గసగసాలు రెండు టేబుల్ స్పూన్‌లు, నల్ల మిరియాలు ఒక టేబుల్ స్పూన్, యాలకులు రెండు లేదా మూడు, పిస్తా పప్పులు ఆరు లేదా ఏడు, లవంగాలు రెండు, పుచ్చగింజలు ఒక టేబుల్ స్పూన్, సోంపు గింజలు ఒక టేబుల్ స్పూన్, బాదం తరుగు ఒయక టేబుల్ స్పూన్, కుంకుమ పువ్వు రెండు, మూడు రేకులు, పాలు రెండు కప్పులు, పంచదార రెండు లేదా మూడు టేబుల్ స్పూన్‌లు

తయారీ విధానం

ఒక గిన్నె తీసుకోండి. అందులో గులాబీ రేకులు, లవంగాలు, నల్ల మిరియాలు, పుచ్చగింజలు, గసగసాలు, సోంపు గింజలు, బాదం తరుగు, పిస్తా పప్పులు, యాలకులు వేసి కొద్దిగా నీళ్ళు పోసి రెండు గంటలు నానబెట్టండి. తర్వాత ఇవన్నీ మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయండి. ఇందులోనే చివరలో పంచదార కూడా వేసి మెత్తగా అయ్యేవరకూ ఉంచండి. శుభ్రమైన గిన్నె తీసుకుని దానిమీద పలుచని వస్త్రం వేసి ఇదంతా అందులో వేసి వడకట్టండి. మిక్సీ జార్‌లో రెండు కప్పుల కాచి చల్లార్చిన పాలు, కుంకుమ పువ్వుతో పాటు వడకట్టిన మిశ్రమం కూడా వేసి మరోసారి మిక్సీ పట్టండి. దీనిని గ్లాసులోకి తీసుకుని పైనా గులాబీ రేకులు చల్లండి. అంతే హోలీ డ్రింక్ రెడీ. ఇందులో ఉపయోగించే పదార్థాల రుచి కచ్చితంగా తెలియాలంటే వీటన్నింటినీ కచ్చితంగా తయారీకి ముందు రెండు గంటలు నానబెట్టండి. ఇది ఏ కాలంలో తాగినా ఆరోగ్యానికి మంచిదే.





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

...టెలిఫోనులో సుభ నవ్వులు విన్న క్షణం నుంచీ అన్ని చికాకులూ మాయం అయిపోయాయి. జపాను వాడి దండ యాత్ర, హిట్లరు దిగ్విజయం, దేశంలో అయోమయపు పరిస్థితులు, ఇక్కడ ప్రజ యిక్కూ వాకిక్కూ వదిలేసి పారిపోవడం, బర్మానుంచి బతుకు జీవుడా అని తమ సర్వస్వం వదులుకుని పారి పోయి వచ్చిన కాందిశీకులు. కరువుకాలంలో చిన్నజీతగాళ్ళు మంగలంలో పేలాల్లాగు మాడిపోవడం, పెద్ద అధికార్ల లంచగొండితనం, నీతి జాతి పోయి దబ్బే ప్రధానం అవడం, నేను కూము మీద బకింగుహాము కెనాలు మీద కట్టబోయే వంతెనలు, అందుకు ఇనుము వంతెనలు' - మొన్న పెద్దదొర నాకు చెప్పిన పాఠం, అన్నీ మర్చి పోయాను...ఇవన్నీ కల్ల, ఆమె నవ్వే వాస్తవం!

(నిన్నటి సంచిక తరువాయి)

7 ఆమె

అమ్మ, పాపాయి రైలుకొచ్చారు. నాన్న బెంగుళూరు వెళ్ళారుట – అక్కడ జరుగుతూన్న ఒక పెద్ద వ్యాజ్యంలో ఇంగ్లీషు కంపెనీ వాళ్ళకీ సలహా యివ్వడానికి. జనార్ధనరావు రైలుకి రాకుండా వుంటాడా అని నాలుగు నిమిషాలు అటూ ఇటూ చూశాను. "ఏం? తెలిసిన వాళ్ళెవరైనా రైల్లో కనిపించారా ఏమిటి?" అని అమ్మ అడిగింది. "లేదు. సూళ్ళూరు పేటలో ఎవరో రైలు ఎక్కుతూంటే, తీర్థగిరి వస్తావా అని నేను అడిగితే 'ఆది ఆది!' అన్నాడు. ఎంచేత రాలేదో మరి?

భోజనం చేశాక అమ్మ అడిగింది – "సోమవారమే బయలు దేరుతామని అన్నావే. విశాఖపట్నం నుంచి ఫోనుచేస్తు మరి ప్రయాణం ఆలస్యం అయ్యిందేమి" అని. శివమ్మగారు బొబ్బిలి నుంచి ఆదివారమే వచ్చేసినా బలవంతం చేసి రెండు రోజులుంచేసింది. మనవడు పుట్టాడని పార్వతీశం గారు మహా ఆనందపడిపోతున్నారు.

సింగరాజుగారి ఆస్తి ఇక మనదేకదా అని చంకలు గుద్దుకుంటున్నారాయన. మాలతికి పురుడు యెలా వచ్చిందనికాని, బాధలు పడుతూంటే ఆస్పత్రికి ఎలా తీసుకువెళ్ళావని కాని నన్ను వాళ్ళడగనూ లేదు, నేను చెప్పనూ లేదు. వాళ్ళు ఇంటి కొచ్చేసరికి వంట బ్రాహ్మణుడూ, బంట్రోతులూ, పనిమనిషి నా పుణ్యమా అంటూ ఒక్కొక్కళ్ళే యధాప్రకారంగా పనిలోకి వచ్చేశారు. లేకపోతే ఇల్లు చక్కబెట్టు అంతా నామీదే పడేది: తండ్రికి తల్లికి వచ్చిన రోజంతా మాలతినీ, మనవడినీ ఆస్పత్రిలో చూడ్డంతో సరిపోయింది. భోజనాలకి మాత్రం ఇంటికి వచ్చేవారు. శివమ్మగారితో ఇంటి కొచ్చిన రెండోరోజున: "మాలతికి పురుడొచ్చింది. మగ పిల్లాడు పుట్టాడు. నేనింక ఈవేళ మెయిలుకి చెన్నపట్నం వెళ్ళిపోతాను" అని నేనన్నాను. "నువ్వు వెళ్ళిపోతానంటే యెలాగు అమ్మడూ? అంత దూరం నుంచి రానేవచ్చావు. చింతపండు పిక్కతీయించి దిమ్మలు చేయించి అటుకుమీద సర్దించాలి. సాయానికి నాకు మరెవ్వరున్నారు చెప్పు? పిక్క తీసే టప్పుడూ, తూనిక వేయించి దిమ్మలు చేయించే టప్పుడు సొంతమనిషి ధరణా, కూచోకపోతే కూలి ముండలూ, బంట్రోతు వెధవలూ యేకమయి చింత పండూ, నూనె పిక్క అన్నీ వాళ్ళ యిళ్ళకి తరలించేసుకు పోయి, యిల్లు గుల్ల చేసేస్తారు. ఆయన వున్నారన్న మాటేగాని వుత్త సత్యకాలపు మనిషిగదా! ఎంతసేపు దస్తావేజులు తియ్యనూ, వడ్డీలెక్కలుకట్టి పద్దులు వేసుకోనూ – ఇదేగొడవకాని సంసారం ఎలా వెళుతూందని ఆలోచనే లేదుకదా ఆయనకి. నీకు తెలియనిదేముంది అమ్మడూ? ఇంట్లో ఆడటొక్టైన కాబట్టి నీ దగ్గిర నా గొడవ వెళ్ళబోసుకుంటున్నాను. అంచేత నువ్వుండి కాస్త అజమాయిషీ చేసిపెడుదూ! పాపం, నువ్వుండే చింతపండంతా ఎండలో వేయించావు కూడాను! అది బాలింతరాలై కూచుందాయె!" అని బలవంతాన నన్నుంచేసింది. ఆవేళ ప్రయాణం మానిపించి. ఏంచెయ్యనుమరి? ఆవేళల్లా మాలతిని చూడనేలేదు. మర్నాడు మాలతిని చూసి - మెయిల్లో బయలు దేరి వచ్చాను" అన్నా. "బాంబింగు విశేషాలు – మాలతిని ఆస్పత్రికి తీసుకు వెళ్ళడం – అన్నీ. మరోమాటు చెప్పు – సుభా! ఆవేళ టెలిఫోనులో సరిగ్గా వినపడలేదు" అంది అమ్మ.



విశేషాలన్నీ పూసగుచ్చినట్టు చెప్పాను. "మదనం సంగతి చెప్పావుకావు" అంది అమ్మ. అతను వికార చేష్టలు చెప్పా. అమ్మ కడుపుబ్బేటట్టు నవ్వి – నన్ను కౌగలించుకుని ముద్దుగా నా బుగ్గమీద పరిచింది! "మదనం బొబ్బిలి నుంచి వచ్చాక ఏమన్నాడు?" అని అడిగింది. "ఏమని అడగడమేమిటి? 'నా కోసం ఎవరేనా వచ్చారా?' అని అడిగేడు – రాగానే.'నువ్వు వూళ్ళో లేవని తెలిసి టోజో ఇక్కడ దిగలేదని – మళ్ళీ క్రిష్టమస్‌కి వస్తాననీ – అప్పటికి నిన్ను తప్పకుండా ఇక్కడ వుండమనీ – మనిషి చేత ఖబురు చేశా'డన్నా. 'మనిషి యెలా వచ్చాడు?' అని అడిగేడు. 'ఎలా రావడమేమిటోయి వెర్రినాయనా! గాలి గుమ్మటం మీదనుంచి ఎగిరి మీ దాబామీద వాలేడు. ఆరాచువ్వ నడుముకి కట్టుకుని చరచని ప్లేనులోకి మళ్ళా ఎగిరిపోయాడు!" అన్నా. ఆంత ఐ.సి.యస్. వాడూ నమ్మేడు సుమా – అమ్మా! నేను వెళ్ళిపోయేటప్పుడు 'మళ్ళీ యెప్పుడు రావడం?' అని అడిగేడు. 'పెళ్ళిముహూర్తం నిశ్చయం చేసి రాయి. తప్పకుండా వస్తాను' అన్నా. పరమానందభరితుడైపోయి – ఫలహారాల శాలనుంచి అవళంగా నాలుగు చాక్లెట్టు డబ్బాలు తీసికొచ్చి ఇచ్చాడు. నేనలా అనడంలో తప్పేంలేదుకదే అమ్మా?" అన్నాను. అమ్మ నన్ను కౌగలించుకుని 'శ్లేష వేసి ఆశ చూపించావు!' అంది నవ్వుతూను. "వుత్త నీచుడమ్మా!" అన్నాను. అని "నాన్నేమంటా రోనే – అమ్మా?" అన్నా. "నాన్నేమంటే నీకేం! నీ మనసే నీకు ప్రధానం!" అని నన్ను ముద్దుపెట్టుకుంది.

నాన్న బెంగుళూరు నుంచి సాయంత్రం కారుమీద వచ్చారు. రాగానే నన్ను పలకరించారు."ఒసేవ్ – సుబ్బడూ! ఎప్పుడొచ్చావేవ్? మదనం యేమంటున్నాడు?" అన్నారు. మదనం బొబ్బిలి పారిపోవటం – చదీచప్పుడు లేకుండా మూడో నాటికి విశాఖపట్నం వచ్చి కచేరి చేయడం చెప్పాను. అతను ఇచ్చిన చాక్లెట్ల డబ్బాలు చూపించి – నాన్నకి నాలుగు చాక్లెట్లు ఇచ్చాను. "మహారుచిగా వున్నాయే! వాడు ఖలేగడుసువాడు సుమా! నేను చెబుతున్నాను విను! జపానువాడురానీ – బ్రిటీషు వాడే వుండనీ, లేదా స్వరాజ్యమే వచ్చిపడనీ, మదనం మంచి అదృష్టజాతకుడు. వాడికి అష్ట యిశ్వరాలు – అష్టభోగాలు – రాసివుంటే రెవెన్యూ బోర్డు మెంబరుగిరీ గవర్నరుగిరీ ఎవడు తప్పించగలడంటా? ఇప్పుడు మేనల్లుడికి నాలుగైదు లక్షల ఆస్తి దఖలుపడుతూంది. పార్వతీశంగారి సంపాదనే వుంది. పది లక్షలు. వాడికోసం తెరవెనుక యెవర్తివుందోకాని, మహారాణీ భోగం అనుభవిస్తుందనుకో!" అన్నారు నాన్న నా బుగ్గగిల్లుతూ. "సర్వేరాళ్ళు మార్చి, న్యలాలు అమ్మించి, లంచాలు కాజేసి సంపాదించి డబ్బులేగా" అన్నాను నేను ఉండబట్టక. దాంతో నాన్నకి ఎక్కడలేని కోపమొచ్చింది. "ఈ కమ్యూనిస్టు మాటలు ఎన్నాళ్ళయి నేర్చావంటా? ఈమాటు అన్నావు సరిపోయింది. మళ్ళీ ఈ ముక్కలు నీ నోటంట విన్నావా –నేను ఒప్పుకునేది లేదు – సుభా! ఇప్పుడే చెపుతున్నాను. తరువాత నన్నని లాభం లేదు! శాంతం! నీనించే అది చెడిపోతుంది!" అన్నారు నాన్న విరుచుకుపడుతూ. "శాస్త్రీ! నేను స్వచ్ఛమైన గాంధీవాదినై యుండి దానికి కమ్యూనిజం నేర్పుతున్నానా? మనకీ వాళ్ళకీ పచ్చగడ్డేస్తే భగ్గుమనీ మండుతుందికదా! ఆ మాటకే కనక వస్తే – రాజగోపాలచారిగారి నాయకత్వంకింద మీ 'లెజిస్లేచరుపార్టీ' తీర్మానానికిన్నీ – కమ్యూనిస్టుల విధానానికిన్నీ నాకేం తేడా కనిపించడంలేదు. 'నేషనల్ ఫ్రంటు-ఫాసిస్టు వ్యతిరేకత' వాళ్ళు మొదటినుంచీ అంటున్నారు. మీరు యీవాళ అంటున్నారు. జిన్నాతో పొత్తే అని మీరూ చెవికోసుకున్న మేకలా అరుస్తున్నారుగా!" అంది అమ్మ. "శాంతం! నువ్వేన్నన్నా సరే, కమ్యూనిస్టులు మాత్రం ముమ్మాటికీ దొంగలు! నిన్నటివరకూ సామ్రాజ్య వాదుల యుద్ధమా? రష్యా యుద్ధంలో చేరగానే ప్రజాయుద్ధంగా మారిపోయింది! నాలిక యెలా తిరుగితే అలాగే? వాళ్ళు స్టాలిను గులాములు! బ్రిటిష్‌వాళ్ళ పంచమాంగదళం – దేశద్రోహులు – ఛీ!" అన్నారు నాన్న. "కాంగ్రెస్ వాళ్ళుకూడా అలాగే అనలేదూ? మొదటిలో ఇది సామ్రాజ్యవాదులు వాళ్ళలో అన్నారుకారూ? క్రిప్సు వెళ్ళిపోయాకనన్నా అన్నాడు జవహర్‌లాలు – 'మన దేశాన్ని రక్షించడానికి అమెరికావాడూ, బ్రిటీషువాడూ సాయ పడుతూంటే నేనేం చెయ్యడంలేదే' అని నెత్తీ నోరూ కొట్టుకోలేదూ? ఈ మాటలు కాంగ్రెసు వాళ్ళనొచ్చు – బోసు జపాను వాడితో చేతులు కలపొచ్చు – ఏమి సబబు? ఇంతకీ నేనేమిటన్నానని అమ్మా!" అన్నాను కొంచెం జోరుగానే. "అదంతా రాజకీయం – ఇదంతా గృహచ్ఛిద్రం. అందుచేత కమ్యూనిస్టు ప్రలాపాలు ఇక్కడ పనికిరావు! బోధపడిందా? బోధపడిందను!" అన్నారు నాన్న గద్దించి.

"శాస్త్రీ! యీ దబాయింపు నేను సహించను. ఈ యింట్లో మాత్రం ఎవరి అభిప్రాయాలు వాళ్ళవే – ఎవరి స్వేచ్ఛ వాళ్ళదే. దాని కిష్టం వుంటే కమ్యూనిస్టుల్లో చేరుతుంది – దాని స్వతంత్రం దానిది!" అంది అమ్మ.

"హిందూ మహాసభలో చేరితే నాకేం అభ్యంతరంలేదు! దాని స్వేచ్ఛని నేను పూర్తిగా మన్నిస్తాను" అన్నారు నాన్న.

"నేను యింతవరకూ యే రాజకీయపక్షంతోనూ చేరలేదు, చేరబోనేమో కూడా, నాన్నా!" అన్నా.

"ఆ మాట ముందే యేద్చుంటే – ఈ రాద్ధాంతం అంతా లేకపోనే!" అన్నారు నాన్న.

అమ్మా, నేనూ నవ్వుపట్టలేకపోయాం. "నేను యెప్పుడేనా చేరితే, కాంగ్రెసు సోషలిస్టుల్లో చేరతానేమో!" అన్నా.

"సరి! యేలేశ్వరం వెళ్ళినా శనేశ్వరం పోలేదన్నట్టుంది. ఆ సోషలిస్టుకూడా ఎందుకు? కాంగ్రెస్సే చాలు – అన్నింటికీ కన్నతల్లి!" అన్నారు సగం నవ్వుతూ, సగం కోపంగానూ.

"నాకింకా యెన్నో పుస్తకాలు చదవాలని వుంది నాన్నా! అవన్నీ చదివాక యేదో ఒకటి నిశ్చయిస్తా. నేను సీమనుంచి తెచ్చిన పుస్తకాలు పుస్తకాల్లాగే వున్నాయి!" అన్నా.

"ఆ చెత్తంతా అలాగే ఉంచేయి. వాటిని చదివి బుర్ర పాడు చేసుకోకు. నా లండన్ స్కూలు ఆఫ్ ఎకనామిక్సు పుస్తకాలు లాస్కీ, వెబ్బు, బెర్నార్డుషా వెల్సు, గ్రహాం, వాల్లేసు, హెన్రీ జార్జీ, సామ్యుయల్, బట్లరు బోలెడున్నాయి. మీ అమ్మదగ్గిర గాంధీ సారస్వతం బీరువానిండా బీరువాడుంది. – ఇంకా వుంది.

స్వచ్ఛ భారత్‌కు కేటాయించిన నిధులు ఎన్ని?

(నిన్నటి సంచిక తరువాయి)

71. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద పేద మహిళలకిచ్చే ఉచిత గ్యాస్ కనెక్షన్ల సంఖ్య లక్ష్యం ఎంతగా నిర్ణయించారు ?
1. 5 కోట్లు 2. 8 కోట్లు
3. 7.5 కోట్లు 4. 9 కోట్లు

72. ఏకలవ్య పాఠశాలల గురించి క్రిందివాటిలో వాస్తవలు ఏవి ?
1. వీటిని 2022 నాటికి ఏర్పాటు చేస్తారు.
2. ఎస్టీల జనాభా 50శాతం కన్నా అధికంగా ఉన్న బ్లాకులలో
3. 20,000 గిరిజనులు ఉండే ప్రాంతంలో ఏర్పాటు
4. పైవన్నీ

73. జాతీయ ఆహార భద్రతా పథకం కింద దాదాపు ఎంతమందికి రాయితీ మీద ఆహార ధాన్యాలను ఇచ్చేందుకు సిద్ధమయ్యారు ?
1. 50 కోట్ల మందికి 2. 80 కోట్ల మందికి
3. 40 కోట్ల మందికి 4. 65 కోట్ల మందికి

74. ఆడపిల్లల అక్రమ రవాణాను నిరోధించడానికి కేంద్ర బడ్జెట్‌లో ఎంత కేటాయించారు ?
1. రూ.60 కోట్లు 2. రూ.80 కోట్లు
3. రూ.100 కోట్లు 4. రూ.110 కోట్లు

75. స్వచ్ఛభారత్‌కు కేటాయించిన నిధులు ఎన్ని ?
1. రూ.17,843 కోట్లు 2. రూ.15,434 కోట్లు
3. రూ.19,240 కోట్లు 4. రూ.16,771 కోట్లు

76. స్వచ్ఛభారత్ అమలులో ముందున్న నగరం ఏది ?
1. తెలంగాణలోని హైదరాబాద్ 2. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్
3. కర్ణాటకలోని మైసూర్ 4. గుజరాత్‌లోని రాజ్‌కోట్

77. ప్రస్తుతం దేశంలో బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలు ఎన్ని ?
1. 2.34 లక్షలు 2. 4.02 లక్షలు
3. 3.13 లక్షలు 4. 5.08 లక్షలు

78. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు ?
1. 2015 అక్టోబర్ 2 2. 2014 అక్టోబర్ 2
3. 2016 అక్టోబర్ 2 4. 2014 జనవరి 30

79. ప్రస్తుతం భారతదేశం జీడీపీలో పరిశోధనలకు వెచ్చిస్తున్నది ఎంతశాతం ?
1. 0.85% 2. 2.3% 3. 3.58% 4. 4.25%

80. భారతదేశంలో విశ్వవిద్యాలయాల సంఖ్య ఎంత ?
1. 963 2. 864 3. 718 4. 916

81. దేశంలో ఎన్ని కళాశాలలు ప్రైవేట్ యాజమాన్యాల చేతిలో ఉన్నాయి ?
1. 70% 2. 85% 3. 77.8% 4. 90%

82. భారతదేశంలో 15-29 ఏళ్ల భారతీయ యువతలో 30.83 %ని ఏవి బాధిస్తున్నాయి ?
1. నిరుద్యోగం 2. అవిద్య
3. శిక్షణ లేమి (నీట్) 4. పైవన్నీ

83. వ్యక్తిగత ఆదాయపు పన్ను, కార్పొరేటు పన్నుపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 4 శాతం ఆరోగ్య, విద్యా సెస్ విధించడం వల్ల కేంద్రానికి ఎంత ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు ?
1. రూ.11,000 కోట్లు 2. రూ.23,000 కోట్లు
3. రూ.18,000 కోట్లు 4. రూ.24,000 కోట్లు

84. దిగుమతి చేసుకున్న వస్తువులపై ఇప్పటివరకు విద్యా సెస్, మాధ్యమిక ఉన్నత విద్యా సెస్ అమల్లో ఉంటే దీనిని రద్దుచేసి దాని స్థానంలో ఎంతశాతం సాంఘిక సంక్షేమ సర్‌ఛార్జ్ విధిస్తున్నారు ?
1. 4% 2. 10% 3. 15% 4. 12.5%

85. పెట్రోలు, డీజిల్ మీద ప్రాథమిక ఎక్సైజ్ డ్యూటీని తగ్గించి మరియు అదనపు ఎక్సైజ్ డ్యూటీని రద్దుచేసి, దాని స్థానంలో ఎన్ని రూపాయలు రోడ్డు సెస్ విధిస్తున్నారు ?
1. రూ.10 2. రూ.6 3. రూ.2 4. రూ.8

86. ఏ కేంద్ర పన్నులు జీఎస్‌టీలో కలిసాయి ?
ఎ. కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ
బి. అదనపు ఎక్సైజ్ డ్యూటీలు
సి. ప్రత్యేక అదనపు కస్టమ్స్ డ్యూటీ
డి. కొన్ని సర్‌చార్జీలు, సెస్‌లు
ఇ. సేవా పన్ను
1. ఎ, బి, సి మాత్రమే 2. బి, సి, డి, ఇ మాత్రమే
3. ఎ, బి, సి, డి మరియు ఇ 4. బి, డి లు మాత్రమే

87. జీఎస్‌టీలో కలిసిన రాష్ట్ర పరోక్ష పన్నులు ఏవి ?
ఎ. వ్యాట్ బి. కేంద్ర అమ్మకం పన్ను
సి. వినోదపు పన్ను డి. ప్రకటనలపై పన్ను
ఇ. లగ్జరీ పన్ను
1. ఎ, బి, సి, డి మాత్రమే 2. బి, సి, డి, ఇ మాత్రమే
3. ఎ, సి, ఇ మాత్రమే 4. ఎ, బి, సి, డి, ఇ

88. ఆకర్షణీయ నగరాలకు కేటాయింపులు ఎంత ?
1. రూ. 6,169 కోట్లు 2. రూ.7,418 కోట్లు
3. రూ.8,147 కోట్లు 4. రూ.4,175 కోట్లు

89. వ్యవసాయ దిగుబడులు వృధా అవ్వకుండా పరిరక్షించడంతోపాటు రైతు ఆదాయాన్ని పెంచాలనే ఉద్దేశంతో 2018-19 బడ్జెట్‌లో ఆహార తయారీ పరిశ్రమకు ఎంత మొత్తం కేటాయించారు ?
1. రూ.2,500 కోట్లు 2. రూ.1,400 కోట్లు
3. రూ.3,500 కోట్లు 4. రూ.1,600 కోట్లు

90. 2018-19లో పౌర విమానయాన శాఖకు కేటాయించిన మొత్తం ఎంత ?
1. రూ.1,014 కోట్లు 2. రూ.5,014 కోట్లు
3. రూ. 6,602 కోట్లు 4. రూ.2,710 కోట్లు

91. దేశంలో చిన్న నగరాలకు విమాన సర్వీసులను నిర్వహించేందుకు అమలు చేస్తున్న ప్రాంతీయ విమానయాన పథకం (ఉడాన్) కింద ఎన్ని విమానాశ్రయాలు నిర్మించనున్నారు ?
1. 56 2. 101 3. 96 4. 86

92. వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2018-19) ముద్రా యోజన కింద ఎంత రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు ?
1. రూ.2.44 లక్షల కోట్లు 2. రూ.3 లక్షల కోట్లు
3. రూ.5 లక్షల కోట్లు 4. ఏదీ కాదు

93. తెలంగాణ రాష్ట్రంలో ఆకర్షణీయ నగరంగా ఎంపికైంది ఏది ?
1. కరీంనగర్ 2. హైదరాబాద్ 3. వరంగల్ 4. ఖమ్మం

94. నరేంద్రమోడీ ప్రభుత్వం 2015 జూన్ 25న ప్రవేశపెట్టిన ఆకర్షణీయ నగరాలు దేశంలో ఎన్ని నగరాలను ఐదేళ్ళలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది ?
1. 500 2. 100 3. 250 4. 150

95. 2018 జనవరి నాటికి ఎన్ని నగరాలు ఆకర్షణీయ నగరాల కార్యక్రమానికి ఎంపికైనాయి ?
1. 100 2. 85 3. 99 4. 89

96. బినామీ లావాదేవీల (నిషేధం) సవరణ చట్టం - 2016 ఎందుకు తెచ్చారు ?
1. నల్లధనం నిరోధానికి 2. ద్రవ్యోల్బణం నివారణ
3. పన్ను ఎగవేత అరికట్టేందుకు 4. రుణ నివారణ

97. నైపుణ్య భారత్ కార్యక్రమం కింద 2020 నాటికి ఎంతమంది యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో 2015లో ప్రారంభించింది ?
1. 50 కోట్ల మందికి 2. 75 కోట్ల మందికి
3. 48 కోట్ల మందికి 4. 65 కోట్ల మందికి

98. 2018-19 బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన మొత్తం ఎంత ?
1. రూ.77,640 కోట్లు 2. రూ.85,010 కోట్లు
3. రూ.65,105 కోట్లు 4. రూ.56,047 కోట్లు

99. గత ఏడాదికన్నా ఎంత ఎక్కువ విద్యకు కేటాయించడం జరిగింది ?
1. రూ.3,141 కోట్లు 2. రూ.4,181 కోట్లు
3. రూ.5,125 కోట్లు 4. రూ.3,121 కోట్లు

100. పీఎంకేవివై కింద 2018 జనవరి నాటికి వీరిలో ఎంతమందికి ఉద్యోగాల కల్పన జరిగింది ?
1. 4,37,440 2. 2,30,601
3. 5,57,787 4. 23,562

101. ఉద్యోగుల సగటు పన్ను ఎంత ?
1. రూ.56 వేలు 2. రూ.96 వేలు
3. రూ.76 వేలు 4. రూ.82 వేలు

102. స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద 2018-19 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఎన్ని కోట్ల మరుగుదొడ్లు నిర్మించాలని నిర్ణయించారు ?
1. మూడు కోట్లు 2. రెండు కోట్లు
3. నాలుగు కోట్లు 4. ఐదు కోట్లు

103. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైల్వే విశ్వవిద్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేయనున్నారు ?
1. వారణాసి 2. వడోదర
3. ముంబయి 4. ఇండోర్

104. జీవన ప్రమాణాల మెరుగుదలకు పైలట్ ప్రాజెక్టు కింద ఎన్ని జిల్లాలను ఎంపిక చేశారు ?
1. 120 2. 130 3. 115 4. 155

105. జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం కింద పదికోట్ల కుటుంబాలకు ఏటా ఎన్ని లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుంది ?
1. రూ.3 లక్షలు 2. రూ.5 లక్షలు
3. రూ.3.5 లక్షలు 4. రూ.10 లక్షలు

106. క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించేందుకు ఎన్ని కోట్లను కేటాయిస్తున్నట్లు ఆర్థికమంత్రి వెల్లడించారు ?
1. రూ.600 కోట్లు 2. రూ.800 కోట్లు
3. రూ.700 కోట్లు 4. 400 కోట్లు

107. ఇప్పటివరకు కొనసాగుతున్న ఏ పథకాలను సమాజంలోని దిగువ వర్గాలకు విస్తరించేలా చూస్తామని చెప్పారు ?
1. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన
2. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన
3. 1 మరియు 2 4. ఆయుష్మాన్ భారత్



108. పార్లమెంటులో ఇప్పటివరకు సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన ఆర్థిక మంత్రి ఎవరు ?
1. పి.చిదంబరం 2. మన్మోహన్‌సింగ్
3. అరుణ్‌జైట్లీ 4. యశ్వంత్ సిన్హా

109. సర్వశిక్ష అభియాన్‌కు ఎంత కేటాయించారు ?
1. 26,128.81 కోట్లు 2. 28,121.32 కోట్లు
2. 29,101.12 కోట్లు 4. 29,132.12 కోట్లు

110. అతి తక్కువ సమయంలో బడ్జెట్ ప్రసంగాన్ని ముగించింది ఎవరు ?
1. మొరార్జీ దేశాయ్ 2. ఇందిరాగాంధీ
3. హెచ్.ఎం.పటేల్ 4. రాజీవ్‌గాంధీ

111. టెలికాం రంగ సేవలను మెరుగుపరచడానికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎన్ని కోట్ల నిధులను వెచ్చించనున్నట్లు ప్రకటించారు ?
1. రూ.10,000 కోట్లు 2. రూ.14,500 కోట్లు
3. 18,400 కోట్లు 4. రూ.4,500 కోట్లు

112. 2019 నాటికి ఎన్ని గ్రామ పంచాయతీలకు అత్యంత వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది ?
1. 1.5 లక్షలు 2. 5 లక్షలు 3. 2.5 లక్షలు 4. 3.5 లక్షలు

113. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న 5 కోట్ల మందిని బ్రాడ్‌బ్యాండ్ సేవల పరిధిలోకి తెచ్చేందుకు ఎన్ని లక్షల వై-పై హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు జైట్లీ ప్రకటించారు ?
1. 3 లక్షలు 2. 5 లక్షలు 3. 2.5 లక్షలు 4. 10 లక్షలు

114. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ డిజిటల్ ఏకానమీగా రూపాంతరం చెందుతున్న ఈ క్రమంలో ఏ పథకాలు కీలకపాత్ర పోషించనున్నాయని చెబుతున్నారు ?
1. డిజిటల్ ఇండియా 2. స్టార్టప్ - ఇండియా
3. మేక్ ఇన్ ఇండియా 4. పైవన్నీ

115. వచ్చే ఆర్థిక సంవత్సరంలో టెలికాం రంగం నుంచి ఎన్ని కోట్ల ఆదాయం రావచ్చునని కేంద్రం అంచనా వేస్తుంది ?
1. రూ.48,661 కోట్లు 2. రూ.31,121 కోట్లు
3. రూ.42,116 కోట్లు 4. రూ.58,796 కోట్లు

116. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీటీఎస్) కోసం రూ.30,073 కోట్లు దేనికోసం వెచ్చించనున్నారు ?
1. రోబోటిక్స్‌లో నైపుణ్యత
2. డిజిటల్ తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి
3. పరిశోధనలకు సంబంధించి శిక్షణ 4. పైవన్నీ

117. భారతదేశంలో ఇప్పటివరకు ఎన్ని కోట్ల మంది భారతీయులకు ఆధార్ గుర్తింపు కార్డులను అందించారు ?
1. 119 కోట్లు 2. 125 కోట్లు
3. 102 కోట్లు 4. 110 కోట్లు

118. 2018-19 బడ్జెట్‌లో లోక్‌పాల్ వ్యవస్థకు ఎన్ని కోట్లు కేటాయించడం జరిగింది ?
1. రూ.15 కోట్లు 2. రూ.4.29 కోట్లు
3. రూ.12.10 కోట్లు 4. రూ.9 కోట్లు

119. సులభతర వాణిజ్యానికి కేంద్రం ఎన్ని సూత్రాలను సూచించింది ?
1. 372 2. 315 3. 272 4. 115

120. సులభ వాణిజ్య విధానంలో 2016 సంవత్సరంలో ఏ రాష్ట్రం అగ్రభాగాన నిలిచింది ?
1. ఆంధ్రప్రదేశ్ 2. తెలంగాణ 3. గుజరాత్ 4. మహారాష్ట్ర

121. ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకం ఏమిటి ?
1. పేద వర్గాల మహిళలకు ఉచిత కరెంట్ అందించడం
2. పేద వర్గాల మహిళలకు ఉచిత వంటగ్యాస్ కనెక్షన్
3. పేద వర్గాల వారికి రుణ సదుపాయం ఏర్పాట్లు
4. కుటీర పరిశ్రమల అభివృద్ధి

122. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాల శాతాన్ని ఎంతకు పెంచారు ?
1. 25 శాతం 2. 37 శాతం 3. 42 శాతం 4. 18 శాతం

123. ఆర్థిక సర్వేను అనుసరించి 2005-06లో 36 శాతంగా ఉన్న మహిళా ఉద్యోగుల సంఖ్య 2015-16 నాటికి ఎంత శాతానికి పడిపోయింది ?
1. 24 శాతం 2. 32 శాతం
3. 18 శాతం 4. 12 శాతం

124. బడ్జెట్‌లో ప్రతిపాదించిన వేతనాలకు సంబంధించి కిందివాటిలో అవాస్తవం ఏది ?
1. రాష్ట్రపతి నెల వేతనం రూ.5 లక్షలు
2. ఉపరాష్ట్రపతి నెల వేతనం రూ. 4.5 లక్షలు
3. రాష్ట్రాల గవర్నర్ల వేతనం రూ.3.5 లక్షలు
4. ఎంపీల వేతనం రూ.2.5 లక్షలు

125. కేంద్ర ప్రభుత్వం నోట్లను ఎప్పుడు రద్దుచేసింది ?
1. ఆగస్టు 2107 2. నవంబర్ 2016
3. అక్టోబర్ 2017 4. అక్టోబర్ 2016

126. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు ఎంత కేటాయించారు ?
1. రూ.32.16 కోట్లు 2. రూ.43.11 కోట్లు
3. రూ.25.13 కోట్లు 4. రూ.18.95 కోట్లు

127. పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ పంపిణీ వ్యవస్థకు ఉతమిచ్చే సమీకృత విద్యుత్ అభివృద్ధి పథకం (ఐపీడీఎస్)కు ఎన్ని నిధులు కేటాయించారు ?
1. రూ.4,700 కోట్లు 2. రూ.4,900 కోట్లు
2. రూ.5,100 కోట్లు 4. రూ.3,800 కోట్లు

128. వానాకాల పంటల ఉత్పత్తి ఖర్చుకు ఎన్ని రెట్లు అధికంగా కనీస మద్దతు ధరను ప్రకటించారు ?
1. 1.5 రెట్లు 2. 2 రెట్లు
3. 4 రెట్లు 4. 3.5 రెట్లు

129. మొత్తం బడ్జెట్‌లో రక్షణ రంగానికి కేటాయించిన కేటాయింపులు జీడీపీలో ఎంతశాతంగా ఉన్నాయి ?
1. 1.2 శాతం 2. 1.5 శాతం
3. 12.10 శాతం 4. 12.15 శాతం

130. నీటిపారుదల రంగాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ప్రధానమంత్రి సించాయ్ యోజనకు కేటాయించిన మొత్తం ఎంత ?
1. రూ.2,000 కోట్లు 2. రూ.26,000 కోట్లు
3. రూ.14,000 కోట్లు 4. రూ.28,000 కోట్లు

131. ప్రస్తుత వ్యవసాయ ఎగుమతులు మూడువేల కోట్ల డాలర్లు (రూ.2లక్షల కోట్లు)గా ఉన్నాయి. దానిని ఎంతకు పెంచేందుకు కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకుంది ?
1. సుమారు రూ.5 లక్షల కోట్లు
2. సుమారు రూ.7 లక్షల కోట్లు
3. సుమారు రూ.8 లక్షల కోట్లు
4. సుమారు రూ.6 లక్షల కోట్లు

132. మత్స్య, పశు సంవర్థక శాఖలకు ఎన్ని కోట్లతో నిధిని ఏర్పాటు చేశారు ?
1. రూ.10,000 కోట్లు 2. రూ.12,000 కోట్లు
3. రూ.15,000 కోట్లు 4. రూ.13,000 కోట్లు

133. ఎన్ని మెగాఫుడ్ పార్కులలో అత్యాధునిక వసతులు కల్పిస్తామని తెలిపారు ?
1. 36 2. 42 3. 16 4. 20

134. బడ్జెట్ తరువాత ధరలు పెరిగే వస్తువులు ఏవి ?
ఎ. కార్లు, మోటార్ సైకిళ్ళు బి. మొబైల్ ఫోన్లు
సి. బంగారం, వెండి డి. పాదరక్షలు (చెప్పులు, బూట్లు)
ఇ. ఎల్‌సీడీ, ఎల్ఈడీ, టీవీ ప్యానెల్
1. ఎ, బి, సి మాత్రమే 2. డి, ఇ మాత్రమే
3. ఎ, బి, సి, డి, ఇ 4. ఎ, బి, సి, డి మాత్రమే

135. ఆర్థికమంత్రి మౌలిక రంగాభివృద్ధి కోసం ఎన్ని కోట్లు కేటాయించారు ?
1. రూ.5.97 కోట్లు 2. రూ.4.94 కోట్లు
3. రూ.8.94 కోట్లు 4. రూ.9.17 కోట్లు

136. దేశంలో 2022 నాటికి విద్యారంగంలో ప్రవేశపెట్టనున్న పథకం పేరు ఏమిటి ?
1. రూసా 2. రైజ్ 3. రన్ 4. దీక్ష

137. రైజ్ పథకానికి సంబంధించి కిందివాటిలో వాస్తవం ఏది ?
1. వచ్చే నాలుగేండ్లలో రూ. లక్ష కోట్లు వెచ్చిస్తారు.
2. ఆరోగ్య సంస్థలలో మౌలిక వసతుల కల్పన.
3. ప్రఖ్యాత విద్యాలయాల్లో మౌలిక వసతులు మరియు పరిశోధనలపై పెట్టుబడి పెట్టడం.
4. పైవన్నీ

సమాధానాలు

71.2	72. 4	73. 2	74. 1	75. 1	76. 2
77.3	78. 2	79. 1	80. 2	81. 3	82. 4
83.1	84. 2	85. 4	86. 3	87. 4	88. 1
89.2	90. 3	91. 1	92. 2	93. 3	94. 2
95. 3	96. 1	97. 1	98. 2	99. 1	100.2
101. 3	102. 2	103. 2	104. 3	105. 2	106. 1
107. 3	108. 2	109. 1	110. 3	111. 2	112. 3
113. 2	114. 4	115. 1	116. 4	117. 1	118. 2
119. 1	120. 2	121. 2	123. 1	124. 4	125.2
126. 1	127. 2	128. 1	129. 2	130. 2	131. 2
132. 1	133. 2	134. 3	135. 1	136. 2	137. 4

విశాలాంధ్ర బిజినెస్

-162.35 ▼ సెన్సెక్స్ 34,184.04	-61.45 ▼ నిఫ్టీ 10,492.85	-200 ▼ బంగారం (విజయవాడ) 29,100 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 29,010 ప్రొద్దుటూరు 29,010 22 క్యారెట్లు, 10 గ్రాములు	-300 ▼ వెండి (విజయవాడ) 39,500 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 41,700 ప్రొద్దుటూరు 41,483 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 65.18

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఇన్ఫోసిస్	1,174.25	2.26
ఏషియన్ పెయింట్స్	1,118.85	0.78
హీరో మోటార్‌కార్ప్	3,600.55	0.35
ఎస్‌బీఐ	270.40	0.35
రిలయన్స్	954.90	0.26

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
హెచ్‌యుఎల్	1,316.35	-2.02
ఐసీఐసీఐ బ్యాంక్	313.50	-1.92
సన్‌ఫార్మా	535.35	-1.75
యాక్సిస్ బ్యాంక్	535.90	-1.47
ఎస్ బ్యాంక్	325.00	-1.47

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ (త్రి.ముగింపు)	రూ.విలువ (ప్ర.ముగింపు)
డాలర్	64.87	65.18
యూరో	79.91	79.59
పౌండ్	90.45	89.99
ఆస్ట్రేలియా డాలర్	50.85	50.91
సింగపూర్ డాలర్	49.18	49.27

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,010	31,026
చెన్నై	29,080	31,101
బెంగళూరు	28,500	30,481
ముంబై	30,020	32,106
విజయవాడ	29,100	31,500
విశాఖపట్నం	29,010	31,674
ప్రొద్దుటూరు	29,010	30,460

ముడి చమురు	66.63



భారీగా తగ్గిన పసిడి, వెండి ధరలు

న్యూఢిల్లీ: నాలుగు రోజుల బంగారం పెరుగుదలకు బుధవారం బ్రేక్ పడింది. ఒక్కసారిగా పసిడి ధర రూ.460లు తగ్గడంతో పది గ్రాముల బంగారం ధర రూ.31,390కి చేరింది. డాలరు విలువ పెరగడంతో అంతర్జాతీయంగా విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టాయి. బంగారు ఆభరణాల తయారీదారుల నుండి డిమాండ్ మందగించడంతో పసిడి ధర తగ్గినట్లు బులియన్ మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. బంగారం బాటలోనే వెండి పయనించింది. రూ.250 తగ్గడంతో కేజీ వెండి ధర రూ.39,300కి చేరింది. పారిశ్రామిక వర్గాలు, నాణెల తయారీదారుల నుంచి డిమాండ్ లేకపోవడంతో వెండి ధర తగ్గినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. ఇక అంతర్జాతీయంగా బంగారం ధర 0.07శాతం తగ్గడంతో ఔన్సు 1,316.80 డాలర్లు పలికింది. వెండి 0.37శాతం తగ్గడంతో ఔన్సు 16.32 డాలర్లు పలికింది.

27 పైసలు తగ్గిన రూపాయి

ముంబై: డాలర్‌తో రూపాయి మారకపు విలువ బుధవారం 27 పైసలు తగ్గి మూడు నెలల కనిష్టానికి దిగజారింది. క్యూ3 గణాంకాలు ప్రకటించనున్న నేపథ్యంలో ఈ ప్రభావం రూపాయి విలువ తగ్గడంపై ప్రభావం చూపి 65.31 వద్ద నిలిచింది. దిగుమతుదారుల నుండి డాలర్ డిమాండ్ కొనసాగడం, విదేశీ నిధుల ప్రవాహం, ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే డాలర్ డిమాండ్ నేపథ్యంలో రూపాయి విలువ తగ్గిందని చెప్పవచ్చు. ఆర్‌బీఐ రూపాయి రిఫరెన్స్ రేటును 64.8514గా నమోదుచేసింది.

అమరావతి అభివృద్ధిలో...

సింగపూర్ కన్సార్టియం

విజయవాడ : సెంబ్ కార్ప్ ఇండస్ట్రీస్‌కు పూర్తిగా అనుబంధ సంస్థ, ఆసియాలో సుస్థిర పట్టణాభివృద్ధికి తోడ్పడుతున్న అగ్రశ్రేణి సంస్థలు అసెండస్ - సింగ్‌బ్రిడ్జ్, సెంబ్‌కార్ప్ డెవలప్‌మెంట్ భాగస్వామ్యంతో సింగపూర్ కన్సార్టియం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన రాజధాని అమరావతి నగరంలో స్టార్టప్ ఏరియా వద్ద ఫేజ్ జెడ్ డాట్ ఆర్‌ఓగా ఏర్పాటు చేయనున్న విజిటర్ సెంటర్, ఎగ్జిబిషన్ గ్యాలరీ నిర్మాణంలో పాలుపంచుకోబోతుంది. కృష్ణానది తీరంలో గుంటూరు - కృష్ణాజిల్లాల్లో 684 హెక్టార్లలో ఇది విస్తరించి ఉండనుంది. సింగపూర్ కన్సార్టియంను స్విస్ ఛాలెంజ్ విధానంలో స్టార్టప్ ఏరియా మాస్టర్ డెవలప్‌గా ఎంపిక చేశారు. ఫేజ్ జెడ్ డాట్ ఆర్‌ఓను సింగపూర్ కన్సార్టియం అమరావతి ఆంధ్రప్రదేశ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ఉమ్మడి భాగస్వామ్య కంపెనీ నిర్మించనుంది. ఈ ఇరుపార్టీల నడుమ నియమ నిబంధనల తుది కార్యాచరణ జరుగుతోంది. ఈ అభివృద్ధిని స్విస్ ఛాలెంజ్ ప్రాసెస్ నియమ నిబంధనలకు అనుగుణంగా చేస్తారు. దీనిలో 4వేల చదరపు మీటర్ల గ్రాస్ ఫ్లోర్ ఏరియా ఉంటుంది. ఫేజ్ జెడ్ డాట్ ఆర్‌ఓ అనేది స్టార్టప్ ఏరియాకు ఫౌండేషన్‌గా పనిచేయడంతో పాటుగా విజిటర్లు, పౌరులకు కీలకమైన టచ్ పాయింట్‌గా ఉంటుంది.

కర్నూలు, అనంతపురం జిల్లాలలో 4 వేల మెగావాట్ల

సౌర, వాయు విద్యుత్తు ఉత్పత్తి



విశాలాంధ్ర-అనంతపురం: కాలుష్యరహితమైన విద్యుత్తు ఉత్పత్తిపై ఇటీవలికాలంలో ప్రభుత్వాలు శ్రద్ధ వహిస్తున్నాయి. ఇందులో భాగంగానే కర్నూలు, అనంతపురం జిల్లాలో 4వేల మెగావాట్ల సౌర, వాయు విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. మరో వేయి మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి అవకాశాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయినట్లయితే, మరో వేయి మెగావాట్ల విద్యుత్తు అందుబాటులోకి వస్తుంది. అనంతపురం జిల్లాలో 3వేల మెగావాట్ల సౌర, వాయు విద్యుత్తు ఉత్పత్తి జరుగుతోందని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్తు కొరత లేదని కూడా ఆయన అన్నారు. ఎన్ని పరిశ్రమలు వచ్చినా వాటికి విద్యుత్తు సరఫరా చేయగలమనికూడా ఆయన చెప్పారు. రాష్ట్రంలో పునర్ ఉత్పత్తి ఇంధన అభివృద్ధి కార్పొరేషన్ పవ్వుదనాన్ని అందించే విద్యుత్తు ఉత్పత్తిని భారీ స్థాయిలో చేస్తున్నదని కార్పొరేషన్ వర్గాలు తెలిపాయి. అనంతపురం జిల్లాలో 1460 మెగావాట్ల వాయు విద్యుత్తు, 457.9 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి అవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని కదిరి సమీపంలో ఎన్‌పి కుంట వద్ద వేయి మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంటును నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో జాతీయ థర్మల్ విద్యుత్ కార్పొరేషన్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్లాంట్‌లో మొదటిదశగా ఇప్పటికే 250 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. 2018 చివరినాటికి ఈ ప్లాంటు 1000 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయనుంది. మరో నలుగురు వివిధ ప్లాంట్ల ద్వారా మొత్తం 291.9 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. అలాగే 62 మంది వాయు, విద్యుత్తు ప్రమోటర్లు మొత్తం 1460 మెగావాట్ల విద్యుత్తును 2017 మార్చి చివరినాటికే ఉత్పత్తి చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో వేయి మెగావాట్ల సౌర, వాయు విద్యుత్తు ఉత్పత్తి జరుగుతున్నది. ప్రస్తుతం జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయితే మరో 1000 మెగావాట్ల విద్యుత్తు అందుబాటులోకి వస్తుంది. జిల్లాలోని కంబదూరు, మడకసిర, ద్వారంపల్లి తదితరచోట్ల విద్యుత్తు గ్రిడ్ కనెక్షన్ సౌకర్యాలను ఏర్పాటు చేసారు. రాష్ట్రంలో 10వేల మెగావాట్ల వాయు, విద్యుత్తు ఉత్పత్తి చేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా ప్రస్తుతం 3వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి జరుగుతోంది. అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గ, ఉరవకొండ, కదిరి, రామగిరి మండలాల్లో సౌర, వాయు విద్యుత్తు ప్రాజెక్టులు పని చేస్తున్నాయి. రామగిరిలో 3వేల మెగావాట్ల వాయు, విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టును పారిశ్రామికవేత్త ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ మొట్టమొదట ఏర్పాటుచేశారు. ఆ తరువాత చాలా సంస్థలు ప్రాజెక్టులను ఏర్పాటు చేసాయి.

నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

బ్యాంకుల ప్రతికూల ప్రభావం



ముంబై: దేశీయ బ్యాంకుల దెబ్బ మార్కెట్లపై బుధవారం ప్రతికూల ప్రభావం చూపడంతో స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు చైర్మన్ జీరోమ్ పావెల్ వడ్డీరేట్ల పెంపు చేపట్టనున్నట్లు తాజాగా ప్రకటించడంతో, ఆసియన్ మార్కెట్లు నష్టాల్లో తేలాయి. ఈ ప్రభావం దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. ఆ తర్వాత కొంత కోలుకున్నాయి. కానీ చివరికి అమ్మకాలు ఒత్తిడి తగలడంతో మార్కెట్లు మళ్లీ నష్టాలతోనే ముగిశాయి. ప్రైవేటు బ్యాంకులైన ఐసీఐసీఐ బ్యాంకు షేర్లు 2.5శాతం దిగజారాయి. జీడీపీ గణాంకాలు వెలువడనుండటంతో ట్రేడర్లు అప్రమత్తతం పాటిస్తున్నారు. బిఎస్ఇ సెన్సెక్స్ 162.35 పాయింట్లు పడిపోయి 0.47 శాతంతో 34,184.04 వద్ద, నిఫ్టీ 61.45 పాయింట్లు క్షీణించి 0.58 శాతంతో 10,492.85 వద్ద క్లోజయ్యాయి. ప్రధానంగా బ్యాంకింగ్ షేర్లు నేటి మార్కెట్లను కుంగదీశాయి. నిఫ్టీ బ్యాంకు ఇండెక్స్ 1 శాతం పడిపోయింది. బ్యాంకు షేర్లతో పాటు ఆటో, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ కూడా నష్టాల బాటలోనే నడిచాయి. అటు డాలర్‌తో రూపాయి మారకం విలువ 40 పైసలు బలహీనపడి 65.29గా నమోదైంది. బిఎస్ఇ మిడ్‌క్యాప్ 0.23శాతం దిగజారగా, స్మాల్‌క్యాప్ 0.21శాతం పెరిగింది. సెక్టరల్ సూచీల్లో ఐటి, టెక్, రియాల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ లాభాల్లో నమోదు కాగా, మెటల్, బ్యాంకెక్స్, ఫైనాన్స్, క్యాపిటల్ గూడ్స్ నష్టాల్లో నమోదయ్యాయి. ప్రధానంగా హిందుస్తాన్ లీవర్, సన్‌ఫార్మా, ఐసిఐసిఐ బ్యాంకు, ఎమ్ అండ్ ఎమ్, యాక్సిస్ బ్యాంకు, యస్‌బ్యాంకు, 2.02శాతం వరకు నష్టపోయాయి. ఇంట్రాడేలో పిఎన్‌బి షేర్లు 6శాతానికిపైగా నష్టపోయి 20 నెలల కనిష్టానికి దిగజారాయి. విదేశీ మదుపరులు సుమారు రూ.06.86 కోట్లు నష్టపోయినట్లు తెలుస్తోంది.

అంతర్జాతీయంగా ఆసియా మార్కెట్లు నష్టాల్లో నమోదయ్యాయి. ఎమ్ ఎస్‌సిఐ బ్రాడెస్ట్ ఇండెక్స్‌లో జపాన్ వెలుపల ఆసియా పసిఫిక్ షేర్లు 0.2శాతానికి దిగజారాయి. జపాన్ నిక్కీ 0.2శాతం, సౌత్ కొరియా కాస్పి ఇండెక్స్ అత్యధికంగానే నమోదైంది. ఆస్ట్రేలియన్ షేర్లు 0.4శాతం దిగజారాయి.

బెజవాడలో రెడ్ కార్పెట్ కలెక్షన్...!

విజయవాడ: విజయవాడ నగరంలో సుప్రసిద్ధ జ్యువెలర్స్ కీర్తిలాల్స్, పీఎంజె జ్యువెలర్స్ అందమైన, అరుదైన ఫరెవర్ మార్క్ వజ్రాలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన రెడ్ కార్పెట్ కలెక్షన్‌ను ప్రదర్శించారు. ఈ ఆభరణాలను లాస్‌ఏంజెల్స్‌లోని ఎలైట్ ఆస్కార్ సూట్ వద్ద ప్రైవేట్ వీక్షణ, ఎంపిక కోసం ప్రదర్శిస్తున్నారు. అత్యద్భుతమైన వజ్రాల చెవి రింగులను పీఎంజె జ్యువెల్స్ సృష్టించింది. ఇవి రెడ్‌కార్పెట్‌పై ఖచ్చితంగా ప్రకాశాన్ని అందించనున్నాయి. అదే విధంగా ఇతర జతలలో వైట్ గోల్డ్ చాండ్లియర్ ఇయర్ రింగ్స్ ఉన్నాయి. వీటిని పాశ్చాత్య, ఇండియన్ ఔట్‌ఫిట్స్‌తో కలిపి ధరించవచ్చు. కీర్తిలాల్స్ ఓ జత చిక్ డాంగ్లింగ్ ఇయర్ రింగ్స్‌ను ఫరెవర్ మార్క్ డైమండ్స్‌తో సృష్టించింది. ఈ వజ్రాల డాజ్లర్స్ సంప్రదాయ, విలాసం యొక్క ఖచ్చితమైన సమ్మేళనంగా నిలుస్తుంది. ఈ ఆభరణాలను ఫరెవర్ మార్క్ స్ప్రింగ్ సమ్మర్ 2018 ట్రెండ్ – థింక్ పింక్ మరియు గార్డెన్ ఆఫ్ వండర్స్ స్ఫూర్తితో చేశారు. , ఫరెవర్ మార్క్ డైమండ్స్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ సచిన్ జైన్, మాట్లాడుతూ, 'అంతర్జాతీయ స్థాయిలో భారతదేశపు డిజైనింగ్ సామర్థ్యాన్ని గుర్తించేలా ఫరెవర్ మార్క్ ప్రాతినిధ్యం కల్పిస్తోందని, మేమంతా సంతోషిస్తున్నాం. మేం అందం, నాణ్యత కోసం పరితపిస్తుంటాం. అది మా వజ్రాలలో కనిపించడమే కాదు మా భాగస్వామ్యములు సృష్టించిన ఈ అత్యద్భుతమైన డిజైన్లలో కూడా కనిపిస్తుంటాయి. అంతర్జాతీయ సృజనాత్మకతను మా అసాధారణ క్రాఫ్ట్‌మెన్‌షిప్, సృజనాత్మక డిజైన్స్‌తో 90వ అకాడమీ అవార్డులలో పెంచగలమని ఆశిస్తున్నాం" అని అన్నారు.

ఎస్‌బీఐ డిపాజిట్లపై వడ్డీరేటు పెంపు



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) టర్మ్, బల్క్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచినట్లు ప్రకటించింది. రిటైల్ డిపాజిట్లపై 10 నుంచి 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీరేటును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2018 ఫిబ్రవరి 28 నుండి ఈ విధానం అమలులోకిరానుంది. కోటి రూపాయల లోపు డిపాజిట్లపై వడ్డీరేటు సవరించనుంది. 'డొమెస్టిక్ బల్క్ టర్మ్ డిపాజిట్స్' అంటే కోటి రూపాయలకు పైన డిపాజిట్లపై కూడా ఈ పెంపు వర్తింప చేయనుంది. కోటి నుండి రూ.10కోట్లు పైన కూడా వడ్డీరేట్లలో మార్పు ఉన్నట్లు పేర్కొంది. తాజా పెంపు ప్రకారం 7 నుంచి 45 రోజుల డిపా జిట్లపై వడ్డీరేటు 5.25 శాతం నుంచి 5.75 శాతానికి పెంచింది. వార్షిక వడ్డీ రేటు అంటే కోటి రూపాయల లోపు ఏడాదికాలానికి సంబంధించిన డిపా జిట్లపై 6.40 శాతంగా పేర్కొంది. ఇప్పటి వరకు ఇది 6.25శాతంగా ఉంది.. 2 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల మధ్య మెచ్యూర్ అయ్యే డిపాజిట్లపై 6.50 శాతం వడ్డీని అందించనుంది. ఇప్పటి వరకూ ఇది 6శాతం.

సీనియర్ పౌరుల డిపాజిట్లపై 7శాతం వడ్డీ అంతకు ముందు 6.50 శాతం. ఈ సవరించిన వడ్డీరేట్లు డిపాజిట్లకు, రెన్యూవల్ చేసుకునే డిపాజిట్లకు కూడా వర్తిస్తుందని ఎస్‌బీఐ తన నోటిఫికేషన్‌లో తెలిపింది. దీంతో రుణాలపై వడ్డీరేట్లను కూడా త్వరలోనే భారీగా పెంచనున్నట్లు నిపుణుల అంచనా.. ఫిబ్రవరిలో రిజర్వ్ బ్యాంక్ (ఆర్బిఐ) తన పాలసీ రేట్లను వరుసగా మూడవ సారి కూడా యథాతథంగా ఉంచింది.

పెరుగుతున్న లగ్జరీ బ్రాండ్ల వినిమయం



ముంబై: అంతర్జాతీయంగా లగ్జరీ బ్రాండ్లకు ఉన్న డిమాండ్, సంపన్నవర్గాల్లో పెరుగుతున్న కొనుగోలు శక్తితో లక్జరీ మార్కెట్ డిసెంబరు నాటికి 30బిలియన్ దాలర్లకు చేరుకోవచ్చునని అసోచామ్ తాజా నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం దేశీయ లగ్జరీ మార్కెట్ 23.8 బిలియన్ దాలర్లుగా నమోదైంది. యువత, ఎగువ మధ్యతరగతి వర్గంలో పెరుగుతున్న కొనుగోలు శక్తి, పట్టణాలు, నగరాల్లో పెరుగుతున్న విశాలమైన కార్లు, బైక్‌లు, శెలవుదినాల్లో విలాస వంతంగా గడపడం, భారీస్థాయిలో చేస్తున్న పెళ్లిళ్లు ఈ ఏడాది చివరికి దేశీయ లగ్జరీ మార్కెట్ ఏకంగా 30బిలియన్ దాలర్లకు చేరుకుంటుందని తెలుస్తోంది. నగరీకరణ, విలాసవస్తువులపై మోజు, ఒక స్థాయి వర్గంలో పెరుగుతున్న ఆదాయ వనరులతో ఆర్థికవ్యవస్థ పెరుగు దలతో పాటు లగ్జరీ బ్రాండ్లపై మోజు ఆ బ్రాండ్ల సంఖ్యను పెంచుతోందని తెలి పింది. రానున్న మూడేళ్ల కాలంలో మార్కెట్ ఐదురెట్లు పెరుగుతుందని అంచనా వేసింది. దేశంలో ఏడాదికేడాది మిలియ నీర్ల సంఖ్య పెరగడంతోపాటు వచ్చే ఐదేళ్లలో ఈ సంఖ్య రెట్టింపవుతుందని అసోచామ్ తెలిపింది. చిన్న చిన్న గ్రామాల నుండి పట్టణాల్లో కూడా ఇంటర్నెట్ నదుపాయాలతో లక్జరీ వస్తువుల వినిమయం పెరిగి 2020 నాటికి 100 మిలియన్ల లావాదేవీలు జరగవచ్చునని అంచనా వేసింది. డిజైనర్ బ్రాండ్స్‌కి పెరుగుతున్న వినిమయం, కొనుగోలు దారుల ఇష్టాలకు అనుగుణంగా తయారీలతో వాటిపై డిస్కౌంట్లు వంటి వాటితో మరింతగా మార్కెట్లోకి చొచ్చుకు పోతున్నాయి. దీనితో ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. రిటైల్ రంగం కూడా సానుకూలంగానే ఉందని ఈ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా అంతర్జాతీయ బ్రాండ్లవైపే మొగ్గ అధికంగా ఉంది.

కృష్ణానదికి మురుగు ముప్పు



విశాలాంధ్ర-అమరావతి: పెద్దపెద్ద నదులతో సహా చిన్న కాలువల వరకు మురుగు, చెత్త-చెదారంతో నిండిపోయి కాలుష్యం పెరుగుతోంది. ఫలితంగా ప్రజలకు తీవ్ర అనారోగ్యాలు కలుగుతున్నాయి. కృష్ణానది కూడా కాలు ష్యానికి మినహాయింపు కాదు.. నదిలో మురుగు ముప్పు ఏర్పడిందని ఇటీవల ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ ఇటీవల జరిపిన సర్వేలో 99శాతం మంది అభిప్రాయపడ్డారు. మురుగు కృష్ణానది నీటికి ముప్పు కలిగిస్తుందని 86శాతం మంది తెలిపారు. మురుగునీటిని కాలువలోకి వదిలేముందు తగినవిధంగా శుభ్రం చేయాలని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. అలాగే గత ఏడాది పారిశ్రామిక వ్యర్థాలు ఎక్కువగా కృష్ణానదిలోకి వదిలారని 90శాతంమంది సర్వేలో పాల్గొన్నవారు తెలిపారు. అయితే ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం మాత్రమే వ్యర్థాలను వదులుతున్నారని 53శాతం మంది పేర్కొన్నారు. ఈ సంస్థ రెండేళ్ల క్రితం దేశంలో నదులు పారే ఏడు నగరాలలో సర్వే నిర్వహించింది. ఢిల్లీలో యమున,వారణాసిలో గంగ, కటక్‌లో మహానది, సూరత్‌లో తపతి, జబల్‌పూర్‌లో నర్మద,విజయవాడలో కృష్ణానది, డిబ్రూగర్‌లో బ్రహ్మపుత్ర నదులు పారుతున్నాయి. ఈ సంస్థ వాతావరణం, ఆరోగ్యం నదులుపారే నగరాలలో వాతావరణం అంశాలపైన సర్వే నిర్వహించింది. విజయవాడలో భిన్నవయసులు, వృత్తులు, విద్యాస్థాయి, ఆదాయం తదితర అంశాలను ఆధారం చేసుకుని సర్వే నిర్వహించారు.

పెరిగిన పారిశ్రామిక వ్యర్థాలు

మొత్తంమీద కృష్ణానదిలో పరిస్థితి మెరుగ్గానే ఉందని 63శాతం, అధ్వాన్నంగా ఉందని 28శాతం, బాగానే ఉందని 9శాతం మంది అభిప్రాయపడ్డారు. అయితే నది సరిహద్దుల్లో పచ్చదనం చాలా అధ్వాన్నంగా ఉందని 64శాతం అభిప్రాయపడ్డారు. నదిలో నీటి నాణ్యతకు, పరిశుభ్రతకు మున్సిపల్ కార్పొరేషన్‌దే బాధ్యతని 93శాతం అభిప్రాయపడ్డారు. నదిలోనీరు భద్రమైందేనని 33శాతం మంది చెప్పగా, నదికి సంబంధించిన అంశాలపై స్థానిక ప్రభుత్వం శ్రద్ధ పెడుతోందని 75శాతం మంది చెప్పారు. నదిలో పరిశుభ్రత పెరిగిందని 96శాతం మంది అభిప్రాయపడ్డారు. విజయవాడలో వాయునాణ్యత అత్యంత అధ్వాన్నంగా ఉందని 84శాతం మంది చెప్పారు. చెత్త, చెత్త నిర్వహణ కొంతమేలుగా ఉందని 30శాతం మంది అభిప్రాయపడగా, నీటి సరఫరా కూడా మెరుగ్గా ఉందని 26శాతం మంది చెప్పారు.

విజ్ఞానం

డఫోడిల్‌తో కేన్సర్ నియంత్రణ



డఫోడిల్ పువ్వులోలభ్యమయ్యే సహజ సిద్ధమైన కాంపౌండ్ కేన్సర్‌ను ఎదుర్కోవచ్చునని తెలుస్తోంది. డఫోడిల్‌లోని అల్కలాయిడ్‌కు యాంటీ కేన్సర్ లక్షణాలు కలిగి ఉంటుందని బెల్జియంలోని లిబర్ డి బ్రక్సెల్స్ యూని వర్సిటీ వెల్లడించింది. కేన్సర్ కణితులు అసంబద్ధంగా పెరగడాన్ని నియంత్రించడంలో 'నానో మెషీన్స్'కు ఈ పువ్వులోని 'అమరిల్లిడాసే సార్బినస్' తోడ్పడుతుందని వెల్లడించారు. మనలోని కణాలను కాపా డేందుకు ప్రధానకారణమైన రైబోసోమ్స్ సహకరిస్తాయి. హేమంథమైన్ అల్కలాయిడ్ రైబోసోమ్‌తో బంధింపబడగాయి. నానో మెషీన్స్‌అయిన రైబోసోమ్స్ కణాల జీవనానికి తప్పనిసరి. ఎందుకంటే ఇవి అన్ని రకాల ప్రోటీన్లను కలిగిఉంటాయి. కేన్సర్‌కణాల అసమాన్య పెరుగుదలకు ప్రోటీన్ సింథసిస్‌ను మరింత ప్రోత్సహిస్తాయి.

యూరిన్ పరీక్షతో వయసు నిర్ధారణ



సాధారణ యూరిన్ పరీక్షతో మన వయసును నిర్ధారించ వచ్చునని తెలుస్తోంది. దీని ద్వారా వయసుతో సంబంధిత వ్యాధులతో పాటు ఏ వయసులో మరణించవచ్చునో కూడా అంచనా వేయవచ్చునని సిషువా యూనివర్సిటీ, చైనా వెల్లడించింది. మనిషి వార్ధక్యానికి దగ్గరయ్యే కొలదీ యూరిన్‌లోని ఆక్సిడేటివ్ డ్యామేజి ఎక్కువవుతుందని తెలు స్తోంది. మనిషి యూరిన్‌లో దీన్ని లెక్కించే పద్ధతితో వయసును నిర్ధారించవచ్చునని శాస్త్రజ్ఞులు వెల్లడించారు. వయసుతోపాటు వచ్చే పలు వ్యాధులను, లైఫ్‌స్పాన్‌ను గుర్తించవచ్చు. సెల్యులార్ డేమేజ్ మనిషి మనిషికి తేడా ఉంటుంది.

10 వేల రిటైల్ ఔట్‌లెట్ల లక్ష్యంగా

అజాఫ్రాన్ ఆర్గానిక్స్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఇంటిగ్రేటెడ్ పర్సనల్ కేర్ కంపెనీ అజాఫ్రాన్ ఇన్నోవాసియాన్ లిమిటెడ్ తమ సేల్స్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా మోడ్రన్ రిటైల్ స్టోర్లు, మల్టీ బ్రాండ్ ఔట్‌లెట్లు, జనరల్ ట్రేడ్ ద్వారా 10 వేల రిటైల్ ఔట్ లెట్లలో తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ బిజినెస్ హెడ్ టిఆర్.సురేష్ తెలిపారు. 2015లో ఆవిష్కరించినప్పటి నుంచి తమ బ్రాండ్ చక్కటి వృద్ధిని నమోదు చేసిందన్నారు. అజా ఫ్రాన్ ఉత్పత్తులను ప్రకృతిలో సహజసిద్ధంగా సాగు చేయడంతో పాటు, తమ సొంత సదుపాయాల్లో ప్రాసెస్ చేస్తామన్నారు. ఈ బ్రాండ్ శ్రేణిలో ఫేస్‌కేర్, బాడీ కేర్, హెయిర్ కేర్, యాంటి ఏజింగ్, బేబీ కేర్ ఉత్పత్తులను అందిస్తు న్నామన్నారు. ప్రస్తుతం అజాఫ్రాన్ బ్రాండ్ 1500 స్టోర్లలో లభ్యమవుతోం దని, రాబోయే 12 నెలల్లో దేశవ్యాప్తంగా 10 వేల స్టోర్స్‌కు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

స్వయం సహాయ సాంకేతికతపై

ప్రయాణికుల మొగ్గు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశంలోని ప్రయాణికుల సాంకేతికత విని యోగం, అందులో మొబైల్ వినియోగాన్ని ఎక్కువగా చేస్తున్నందున తమ విమాన ప్రయాణాల్లో కూడా వినియోగించుకోవాలని కోరుకుంటున్నారని ఐటీ సంస్థ ఎస్‌టీటీఏ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు వరల్డ్ 2017 ఎస్ఐటీఏ ప్యాసిం జర్ ట్రెండ్స్ సర్వేలో వెల్లడించింది. దేశంలో విమానయాన ప్రయాణికుల సాంకేతికత విని యోగం చెక్ ఇన్‌లలో 87 శాతం, బుకింగ్‌లో 52 శాతం వృద్ధి చెందగా, 2017 లో ప్రయాణపు ఇతర సందర్భాల్లో వినియోగం గణనీయంగా వృద్ధి చెందింది. ప్రయాణికులకు నూతన మొబైల్ సేవలను కోరుకుంటుండగా, 83 శాతం మంది వారి మొబైల్స్‌లో ఫ్లైట్ అప్‌డేట్‌లను తెలుసుకోవాలని కోరుకుంటున్నట్లు సీటా సంస్థ ఉపాధ్యక్షుడు మనీశ్ తై తెలిపారు. 2036 నాటికి 337 మిలియన్లమేర ప్రయాణికుల సంఖ్య వృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు.

మోక్ష్ అగర్‌బత్తి.. 'హైలైఫ్' ఆవిష్కరణ

విజయవాడ: అగరబత్తి తయారీలో అతిపెద్ద, అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మోక్ష్ అగర్‌బత్తి, తమ నూతన ఉత్పత్తి 'హైలైఫ్'ను ఆవిష్కరించింది. హైలైఫ్ ప్యాకేజీ, క్రిస్టలిన్ అల్డెహైడిక్, తాజా, ఆకుపచ్చనోట్స్‌తో తెరుచుకుటుంది. దీనిలో పలు సుగంధ పరిమళాలు టోన్కాతో కూడిన మస్క్, అంబర్, సీపర్ ఉన్నాయి. సుగంధ పరిమళం, ఇంగ్రీడియెంట్స్ పరంగా అత్యంత వైవిధ్య మైన ఉత్పత్తిలో ఒకటిగా ప్రతి మైలురాయినీ హైలైఫ్ అధిగమించింది. అత్యంత ఆకర్షనీయమైన ఈ ఫ్రాగ్నాన్స్‌ను మంత్రముగ్ధులను చేసే సువాసన, సింథటిక్ కంపోనెంట్స్ సమ్మేళనంతో తయారుచేశారు. ఈ సందర్భంగా మోక్ష్ అగరబత్తి సీఈవో ఆనంద్ కె అషియా మాట్లాడుతూ, "మేం స్థిరంగా మా ఉత్ప త్తుల పరం గా విస్తరణలు చేయడమేకాదు, నూతన విభాగాలతో ఉత్పత్తులనూ సృష్టిస్తున్నాం. ఈ ఫ్రాగ్నెన్స్ లాక్ ప్యాకేజింగ్ అగరబత్తి సువాసనకు భరోసా ఇవ్వడమే కాదు ఖచ్చితంగా మీ భావోద్వే గాలనూ తట్టి లేపుతాయి" అని అన్నారు. ఇప్పటికే దగ్గరలోని రిటైల్స్, పలు ఆన్‌లైన్ షాపింగ్ విండోస్‌లో లభ్యమవుతుంది.

ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోంది : మూడీస్

న్యూఢిల్లీ : పెద్దనోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) నుండి భారత ఆర్థిక వ్యవస్థ కోలుకుంటుందని మూడీ ఇన్వెస్టర్ సర్వీసు వెల్లడించింది. డీమోనిటైజేషన్, జీఎస్‌టీల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపిందని పేర్కొంది. ఈ ప్రభావం నుండి ఇప్పుడిప్పుడే తేరుకుంటోందని తెలిపింది. అయితే 2018 సంవత్సరంలో 7.6 శాతం వృద్ధి అంచనా మారలేదు. 2018-2019 సంవత్సరాల్లో ప్రపంచ ఆర్థికవృద్ధి అంచనాల ప్రకారం, ఏప్రిల్ 1(2018-19) ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి సంబంధించి పెద్దనోట్ల రద్దుతో దెబ్బతిన్న గ్రామీణ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణకు పలు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. 2016లో తీసుకున్న నిర్ణయాలతో 2017 ఆర్థిక వ్యవస్థపై చూపిన ప్రతికూల ప్రభావం నుండి కోలుకుంటోందని పేర్కొంది. భారత వృద్ధి రేటు 2018లో 7.6 శాతం, 2019లో 7.5 శాతంగా ఉంటుందని వివరించింది. వృద్ధి అంచనాల్లో ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల మాదిరిగా కాకుండా భారత్, ఇండోనేషియా దేశాల వృద్ధిలో మార్పేమీ లేదని తెలిపింది. దేశ ఆర్థిక, సంస్థాగత సంస్కరణల్లో భాగంగా భారత సార్వభౌమాధికార రేటింగ్ గత 13 ఏళ్లలో మొదటిసారి పెరుగుతున్నట్లు మూడీ ప్రకటించింది.

కాలేజ్ డ్రాపౌట్... కార్పొరేట్ సంస్థ యజమాని



'తోచినట్టుగా అందరి రాతను బ్రహ్మ రాస్తాడు. నచ్చినట్టుగా నీ తలరాతను నువ్వే రాయాలి'... ఈ వాక్యం వరుణ్ చంద్రన్‌కు సరిగ్గా సరిపోతుంది. నిరుపేద రైతు కుటుంబంలో పుట్టి, కాలేజ్ డ్రాపవుట్‌గా అనేక ఒడిదుడుకులు అనుభవించి తన విజయానికి బాటలు వేసుకుని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీనే స్థాపించాడు వరుణ్. ఉద్యోగం కోసం బెంగళూరు వీధుల్లో చక్కర్లు కొట్టిన వరుణ్... ఇప్పుడు సింగపూర్‌లో కంపెనీ ద్వారా ఎందరికో ఉపాధినిస్తున్నాడు. బెంగళూరులో చిన్న ఉద్యోగంతో కెరీర్ మొదలుపెట్టి కార్పొరేట్ 360 కంపెనీని స్థాపించే స్థాయికి ఎదిగాడు. ఇప్పుడా కంపెనీ కార్యకలాపాలు నాలుగు ఖండాలకు విస్తరించాయి. వరుణ్ చంద్రన్‌కు జీవితమే గొప్ప గురువు. జీవించాలన్న సంకల్పమే గొప్ప ప్రేరణ. జీవితంలో ఏదైనా సాధించాలన్న తపనే గొప్ప స్ఫూర్తి. ఇంతకీ ఎవరీ వరుణ్...

"కేరళలోని కొల్లం జిల్లా పడం గ్రామం నాది. నా తండ్రి నిరుపేద రైతు. తిండి కూడా లేని రోజులవి. ఉన్నంతలో బతుకీడ్చేవాళ్లం. జీవితంలో ఏదైనా సాధించాలన్న తపన అప్పుడే కలిగింది." ఇవీ 33 ఏళ్ల వరుణ్ చంద్రన్ తన బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ చెప్పే మాటలు. ఇప్పుడంటే వరుణ్ కోటీశ్వరుడు. కార్పొరేట్ 360 కంపెనీ వ్యవస్థాపకుడు. కానీ వరుణ్ జీవితంలో చూడాల్సిన పేజీలు చాలా ఉన్నాయి. పూట గడవ డమే కష్టంగా ఉన్న కడు పేదరికాన్ని అనుభ వించాడు వరుణ్. కేరళలో పడం అనే చిన్న పల్లెలో నిరుపేదరైతు కుటుంబంలో జన్మించిన వరుణ్... జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని ఎన్నో కలలు కన్నాడు. ఆ కలల్ని నిజం చేసుకునేందుకు ఎంతగానో శ్రమించాడు. వరుణ్ తల్లిదండ్రులు ఐదో తరగతి వరకే చదువుకున్నా... పిల్లల చదువు విషయంలో లోటు కనిపించొద్దని రెక్కలు ముక్కలు చేసుకున్నారు. వాళ్ల ఊరికి దగ్గర్లో ఉన్న చిన్న పట్టణం పతానపురంలోని సెయింట్ స్టీఫెన్స్ పాఠశాలలో వరుణ్‌ని చదివించారు.

చిన్నప్పట్నుంచీ పొలం పనుల్లో వరుణ్ పడ్డ శ్రమ స్కూల్లో కలిసొచ్చింది. స్పోర్ట్స్‌లో రాణించి స్కూల్‌కి ఎన్నో మెడల్స్ సాధించిపెట్టాడు. ఫుట్‌బాల్ ఆడేందుకు వరుణ్‌కు స్కాలర్‌షిప్ ఇచ్చింది కేరళ ప్రభుత్వం. కేరళలో యువ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పేరు తెచ్చుకున్న వరుణ్... గోల్డ్ మెడల్ సాధించి తన సత్తా ఏంటో చూపిం చాడు. కానీ ఎక్కడైతే వరుణ్ ఆకాశాన్ని చూశాడో... అక్కడే పాతాళాన్ని చూడాల్సిన పరిస్థితి వచ్చింది. ఫుట్‌బాల్ ఆడుతూ వరుణ్ గాయపడ్డాడు. ఫుట్‌బాల్‌నే కాదు... చివరకు కాలేజీని వదిలి పెట్టాల్సి వచ్చింది. చదువుని మధ్యలోనే ఆపేసి జాబ్ కోసం బెంగళూరు వెళ్లాడు.

అమ్మమ్మ బంగారు గాజులే పెట్టుబడి !

"మా అమ్మమ్మ తన బంగారు గాజులను నాకు ఇచ్చింది. వాటిని అమ్మి ఉపాధి చూసుకొమ్మని చెప్పింది. అలా నేను ఇంటి నుంచి బయటకొచ్చాను"

అంటూ తన జీవితంలో మర్చిపోలేని చేదు జ్ఞాపకాల్ని ఇప్పటికీ గుర్తుచేసుకుం టాడు వరుణ్. జీవితమన్నాక ఆటుపోట్లు, ఎత్తుపల్లాలు సహజం. కష్టాలెదురయ్యాయని బాధపడుతూ కూర్చుంటే జీవితంలో ఏమీ సాధించలేం. సరిగ్గా వరుణ్ ఇలాగే ఆలోచిం చాడు. అమ్మమ్మ గాజులమ్మి వచ్చిన డబ్బులతో బెంగళూరులో అడుగుపెట్టాడు. చేతిలో చిన్న సంచి, మనసులో కొంత నమ్మ కం మోసుకొని 2002లో బెంగళూ రుకు వచ్చాడు వరుణ్. అక్క డ్నుంచే తన కెరీర్‌ను మల్చు కోవడం మొదలుపెట్టాడు. ఒక్కో ఇటుక పేర్చి ఇల్లు కట్టినట్టు... ఒక్కో ఆలోచనతో, ఒక్కో అడుగు వేస్తూ తన కెరీర్‌ను డిజైన్ చేసు కోవడం ప్రారంభించాడు. ఇంట ర్నెట్ కేఫ్‌ల చుట్టూ తిరుగుతూ సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, ఎంట్రప్రెన్యూర్ షిప్ గురించి అధ్యయనం చేశాడు. కెరీర్‌లో రాణించాలంటే ఇంగ్లీష్‌లో బాగా మాట్లాడటం అవసరం అన్న విషయం అర్థమైంది. ఇంగ్లీష్ అంటే ఓ బ్రహ్మపదార్థం అన్న టెన్షన్ ఓ వైపు. సాధించాలన్న పట్టుదల మరోవైపు. సంకల్పాన్ని చెక్కుచెదరనివ్వలేదు. ఇంగ్లీష్ నేర్చుకునేందుకు డిక్షనరీ కొనుక్కున్నాడు. లైబ్రరీల్లో రోజుల తరబడి గడిపాడు. సిడ్నీ షెల్డన్, జెఫ్రీ ఆర్చర్ నవలలు చదివాడు. ఇంగ్లీష్ నేర్చుకోవడానికి సీఎన్ఎన్ చానల్‌ను చూసేవాడు.





"మా ఊరే ప్రపంచం అనుకున్నాను. కానీ ప్రపంచ మంటే మా ఊరొక్కటే కాదు. అసలు ప్రపంచమంతా మా ఊరి బయటే ఉందన్న విషయం పుస్తకాలు చదవడం ద్వారా తెలుసుకోగలిగాను. చదువుకునే రోజుల్లో ఫుట్‌బాల్ ప్లేయర్ ఐఎం విజయన్ నాకు స్ఫూర్తిగా నిలిచేవారు. ఆయన నాకు దేవుడు లాంటి వారు. వీధుల్లో సోడాలు, పల్లీలు అమ్మే దగ్గర్నుంచీ టాప్ ఇండియన్ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఆయన ఎదిగిన తీరు నాకు ఆదర్శం. అలాంటిది... నేనెందుకు జీవితంలో విజయం సాధించలేనన్న ప్రశ్న నిత్యం నన్ను నతమతం చేసేది." వరుణ్ సంకల్పానికి బాటలు వేసింది ఈ ఆలోచనే. ఎంట్రప్రెన్యూర్‌షిప్ ప్రపంచమెలా ఉంటుందో బాగా అధ్యయనం చేశాడు. "నేను బెంగళూరు సైబర్ కేఫుల్లో గంటలు గంటలు కూర్చొని ఇంటర్నెట్ గురించి తెలుసుకున్నాను. ప్రోగ్రామర్ అయ్యేందుకు ఇంటర్నెట్‌లోనే పాఠాలు నేర్చుకున్నాను. అసాధ్యమన్నదే లేదన్న సూక్తిని నేను ఎప్పటికీ నమ్ముతాను. ఇంటర్నెట్‌లో కావాల్సినంత సమాచారం ఉన్న ఈ రోజుల్లో మనం ఏమైనా నేర్చుకో వచ్చు. నేర్చుకోవాలన్న తపన ఉండాలే కానీ... ఏదైనా నేర్చుకోవచ్చు" ఇవీ వరుణ్ చెప్పే మాటలు. నిజమే. వరుణ్‌కు జీవితమే గురువు. విజయం సాధించేందుకు కావాల్సిన పాఠాలన్నీ జీవితమే నేర్పింది.

సింగపూర్ కళ్లుతెరిపించింది

బెంగళూరులో కొన్ని సంవత్సరాల పాటు పనిచేసిన తర్వాత 2008లో సింగపూర్‌లో ఉద్యోగాన్ని సంపాదించాడు వరుణ్. అవకాశాల విషయంలో సింగపూర్ నా కళ్ల తెరిపించిందని గొప్పగా చెబుతుంటాడు వరుణ్. సింగపూర్‌లో అడుగుపెట్టడం వరుణ్ జీవితాన్ని మలుపు తిప్పింది. తాను చేస్తున్న జాబ్ మరింత సులువయ్యేందుకు వరుణ్ తయారు చేసిన ఓ సాఫ్ట్‌వేర్ టూల్ సహచర సిబ్బందిని అబ్బురపరిచింది. వారి ప్రోత్సాహంతోనే వెంచర్ ప్రారంభించేందుకు అడుగులు పడ్డాయి. ఒక గొప్ప ఐడియా వచ్చినంతమాత్రాన మేధావి కాదు. ఆ ఐడియాను ప్రపంచా నికి పరిచయం చేయడం ద్వారా మేధస్సు బయట పడుతుంది. తన ఐడియానే పెట్టుబడిగా కార్పొరేట్ 360 (సీ-360) కంపెనీని స్థాపిం చాడు. ఇప్పుడు ప్రపంచంలోని పెద్ద ఐటీ కంపెనీలు, స్టార్టప్‌లు సీ-360 క్లైంట్లుగా ఉన్నా రంటే వరుణ్ కంపెనీ గొప్పదనాన్ని అర్థం చేసుకోవచ్చు. చిన్న కంపెనీతో మొదలుపెట్టి తన కార్యకలాపాలను నాలుగు ఖండాలకు విస్తరించాడు.


ప్రపంచవ్యాప్తంగా తన వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడు. కంపెనీ స్థాపించిన రెండుమూడేళ్లలోనే మిలియన్ డాలర్ మార్క్ దాటే సింది. అదే ఉత్సాహంతో, అదే దూకుడుతో భారీ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది సీ-360 కంపెనీ. రెండేళ్ల కిందటే యాభై లక్షల మిలియన్ డాలర్లను టార్గెట్‌గా పెట్టుకుందీ కంపెనీ. యూఎస్, యూరప్ లల్లో కొత్త కార్యాలయాలను తెరిచేందుకు ప్రణాళికలు రూపొందిస్తు న్నారు. ఐటీ మార్కెట్‌లో వరుణ్ విజయాలను చూసి పెద్దపెద్ద కంపెనీలు సీ-360ని సొంతం చేసుకునేందుకు అద్భుతమైన ఆఫర్లతో ముందుకొచ్చాయి. కానీ వరుణ్ వాటన్నింటినీ తిరస్క రించారు. చేయాల్సింది ఇంకా మిగిలే ఉందంటున్నాడు వరుణ్. కలలను సాకారం చేసుకోవడమే తన లక్ష్యం.

కార్పొరేట్ 360 టీమ్

కన్నతల్లిని, ఉన్న ఊరిని మర్చిపోకూడదంటారు. వరుణ్ కూడా అంతే. ప్రపంచ స్థాయిలో బిజినెస్ చేస్తున్నా తన ఊరిని మర్చిపోలేదు. కేరళలోని పతానపురంలో బ్రాంచ్ ఆఫీసును ప్రారంభించి ఎందరికో ఉపాధినిస్తున్నాడు. "సొంతూళ్లో నాలాంటి వారెందరికో అవకాశాలు కల్పించాలన్నదే ఆశయం. మనలో కావాల్సినంత ప్రతిభ ఉంది. అవకాశాలే లేవు. సరైన ప్రోత్సాహం కోసం నాలాంటి వాళ్లెందరో ఎదురుచూస్తున్నారు" అంటాడు వరుణ్. నిజమే. తాను చూసిన కష్టాలు ఇంకెవరూ చూడకూడదన్న తపన వరుణ్‌ది. "నేర్చుకోవాలన్న ఆసక్తి, పట్టుదల ఉంటే అసాధ్యాలు కూడా సుసాధ్యమవుతాయి. రాత్రికి రాత్రే అద్భుతాలు జరగవు. విజయం అనేది నిరంతర ప్రక్రియ. ప్రతీ రోజూ నేర్చుకోవడం, సానుకూలంగా ఉండటం అలవర్చుకోవాలి" ఇదీ వరుణ్ ఇచ్చే సందేశం. ఎలాంటి సమస్యలు లేకుండా గెలవడం సాదాసీదా విజయమైతే... అనేక సమస్యలను అధిగమించి గెలవడం గొప్ప చరిత్రవుతుంది. వరుణ్ సృష్టించింది, సృష్టిస్తోంది అలాంటి చరిత్రే.



'సీటీమార్'లో మాస్ మహారాజ్



హరీష్ శంకర్ తాజా సినిమా 'దాగుడు మూతలు' కంటే అప్‌కమింగ్ ప్రాజెక్ట్ 'సీటీమార్'పైనే ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. ముఖ్యంగా ఈ సినిమాలో హీరో ఎవరనేది హాట్ టాపిక్‌గా మారింది. గతంలో తనకు హిట్ ఇచ్చిన హీరోతోనే ఈ సినిమా చేయబోతున్నాడట హరీష్. 'రాజా ది గ్రేట్' సినిమాతో లాస్ట్ ఇయర్ సక్సెస్ ట్రాక్ పైకి వచ్చిన రవితేజ.. ఈ ఏడాది మాత్రం ఆ సక్సెస్ జర్నీని కంటిన్యూ చేయలేకపోయాడు. రీసెంట్‌గా వచ్చిన 'టచ్ చేసి చూడు' ఘోర పరాజయాన్ని అందుకోగా వెంటనే తన కొత్త సినిమాతో బిజీ అయ్యాడు రవితేజ. 'సోగ్గాడే చిన్నినాయన' ఫేమ్ కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. తాజాగా హరీష్ శంకర్ తోనూ రవితేజ ఓ మూవీకి కమిట్ అయ్యాడనే టాక్ వినిపిస్తోంది. 'షాక్' సినిమాతో దర్శకుడిగా హరీష్‌కు తొలి ఛాన్స్‌ను ఇచ్చిన రవితేజ అది ఫ్లాప్ అయినా 'మిరపకాయ్'తో తొలి సక్సెస్‌ను అందించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'దాగుడు మూతలు' ప్రీ-ప్రొడక్షన్‌లో బిజీగా ఉన్న హరీష్ శంకర్ ఆ తర్వాత 'సీటీమార్' పేరుతో ఓ సినిమా రూపొందించబోతున్నట్టు ఇటీవల ప్రకటించాడు. ఓ స్టార్ హీరో ఇందులో హీరోగా నటిస్తాడనే హింట్ ఇచ్చాడు.

దీంతో గత కొద్దిరోజులుగా పలువురు మాస్ హీరోల పేర్లు తెరపైకి వచ్చాయి. నానిని సంప్రదించగా వరుస కమిట్మెంట్స్‌తో కుదరదని చెప్పేశాడట. బన్నీతోనూ చర్చలు జరిగాయనే ప్రచారం జరిగింది. బన్నీ ఏమన్నాడో తెలియదు కానీ ఇప్పుడీ ప్రాజెక్ట్ రవితేజ వద్దకు చేరినట్టు వినిపిస్తోంది. గతంలో 'మిరపకాయ్' వంటి హిట్ ఇచ్చిన దర్శకుడు కావడం, తన ఇమేజ్, బాడీ లాంగ్వేజ్‌కు తగ్గరీతిలో తెరకెక్కిస్తాడనే భరోసాతో రవితేజ ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడంటున్నారు. మరి ఏడేళ్ల తర్వాత రిపీట్ అవుతున్న ఈ కాంబినేషన్ ఎలాంటి సినిమాతో వస్తారో చూడాలి.

విశాలాంధ్ర సినిమా





ఎన్టీఆర్ కొత్త సినిమా

ఫాస్ట్ పేజ్‌లో షూటింగ్ జరుపుకుంటుంది ఎన్టీఆర్, త్రివిక్రమ్ సినిమా. ప్రస్తుతం సినిమాలోని తక్కిన స్టార్ కాస్ట్‌ని ఫిక్స్ చేసుకునే ప్రాసెస్‌లో ఉన్న సినిమా యూనిట్, ఈ సినిమాని మార్చి థర్డ్ వీక్ కల్లా సెట్స్ పైకి తీసుకువచ్చే ప్రాసెస్‌లో ఉంది. 'జై లవకుశ' లాంటి పవర్ ప్యాక్డ్ బ్లాక్ బస్టర్‌లో 3 డిఫెరెంట్ లుక్స్‌లో కనిపించిన ఎన్టీఆర్‌ని, త్రివిక్రమ్ ఈ సినిమాలో ఎలా ప్రెజెంట్ చేయనున్నాడోనన్న క్యూరియాసిటీ ఇప్పటికే ఫ్యాన్స్‌లో క్రియేట్ అయి ఉంది. ఈ సినిమాకి తమన్ మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నాడు. హారిక హాసినీ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుందనే టాక్ వినిపిస్తున్నా, ఇంకా అఫీషియల్‌గా ప్రకటన వెలువడలేదు.



మే 25న నాగ్ ఆఫీసర్

శివ, అంతం, గోవిందా గోవింద చిత్రాల తర్వాత నాగార్జున, రామ్‌గోపాల్ వర్మ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రానికి ఆఫీసర్ అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ చిత్రానికి గన్, శపథం, సిస్టమ్ అనే పేర్లు టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వినిపించినా.. చివరకు ఆఫీసర్ అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ టైటిల్‌ను, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమాకు వర్మ దర్శకత్వం వహించడమే కాకుండా ఎ కంపెనీ ప్రొడక్షన్ బ్యానర్‌పై సుధీర్ చంద్రతో కలిసి నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు. ఈ చిత్రంలో నాగ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనపడబోతున్నాడు. ఈ సినిమాను మే 25న విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

మార్చి 2నుంచి థియేటర్స్ బంద్‌కు పిలుపు

నిర్మాతలకు, క్యూబ్, యుఎఫ్ఓ, పిఎక్స్‌డీ డిజిటల్ సర్వీస్ సంస్థలకు మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో దక్షిణాది నిర్మాతలంతా ఒకే తాటి పైకొచ్చి మార్చి 2 నుంచి థియేటర్స్ బంద్ చేస్తూ ఈ మూడు డిజిటల్ సంస్థలకు సినిమా కంటెంట్ ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు. డిజిటలైజేషన్‌లో భాగంగా క్యూబ్ చార్జెస్ అధికంగా వసూలు చేస్తుండడంతో, వాటిని 25 శాతం మేర తగ్గించాలని థియేటర్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. కానీ యూఎఫ్ఓ, క్యూబ్ యజమానులు 8.5 శాతం మాత్రమే తగ్గిస్తామని చెప్పడంతో సంతృప్తి చెందని జాయింట్ యాక్షన్ కమిటీ మార్చి 2 నుంచి దక్షిణాదిలోని అన్ని థియేటర్లను బంద్ చేయాలని నిర్ణయం తీసుకుంది. తాజాగా దీనికి సంబంధించిన అఫీషియల్ లెటర్ విడుదల చేసింది దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ. ఈ సందర్భంగా ప్రేక్షకులంతా సహకరించాలని కోరింది.






లవర్ జూన్ 14న రిలీజ్

రాజ్ తరుణ్ అప్ కమింగ్ మూవీ లవర్. దిల్ రాజు బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమాను జూన్ 14న రిలీజ్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అఫీషియల్‌గా ఎనౌన్స్‌మెంట్ ఇచ్చారు నిర్మాత దిల్ రాజు. అనీష్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లవర్ సినిమాలో రాజ్ తరుణ్ సరసన రిద్ధీ కుమార్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈమెకిదే మొదటి సినిమా. గతంలో అలా ఎలా అనే సినిమాను తెరకెక్కించాడు అనీష్ కృష్ణ. అలా లాంగ్ గ్యాప్ తర్వాత ఓ మంచి కథతో అటు దిల్ రాజు, ఇటు రాజ్ తరుణ్‌ను ఒప్పించాడు. సమీర్ రెడ్డి ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా.. ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే ఫస్ట్‌లుక్ విడుదల చేస్తారు.

వరుణ్ తేజ్ జతగా ఇద్దరు హీరోయిన్స్

తొలిప్రేమ సినిమాతో మంచి విజయం అందుకున్న వరుణ్ తేజ్ తన నెక్ట్స్ సినిమాకు రంగం సిద్ధం చేస్తున్నాడు. ఘాజి సినిమాతో తన టాలెంట్ ప్రూవ్ చేసుకున్న డైరెక్టర్ సంకల్ప్ రెడ్డితో సినిమా చెయ్యబోతున్నాడు వరుణ్ తేజ్. ఏప్రిల్ లాస్ట్ వీక్‌లో వీరి ప్రాజెక్ట్ ప్రారంభం కానుంది. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ నటించబోతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో పాటలు ఉండవని తెలుస్తోంది. స్క్రిప్ట్ వర్క్ దశలో ఉన్న ఈ సినిమా అంతరిక్షంలో జరిగే కథగా రుపొందనుందని సమాచారం. జ్ఞానశేఖర్ సినిమాటోగ్రఫి అందిస్తోన్న ఈ సినిమా భారీ బడ్జెట్‌తో తెరకెక్కబోతోంది. జార్జ్‌లో ఈ సినిమా మొదటి షెడ్యూల్ ప్రారంభం కానుంది. లవ్ స్టోరీగా తెరకెక్కబోతున్న ఈ సినిమాకు సంబందించిన మరింత సమాచారం త్వరలో తెలియనుంది.

మార్చిలో పెళ్లి తేది



హీరోయిన్ శ్రీయ త్వరలోనే ఓ ఇంటిది కానుందనే వార్తలు ఇండస్ట్రీలో వినపడుతున్నాయి. రష్యాకు చెందిన క్రీడాకారుడు, వ్యాపారవేత్త అంద్రూ కొచీవ్‌ను పెళ్లాడనుందట. గత కొంతకాలంగా ఇద్దరూ ప్రేమలో ఉన్నారని.. మార్చి 17, 18, 19 తేదీల్లో ఉదయపూర్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో పెళ్లి జరుగుతుందని వార్తలు వస్తున్నాయి. ఈ పెళ్లికి సంబంధించి శ్రీయ తన సన్నిహితులను మాత్రమే ఆహ్వానించిందంటున్నారు. అయితే రీసెంట్‌గా తన పెళ్లిపై వచ్చిన వార్తలకు నో అంటూ సమాధానం ఇచ్చిన శ్రీయ.. ఇప్పుడేమంటుందో చూడాలి. ఇటీవల గాయత్రి సినిమాలో కీలకపాత్రలో నటించిన శ్రీయ ఇప్పుడు నరగాసురన్ సినిమాతో పాటు హిందీలో తడ్కా సినిమాలో నటిస్తోంది.

భరత్ అనే నేను ప్రీ-రిలీజ్ బిజినెస్

మహేష్ బాబు, కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా భరత్ అనే నేను. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే ప్రీ-రిలీజ్ బిజినెస్ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సినిమా శాటిలైట్ రైట్స్‌ను స్టార్ మా ఛానెల్ దక్కించుకోగా.. దాదాపు 2 కోట్ల రూపాయలకు లహరి మ్యూజిక్ సంస్థ.. ఆడియో రైట్స్ దక్కించుకుంది. ఇక నైజాంలో ఈ సినిమాను దిల్ రాజు రిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఇప్పుడు ఉత్తరాంధ్ర, గుంటూరు, కృష్ణా జిల్లాలకు సంబంధించి ప్రీ-రిలీజ్ బిజినెస్ వివరాలు బయటకొచ్చాయి. ఈ మూడు ఏరియాలకు కలిపి 22 కోట్ల 50 లక్షల రూపాయలకు థియేట్రికల్ రైట్స్ అమ్ముడుపోయాయి. ఎన్ క్రియేషన్స్ సంస్థ ఈ మేరకు డీవీవీ దానయ్యతో ఎగ్రిమెంట్ కుదుర్చుకుంది.

'గుడ్ బై మై ఫ్రెండ్'.. హేమమాలిని ట్వీట్



ముంబై : బాలీవుడ్ ప్రముఖ నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని భావోద్వేగానికి లోనయ్యారు. హఠాన్మరణం చెందిన శ్రీదేవి భౌతికకాయానికి నివాళులు అర్పించేందుకు వచ్చిన ఆమె కంటతడి పెట్టుకున్నారు. మరణం లోనూ నిర్మలంగా ఎరుపు చీరలో చాలా అందంగా కనిపిస్తూ శ్రీదేవి పవళిస్తోందని హేమ భావోద్వేగంతో నిండిన ట్వీట్ చేశారు. 'నా నివాళి అర్పించాను. మొత్తం చిత్ర పరిశ్రమ అక్కడే శోకసంద్రంలో మునిగిపోయి ఉంది. అది ఆమెకు ఉన్న తేజస్సు.. ఆమె నటించిన చిత్రాల మ్యాజిక్.. ఎర్రచీరలో ఆమె చాలా అందంగా కనిపిస్తూ అక్కడ ప్రశాంతంగా పవళిస్తోంది. ఏర్పాట్లు అన్నీ చాలా బాగా చేశారు. గుడ్‌బై మై డియర్ ఫ్రెండ్' అని హేమమాలిని ట్వీట్ చేశారు.

శ్రీదేవి మా అన్నయ్యను కాపాడారు



ముంబై: అందాలతార శ్రీదేవి తన సోదరుడికి చికిత్స చేయించి ప్రాణం పోశారని జతిన్ వాల్మీకి అనే అభిమాని తెలిపారు. శ్రీదేవి మరణవార్త తెలుసుకుని రెండు రోజులుగా ముంబైలోని ఆమె నివాసం వద్దే తిరుగుతున్నానని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన జతిన్ వాల్మీకి దివ్యాంగుడు. కొన్నేళ్ల క్రితం అతని సోదరుడికి బ్రెయిన్ ట్యూమర్ సోకింది. చికిత్సకు లక్ష రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. అప్పుడు ఈ విషయం తెలుసుకున్న శ్రీదేవి...జతిన్ సోదరుడి చికిత్సకు లక్ష రూపాయలు సాయం చేశారు. ఆస్పత్రిలో చెల్లించాల్సిన మిగతా లక్ష రూపాయలు కూడా మాఫీ చేయించారు. ఆమెను ఆఖరిసారి చూసేందుకు రెండు రోజుల క్రితమే ముంబైకి వచ్చినట్లు జతిన్ తెలిపారు.

వాణిజ్య సంబంధాలు విస్తరించుకుంటాం

వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డై క్వాంగ్ మార్చి 2 నుంచి భారత్‌లో పర్యటన



న్యూఢిల్లీ : భారత పర్యటన నేపథ్యంలో రెండు దేశాల మధ్య సముద్ర, వాయు అనుసంధానాలను విస్తృతం చేయడంతోపాటు వాణిజ్య సంబంధాలను పెంపొందించుకుంటామని వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డై క్వాంగ్ తెలిపారు. మూడు రోజుల పర్యటనకు మార్చి 2న భారత్‌కు రానున్న ట్రాన్ మాట్లాడుతూ వియత్నాం, భారత్‌లకు ఆగ్నేసియా, దక్షిణాసియాలలో వ్యూహాత్మక ప్రాంతాలున్నట్లు తెలిపారు. ఇరుదేశాలు సహకరించుకోవడానికి ఇది దోహదపడుతుందన్నారు. 'అలాగే రెండు దేశాలు సముద్ర ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి అవకాశాలు కలిగి ఉన్నాయి. ఇందుకు సంబంధించి సముద్ర వ్యూహాలను రూపొందించడంలో సమాచారాన్ని, అనుభవాన్ని పంచుకోవడాన్ని పెంచుకుంటాం' అని పీటీఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 2015- 2020కి రక్షణ సహకారంపై ప్రత్యేకించి జాయింట్ విజన్ స్టేట్‌మెంట్, ఒప్పంద సంతకాలు సమర్థవంత అమలు కోసం పని చేస్తామన్నారు. 2020 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యానికి సంబంధించి 15 బిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకోవడానికి సముద్ర, వాయు అనుసంధానాన్ని పెంచేందుకు వియత్నాం డిమాండ్లతో భారత ప్రయోజనాలతో సమానంగా పెట్టుబడులను ఇరుదేశాలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు వైపులా వాణిజ్యం కోసం అనుకూల పరిస్థితులను సృష్టించేందుకు వాణిజ్య అడ్డంకులను తొలగించే దిశగా కృషి చేయాలని ఈ-మెయిల్ ఇంటర్వ్యూలో ట్రాన్ తెలిపారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ముఖ్య అతిథులలో ఒకరిగా భారత్‌కు వియత్నా ప్రధాన మంత్రి నెగుయెన్ క్జుయన్ ఫుక్ పర్యటన తర్వాత ఒక నెల రోజులకు ఆ దేశ అధ్యక్షుడు పర్యటించనున్నారు. కాగా వ్యూహాత్మక రంగాల్లో సమర్థవంతమైన సహకారానికి రక్షణ, భద్రత, వాణిజ్య రంగాలను ట్రాన్ గుర్తించారు. 'ఆగ్నేసియా, దక్షిణాసియాలలో వియత్నాం, భారత్‌లు వ్యూహాత్మక కేంద్రాలను కలిగి ఉన్నాయి. యువ జనాభా, భారీ శ్రామిక శక్తి, భారీ మార్కెట్లు, విస్తృత ఆర్థిక వృద్ధి వంటివి కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇరుదేశాలు ఉత్పత్తి, తయారీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పునర్వినియోగం, సమాచార పరిజ్ఞానం, నూతన సాంకేతిక అప్లికేషన్, బయో టెక్నాలజీ, హరిత వ్యవసాయం, నానో టెక్నాలజీ వంటి ఇతర రంగాలలో ఇరుదేశాలు పరస్పరం సహకారం ఉండవచ్చని ఆయన తెలిపారు.

రైతు సమస్యలపై చర్చించాలి : ప్రతిపక్షాలు

ముంబై : అసెంబ్లీలో రైతుసమస్యలపై చర్చించాలని కాంగ్రెస్, ఎన్సీపీలు పట్టు బట్టాయి. బీజేపీ నాయకత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎటువంటి సహాయం అందించడం లేదని ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోశాయి. ఖరీఫ్ పంటలో గులాబీ పురుగు సోకి పంటలన్నీ నాశనమైనా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుందని తీవ్రంగా విమర్శించాయి. అయితే అధికార పక్షం మాత్రం రైతులపై ప్రతిపక్షాలు మొసలి కన్నీరు కారుస్తున్నా యంటూ విరుచుకు పడ్డాయి. సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్ శాసనసభా ప్రతిపక్ష నేత రాధాకృష్ణ విఖే పాటిల్, పృథ్వీరాజ్ చౌహాన్, ఎన్సీపీకి చెందిన జయంత్ పాటిల్ రైతు సమస్యలపై చర్చ చేపట్టాలని కోరారు. శీతాకాల సమావేశాల్లో ఫిబ్రవరిలో నష్టపరిహారం అందచేస్తామని తీర్మానం చేసి, దీనిపై చర్చ చేపడతామని నోటీసు జారీ చేసిందని అయితే స్పీకర్ హరిభవ్ బాగ్డే మాత్రం అకాల వర్షాలు, వడగండ్ల వానలు వంటలను ఏవిధంగా దెబ్బతీసాయో అజెండాలో చేర్చామని, దీనిని ప్రశ్నోత్తర సమయంలో చర్చిస్తామనడం సభలో గందరగోళానికి దారి తీసింది. రైతులకు నష్ట పరిహారం అందచేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సభలో నినాదాలు చేశాయి. అయితే ఒక్క పంట పురుగుల నివారిణ *పైనే కాకుండా అన్ని విషయాలపై చర్చ నిర్వహి స్తామని వెల్లడించినా ప్రతిపక్షాలు శాంతించక పోవడంతో సభ రెండు సార్లు వాయిదా పడింది.

న్యూటన్‌కన్నా ముందే మంత్రాలతో చలన సిద్ధాంతం

కేంద్రమంత్రి సత్యపాల్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : ప్రముఖ శాస్త్రవేత్త ఐసాక్ న్యూటన్ సంకలనం చేయడానికన్నా ముందే మంత్రాలు 'చలన సిద్ధాంతం'ను క్రోడీకరించాయని కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కేంద్ర విద్యా సలహా బోర్డు(సీఏబీఈ) సమావేశంలో ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. విద్యా భవనాలకు వాస్తు పరిజ్ఞానం నేర్చుకోవడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. విద్యలో విధాన నిర్ణయాలకు కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత సలహా మండలిగా కేంద్ర విద్యా సలహా మండలి(సీఏబీఈ) ఉంది. జనవరి 15, 16 తేదీలలో ఈ మండలి సమావేశం జరిగింది. 'న్యూటన్ కనుగొనడానికి ఎంతో ముందే చలన నియమాలను క్రోడీకరించిన మంత్రాలు ఉన్నాయి. అందువల్ల సాంప్రదాయ జ్ఞానం మన పాఠ్యప్రణాళికలో చేర్చాలి' అని ఆ సమావేశంలో సింగ్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, జనవరిలో ఒక కార్యక్రమంలో సింగ్ మాట్లాడుతూ డార్విన్ సిద్ధాంతాన్ని సవాల్ చేశారు. దీంతో మంత్రి ప్రకటనపై అనేక వర్గాల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి.

సమాజ పురోగతికి సైన్స్ అవసరం

సమాజ పురోగతికి సైన్స్ అవసరమని, పురాతన భారతీయ సంస్కృతిలో శాస్త్రీయ పరిశోధన ఒక సంస్కృతి అని కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బుధవారం అన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ విజ్ఞానం పట్ల అవగాహన, ఆసక్తిని పెంచాలని పిలుపునిచ్చారు. డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించాలంటూ విమర్శలు చేసిన నెల రోజుల తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జాతీయ సైన్స్ డే కార్యక్రమాన్ని ఉద్దేశించి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి మాట్లాడుతూ మన పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ఏదైతే బోధిస్తున్నామో అందులో శాస్త్రీయ విజ్ఞానం పట్ల ఆసక్తిని పెంచేలా ప్రోత్సహించాలన్నారు. ఐపీఎస్ అధికారి నుంచి రాజకీయ నాయకుడిగా మారిన సత్యపాల్ సింగ్ గత నెలలో ఔరంగాబాద్‌లో మాట్లాడుతూ డార్విన్ సిద్ధాంతం శాస్త్రీయంగా తప్పు అని, పాఠశాల, కళాశాల పాఠ్యాంశాలలో దీనిని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. 30-35 ఏళ్ల క్రితమే శాస్త్రవేత్తలు డార్విన్ సిద్ధాంతాన్ని తోసిపుచ్చారని విమర్శించారు. యూరప్‌లో సైన్స్, మతం మధ్య సుదీర్ఘ పోరాటం జరిగిందని, కానీ మన దేశంలో అలా లేదని చెప్పుకొచ్చారు. 'మన మతం(ధర్మం) నిర్వచనం ప్రకారం సహజ న్యాయ సూత్రాలను అనుసరించడం ధర్మం' అని పేర్కొన్నారు. ఒక శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, ఇతరులను ప్రశ్నిస్తూనే ఆ దిశగా తమకు తాముగా మొదటి అడుగు వేయాలన్నారు. 'విజ్ఞాన శాస్త్రం కొన్ని సార్లు తప్పుడు ఆలోచనలతో, వ్యతిరేక ఆలోచనలతో పెరుగుతుంది' అని తెలిపారు. ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో నమోదైన హత్యలకంటే ఆత్మహత్యలు అధికంగా ఉన్నాయని పేర్కొంటూ ఆధ్యాత్మిక విజ్ఞానం, శాస్త్రీయ విజ్ఞాన అవసరాన్ని పునరుద్ఘాటించారు. కార్యక్రమానికి హాజరైన డీయూ, జేఎన్‌యూ, ఐఐటీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ దేశంలో మత్స్య, మాంస, పాల ఉత్పత్తి రంగాల్లో విప్లవాత్మక మార్పులు చేపట్టిన శాస్త్రవేత్తలను ప్రశంసించారు. దేశంలోని ప్రతి బిడ్డకు ప్రాథమిక విజ్ఞానంలో శిక్షణ ఇవ్వాలని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్లీనరీకోసం కమిటీలు

సీనియర్లకు సముచిత స్థానం
ఎన్నికలకు సంసిద్ధం

న్యూఢిల్లీ : ప్లీనరీ సమావేశాల కోసం రాహుల్ గాంధీ కమిటీలను ఏర్పాటు చేశారు. వాటిలో ఆర్గనైజింగ్ కమిటీ, ముసాయిదా కమిటీలున్నాయి. ముసాయిదా కమిటీలోని నాలుగు సబ్ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. మార్చి 16 నుంచి 18 వరకు కాంగ్రెస్ ప్లీనరీ జరగనున్న నేపథ్యంలో ఈ కమిటీలు రూపుదిద్దుకున్నాయి. డ్రాఫ్టింగ్ కమిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చైర్మన్‌గా, ముకుల్ వాస్నిక్ కన్వీనర్‌గా ఉంటారు.

ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ట్రెజరర్ మోతీలాల్ వోరా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా, ఆస్కార్ ఫెర్నాండేజ్ కన్వీనర్‌గా ఉంటారు. చట్టసవరణల కమిటీలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గులాబ్‌నబీ ఆజాద్ చైర్మన్‌గా, జనార్థన్ ద్వివేదిలు కన్వీనర్‌లుగా ఉంటారు. మరో 10 మంది సీనియర్లు అహ్మద్‌పటేల్, పి. చిదంబరం, మల్లిఖార్జున ఖర్గే, కపిల్ సిబాల్ మెంబర్లుగా ఉంటారు. ముసాయిదా కమిటీలో 44 మంది సీనియర్ నాయకులు సభ్యులుగా ఉన్నారు. దీనికి ఉప విభాగాలుగా రాజకీయ, ఆర్థిక, అంతర్జాతీయ, వ్యవసాయ, ఉపాధి గ్రూపులు ఉంటాయి. రాజకీయ సంఘానికి ఏకే ఆంథోని చైర్మన్‌కాగ, దాని సబ్‌గ్రూప్‌కు సెల్జా కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఆర్థిక వ్యవహారాల సంఘానికి చిదంబరం చైర్మన్‌గా, జైరాంరమేశ్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అంతర్జాతీయ వ్యవహారాల సంఘానికి ఆనంద శర్మ దాని సబ్ గ్రూపుకు జ్యోతిరాదిత్య సింధియా కన్వీనర్‌గ నియామకాలు జరిగాయి. వ్యవసాయ, ఉపాధి, పేదరిక నివారణ సంఘానికి హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హుడా చైర్మన్‌గా వ్యవహరిస్తారు. 2019 సార్వత్రిక ఎన్నికల కోసం కాంగ్రెస్ తన మేథో సంపత్తిని వినియోగించుకొని బీజేపీ నుంచి అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని చూస్తోంది. కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్‌ల్లో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రాహుల్ గాంధీ నాయకత్వంలో మార్చిలో జరిగే ప్లీనరీ మొదటిది. డిసెంబరులో ఆయన తల్లి సోనియాగాంధీ నుంచి పార్టీ పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే.

బీజేపీ బహిష్కృత నేత లొంగుబాటు



గాయపడ్డ నిందితుడు బైతాను ముజఫర్‌పూర్‌కు తీసుకెళ్తే మృతిచెందిన విద్యార్థుల తల్లిదండ్రులు, గాయపడ్డవారి బంధువులు, సన్నిహితులు దాడిచేసే ప్రమాదం ఉందని చికిత్స కోసం పాట్నాకు తరలించినట్లు తెలిపారు. మద్యం మత్తులో చిన్నారుల మృతికి కారణమైన బీజేపీ నేతపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో మనోజ్ బైతాను పార్టీ నుంచి ఆరేళ్లపాటు ఇదివరకే బహిష్కరించారు.

పాట్నా: తొమ్మిది మంది చిన్నారుల మృతికి కారకుడైన బీజేపీ బహిష్కృత నేత మనోజ్ బైతా బుధవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. నిందితుడు బైతాను తొలుత శ్రీకృష్ణ మెడికల్-హాస్పిటల్‌లో చేర్పించామని, మెరుగైన వైద్యం కోసం పాట్నా మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్ శివార్లలో ఉన్న ధుంజా గ్రామంలో శనివారం మధ్యాహ్నం 1:30 గంటలకు రోడ్డు దాటేందుకు 9 మంది విద్యార్థులు సిద్ధంగా ఉన్నారు. అదే సమయంలో తన ఎస్‌యూవీ కారులో వెళ్తున్న మనోజ్ బైతా తన వాహనంతో విద్యార్థులను ఢీకొట్టారు. వారిపైనుంచి దూసుకెళ్లారు. మరో 20 మందిని వాహనంతో ఢీకొట్టారు. అనంతరం భయందోళనకు గురైన బైతా తన వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యారు. అదే ప్రమాదంలో

మరాఠీని బతికిద్దాం : శివసేన

ముంబై : మహారాష్ట్రలో ప్రతి వ్యక్తి మరాఠీ భాషలో తప్పనిసరిగా మాట్లాడాలని, ఇందుకు నిజాయితీగా ప్రయత్నించి ఈ భాషను బతికించాలని ముంబై కాంగ్రెస్ చీఫ్ సంజయ్ నిరుపమ్ అన్నారు. మరాఠీ సాహిత్యం, భాష ను బతికించాల్సిన బాధ్యత రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ ఉందని ఆయన చెప్పారు. సోమవారం శాసనసభలో గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు ఉపన్యాసిస్తున్న సందర్భంలో అనువాదంలో తప్పులు దొర్లిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

అంతా తానై...



శ్రీదేవి భౌతికకాయాన్ని భారత్‌కు చేర్చిన అష్రాఫ్
పేద, ధనిక భేదం లేకుండా పరదేశీయుల ఉపకారి

న్యూఢిల్లీ : సినీతార శ్రీదేవికి సంబంధించిన వార్తలను క్షణక్షణం అప్‌డేట్‌తో ప్రసారం చేస్తున్న మీడియా ఛానల్స్ ఆమె కడచూపు దక్కేందుకు పూర్తిస్థాయిలో సహకరించిన వ్యక్తిని మరిచాయి. వేలాది కిమీల దూరంలో మూడోకంటికి చిక్కని పరిస్థితి.. వేలాది మంది అభిమానులకు కనిపించని వైనం. ఆ కష్టకాలంలో బాధిత కుటుంబానికి అంతా తానై వ్యవహరించిన వ్యక్తి అష్రాఫ్ షెర్రి థామెరస్సెరీ. శ్రీదేవి భౌతికకాయాన్ని భారత్‌కు తరలించేంత వరకు అన్ని ప్రక్రియలను దగ్గరుండి చూసుకున్నారు. 44 ఏళ్ల అష్రాఫ్ భారతీయుడు.. కేరళవాసి. యూఏఈలో చనిపోయిన అనేకమంది కార్మికులతో సహా సంపన్నుల భౌతికకాయాలను తిరిగి వారివారి స్వస్థలాలకు పంపే వరకు అష్రాఫ్ అంతా తానై వ్యవహరిస్తారు. ఆయన ఇప్పటివరకు 8 దేశాలకు చెందిన 4,700 మంది భౌతికకాయాలను ఆయా దేశాలకు తరలించారు. తమ ఇళ్లు వాకిళ్లను, సొంతవారిని విడిచిపెట్టి ఉపాధి లేక వేర్వేరు కారణాలతో ఎడారి దేశానికి వచ్చి, అక్కడే ప్రాణాలు కోల్పోతే.., ఆయా మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించడం తన నైతిక బాధ్యతగా అష్రాఫ్ భావిస్తారు. 'వారు.. మీరు.. నేను.. అన్న తేడా లేదు.. మానవులంతా సమానమే.. కష్టం.. బాధ అందరికీ ఒక్కటే. ఎవరైనా సరే చనిపోతే వారిని ముందుగా ఆసుపత్రికి ఆపై ప్రభుత్వ శవాగారానికి తరలిస్తారు. దుబాయిలోనే కాదు షార్జాలోనైనా ఇంకే ఇతర ఎమిరేట్‌లోనైనా ఒకటే ప్రక్రియ. ఇక్కడ పేద, ధనిక అన్న తేడా ఉండదు' అని అష్రాఫ్ తెలిపారు. మంగళవారం శ్రీదేవితో సహా ఐదు మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించారు అష్రాఫ్. బాలీవుడ్ తార శ్రీదేవికి భారత్‌లో ఉన్న అభిమానం ఊహించలేనిదిగా ఆయన అభిప్రాయపడ్డారు. పోలీసుల క్లియరెన్స్‌లో జాప్యం వల్లే శ్రీదేవి విషయంలో ఆలస్యం జరిగినట్టు అష్రాఫ్ వివరించారు. తనకు జర్నలిస్టులు, అధికారులు, ఇతరుల నుంచి వందలాది ఫోన్‌కాల్స్ వచ్చినట్టు చెప్పారు. క్లియరెన్స్ లభించిన వెంటనే తాను ప్రభుత్వ మార్చురీకి వెళ్లానని, ఆమెతో పాటు మరో ముగ్గురి భౌతికకాయాల ఎంబాల్మింగ్‌కి సంబంధించిన పత్రాలను అందజేసినట్టు తెలిపారు. ఆ తర్వాత శ్రీదేవి మృతదేహాన్ని అంబులెన్స్‌లో భారత్‌కు చెందిన ఓ సంపన్నుడు పంపిన ప్రైవేటు జెట్ వరకు చేర్చగా, అది అక్కడ నుంచి ముంబైకి బయల్దేరినట్టు చెప్పారు. ప్రక్రియ మొత్తం చేసుకొని దుబాయికి 35కిమీల దూరంలో ఉన్న అజ్మన్‌లోని తన సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌కు అర్ధరాత్రి సమయానికి చేరుకొన్న అష్రాఫ్ తన భార్య, కుమార్తెతో జరిగినదంతా చెప్పారు. అష్రాఫ్ షెర్రి థామెరస్సెరీ ఓ మెకానిక్ షాపు యజమాని. నిస్వార్థపరుడు.. ప్రజల మనిషి, అష్రాఫ్ మాట్లాడుతూ, కేవలం దీవెనల కోసమే ఇదంతా చేస్తానని చెప్పారు. 'పరదేశీయులు ఇక్కడ చనిపోతే ఆ తర్వాత విధివిధానాల గురించి చాలా మందికి తెలియవు. అందుకే వారికి సహాయం చేస్తాను' అన్నారు. అష్రాఫ్ ఫోన్ నిత్యం మోగుతూనే ఉంటుంది.

ఎప్పుడూ ఎవరో ఒకరు సహాయం కోసం అర్థిస్తూనేవుంటారు. ఏదిఏమైనా అష్రాఫ్ వంటి దయాళువుల వల్ల నేటి నేరయుగంలో మనుషుల్లో మానవత్వం బతికేవుందన్న నమ్మకం కలుగుతోంది. కాగా, బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లిన శ్రీదేవి (54) దుబాయిలో తుదిశ్వాస విడిచారు. ఆమె బాత్‌టబ్‌లో మునిగి చనిపోయినట్టు ధ్రువీకరించకముందు అనేక అనుమానాలు వ్యక్తమైన విషయం విదితమే.



ఎన్‌డీఏకు గుడ్‌బై : జితన్‌రామ్ మాంఝి

పాట్నా : హిందుస్తాన్ అవామ్ మోర్చా (హెచ్ఏఎం) పాలక ఎన్‌డీఏను వీడి ప్రతిపక్ష 'మహాగత్‌బంధన్'లో చేరుతున్నట్టు బీహార్ మాజీ ముఖ్యమంత్రి జితన్ రామ్ విలేకరులకు తెలిపారు. . ఆర్‌జేడీ, కాంగ్రెస్, ఆర్‌జేడీ నాయకులు తేజస్వి యాదవ్ , భోలా యాదవ్, తేజ్ ప్రతాప్ యాదవ్, ఇతరులతో కూడిన మహా కూటమే ఈ 'మహాగత్‌బంధన్'. ఈ కూటమిలో బుధవారం రాత్రి చేరుతున్నట్టు ఆయన ప్రకటించారు.

ఆప్ ఎమ్మెల్యేకు ప్రాణహాని లేదు

న్యూఢిల్లీ : చీఫ్ సెక్రటరీ అన్షు ప్రకాష్‌పై దాడి కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆప్ ఎమ్మెల్యే అమానుతుల్లా ప్రకాష్‌కు ప్రాణహాని లేదని, దీనికి సంబంధించి వస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని మండోలి జైలు అధికారవర్గాలు ఢిల్లీ కోర్టుకు తెలిపాయి. ఖాన్‌కు కోర్టు 14 రోజుల కస్టడీ విధించింది. జైలులో తనకు ప్రాణహాని ఉందని ఆరోపణలు చేస్తూ ఆయన కోర్టు దాఖలు చేయడంతో దీనిపై బదులివ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు దీనిపై జైలు సూపరింటెండెంట్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్‌కు నివేదిక సమర్పించారు.

బీహార్ అసెంబ్లీలో రగడ

పాట్నా : ముజఫర్‌పూర్ ఘటనపై ప్రతిపక్షాల ఆందోళనతో బడ్జెట్ సెషన్ మూడవరోజైన బుధవారం బీహార్ శాసనసభ రసాభాసగా మారింది. సభ ప్రారంభమైన వెంటనే ఆర్‌జేడీ ఎమ్మెల్యేలు ఇటీవల తొమ్మిదిమంది చిన్నారుల మృతి చెందిన అంశాన్ని లేవనెత్తారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిందితుడైన బీజేపీ నాయకుడిని ఈ కేసు నుంచి తప్పించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నినాదాలతో సభ గందరగోళంగా మారడంతో స్పీకర్ విజయ్ కుమార్ చౌదరి సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

అరుణాచల్‌ప్రదేశ్‌కు కేంద్రం నిధులు

ఇటానగర్ : ప్రధానమంత్రి గ్రామ్ సాదక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద అరుణాచల్‌ప్రదేశ్‌లో 15 వంతెనలు, 43 రోడ్ల నిర్మాణాలకు రూ.706.47 కోట్ల రూపాయలను కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంజూరు చేసింది. నిధుల అధికారికంగా మంజూరు చేస్తూ ఆ శాఖ డైరక్టర్ పి.మనోజ్‌కుమార్ సంతకం చేశారని రాష్ట్ర ఆర్‌డబ్ల్యూడీ కమిషనర్ తెలిపారు. కేంద్ర నిధులను ప్రాజెక్టులకు వినియోగించి, వాటిని సకాలంలో పూర్తి చేస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పేమ కందు హామీ ఇచ్చారని అధికారిక ప్రకటనను ఆయన విడుదల చేశారు.

జస్టిస్ పాండియన్ కన్నుమూత

చెన్నై : మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.రత్నవేల్ పాండియన్ (89) అస్వస్థత వల్ల బుధవారం కన్నుమూశారని ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన కుమారుడు సుబ్బయ్య మద్రాస్ హైకోర్టులో సిట్టింగ్ జడ్జిగా ఉన్నారు. పాండియన్ 1988 నుంచి 1994 వరకు సుప్రీంకోర్టు జడ్జిగా విధులు నిర్వర్తించారు. సుప్రీంకోర్టు జడ్జిగా పదవీవిరమణ అనంతరం ఆయన వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్‌కు చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు.

అక్రమ తవ్వకాల్లో ప్రమాదం : ఇద్దరు మృతి

కోట : రాజస్థాన్‌లోని కోట జిల్లాలో తక్లీ నదీఒడ్డున అక్రమంగా ఇసుక, కంకర తవ్వకాలు జరుపుతున్న సందర్భంలో మట్టిపెళ్లలు మీదపడి మహిళతోపాటు ఇద్దరు కార్మికులు మృతిచెందారని పోలీసులు బుధవారం తెలిపారు. చెచాట్ ప్రాంతంలో ఆరుగురు కార్మికులు ఆ సమయంలో తవ్వకం జరిపిన కంకర, ఇసుకను ట్రాలీలో నింపుతున్నారని తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్టు తెలిపారు.

కేరళ ప్రభుత్వంపై యూడీఎఫ్ ఆరోపణలు

తిరువనంతపురం : ఇటీవల కాంగ్రెస్ యువజనసంఘం కార్యకర్తలు హత్య ఘటనకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టడంతో కేరళ శాసనసభ వరుసగా మూడవరోజైన బుధవారం వాయిదాపడింది. యువజన కాంగ్రెస్ నాయకుడు సుహైబ్ హత్య అంశాన్ని యూడీఎఫ్ సభ్యులు లేవనెత్తి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ వైఖరి వల్ల రాష్ట్రంలో శాంతి, భద్రతల పరిస్థితి క్షీణించాయని విమర్శించారు.

గవర్నర్‌పై లైంగిక ఆరోపణలు?

న్యూఢిల్లీ : దక్షిణాదిలోని ఓ రాష్ట్ర గవర్నర్‌పై లైంగిక ఆరోపణలు వెల్లువెత్తాయి. రాజ్‌భవన్ ఉద్యోగినిపై ఆయన లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. బాధితమహిళ ఫిర్యాదు మేరకు కేంద్ర హోం శాఖ రంగంలోకి దిగి, దర్యాప్తు సంస్థలతో రహస్యంగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రచురించిన ఓ కథనం చర్చనీయాంశమైంది. ఆ గవర్నర్ ఏ రాష్ట్రానికి చెందినవారన్న సంగతి ఇంకా వెల్లడికాలేదు. తన పట్ల గవర్నర్ అసభ్యంగా ప్రవర్తించారంటూ రాజ్‌భవన్ ఉద్యోగిని చేసిన ఫిర్యాదును కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. ఆరోపణల్లో నిజమెంతో తెలుసుకునేందుకు రహస్యంగా విచారణ చేపట్టింది.¬ ఆ ఆరోపణలు నిజమని తేలితే ఆయనను పదవి నుంచి తొలగించే అవకాశముంది. అయితే ఈ వ్యవహారంపై స్పందించేందుకు కేంద్ర శాఖలు నిరాకరిస్తున్నాయి' అని టైమ్స్ కథనం పేర్కొన్నది. గతేడాది జనవరిలో షణ్ముగనాథన్ మేఘాలయ గవర్నర్‌గా ఉన్నప్పుడు సరిగా ఇదే తరహా ఆరోపణలు రావడంతో నాటి రాష్ట్రపతి ప్రణబ్.. గవర్నర్‌ను రీకాల్ చేసిన సంగతి తెలిసిందే.

ఆ కేసులో సూపర్‌ఫాస్ట్ విచారణ అవసరమా..?

న్యూఢిల్లీ : ఓ 14ఏళ్ల బాలుడికి అసహజ లైంగిక వేధింపులు, హత్య కేసులో ట్రయిల్ కోర్టు శరవేగంగా విచారణ జరిపిన తీరును ఢిల్లీ హైకోర్టు తప్పుబట్టింది. ఒకే రోజులో 24లో 22 మంది సాక్షులను విచారించడాన్ని ఆక్షేపించింది. క్రింది స్థాయి కోర్టు తీరు పలు విమర్శలకు తావివ్వడంతో హైకోర్టు ఘాటుగా స్పందించింది. ఈ కేసులో అంతవేగంగా విచారణ జరపాల్సిన అవసరం ఏమిటుంటూ మొట్టికాయలు వేసింది. తొందరపాటు తీర్పులతో న్యాయం జరగదని అభిప్రాయపడింది. 2012లో ఢిల్లీలో ఓ మైనర్‌ను అపహరించి, అతన్ని అసహజ శృంగారం వైపు ఆకర్షితుడ్ని చేసి.. ఆపై హతమార్చిన ఇద్దరు వ్యక్తులను దోషులుగా నిర్ధారించి, శిక్ష విధిస్తూ 2014, అక్టోబరులో ట్రయిల్ కోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ ఎస్ మురళీధర్, జస్టిస్ ఐఎస్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది. ఆ ఇద్దరిని విడుదల చేసింది. నిందితుల పట్ల పక్షపాతంగా వ్యవహరించారంటూ ట్రయిల్ కోర్టుకు మొట్టికాయలు వేసింది.

పీఎన్‌బీ స్కామ్‌ను

కేన్సర్‌తో పోల్చడంపై ప్రముఖ డాక్టర్ ఫైర్

న్యూఢిల్లీ : అవినీతి మాదిరి కేన్సర్ సిగ్గు పడాల్సిన అంశం కాదని పద్మశ్రీ , రామన్ మెగసెసె అవార్డుల గ్రహీత డాక్టర్ వి. శాంత పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) ఎండీ, సీఈవో సునీల్ మెహతాపై ఫైర్ అయ్యారు. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, అతని అనుయాయులు పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో జరిపిన రూ. 12,717 కోట్ల స్కామ్‌ను పీఎన్‌బీ ఎండీ, సీఈవో, సునీల్ మెహతా కేన్సర్‌తో పోల్చడంతో ఆమెపై విధంగా స్పందించారు. కేన్సర్‌ను అవినీతిని ఎప్పుడూ కలపొద్దని ఆమె తీవ్రంగా హెచ్చరించారు. నీరవ్ మోడీ స్కామ్ నేపథ్యంలో విలేకరుల సమావేశంలో మెహతా మాట్లాడుతూ 2011 నుంచి బ్యాంకులో అవినీతి జరుగుతూ కేన్సర్‌లా వ్యాప్తి చెందిందని దీనిని త్వరలోనే నిరోధిస్తామని వెల్లడించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో వెలుగుచూసిన ఈ స్కామ్‌ను కేన్సర్‌తో ముడిపెట్టడం ఆమెకు తీవ్ర వేదన కలిగించిందని, అవినీతి నేరము, సిగ్గుపడాల్సిన అంశమని అయితే కేన్సర్‌కు అలాంటిదేమీ లేదని చెన్నైలోని కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ (డబ్ల్యు ఐఎ) చైర్మన్ డాక్టర్ శాంత వెల్లడించారు. కేన్సర్ వ్యాధి తగ్గుతుందని వారు మళ్లీ సంతోషంగా బ్రతుకుతారని, అయితే అవినీతికి పాల్పడినవారికి ఆ అవకాశం ఉండదన్నారు. కేన్సర్‌ను నివారించవచ్చు, తగ్గించవచ్చు కాబట్టి ఎప్పుడూ అవినీతిని కేన్సర్‌తో పోల్చవద్దని ఆమె ప్రజలను కోరారు. వేర్లాడిన అవినీతితో బ్యాంకులో సామాన్యులు దాచుకున్న సొమ్ముకు భరోసా లేకుండా పోతోంది. వరుస బ్యాంకు మోసాలతో తల్లడిల్లుతున్న కేంద్ర ప్రభుత్వం రూ. 50 కోట్లు దాటిన నిరర్థక ఆస్తుల పరిశీలించాల్సిందిగా సీబీఐని ఆదేశించింది.





శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

విశాలాంధ్ర - తిరుమల : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని పలువురు ప్రముఖులు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. వీరిలో శ్రీలంక మాజీ అధ్యక్షుడు రాజపక్సే, ప్రభుత్వ విప్ గణబాబు, మాజీ క్రికెటర్ వెంకటేష్‌ప్రసాద్ తదితరులు ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయంలో రంగ నాయకుల మండపంలో వీరికి వేదపండితులు ఆశీర్వచనం పలుకగా టీటీడీ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బోల్తా

ఒకరు మృతి-9 మందికి గాయాలు

విశాలాంధ్ర - ప్యాపిలి : కర్నూలుజిల్లా ప్యాపిలి మండల పరిధిలో చిరుతల గుట్ట వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా, 9 మందికి గాయాలైన ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. 29 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుండి బెంగుళూరుకు బయలు దేరిన బస్సు ప్యాపిలి సమీపంలోని చిరుతల గుట్టవద్ద అదుపుతప్పి బోల్తా పడింది. కారు చీకట్లో తెల్లవారుజామున నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులు ఈ ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడి హాహాకారాలు పెట్టారు. ఏమి జరిగిందో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. కొందరు ప్రయాణికులు రక్తంతో తడిసిపోయారు. హైదరాబాద్ కొండాపూర్‌కు చెందిన ఆదిత్య (27) తలకు బలమైన గాయం తగిలింది. బస్సు డ్రైవర్ తమిళ అర్జున్‌కు రెండు చేతులు విరిగిపోయాయి. ఇద్దరినీ గుత్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆదిత్యను వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం డ్రైవర్‌ను మెరుగైన చికిత్స కోసం బెంగుళూరు తరలించారు. ప్రయాణికులు క్రిష్ణ, శ్రీనివాసరెడ్డి, సత్యవతి, స్వాతిచౌదరి, మురలీకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, భాస్కర్‌లకు గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం తెలుసుకున్న పీఐ రామకృష్ణ సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బోల్తా పడిన బస్సును క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు. ప్యాపిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



GOVERNMENT OF ANDHRA PRADESH

Form.No.VI (A)

(Under section 11(1) of the Act, 30 of 2013 read with Sub Rule (1) of Rule 19)

PRELIMINARY NOTIFICATION

Where as it appears to the District Collector, Srikakulam that the land specified in the schedule below are needed for a public purpose of construction of High level Canal of Hiramandalam Reservior under B.R.R. Vamsadhara Project of Stage II of Phase II IN MALLIKHARJUNA PURAM VILLAGE OF L.N.PETA MANDAL under Vamsadhara project, notice to that effect is hereby given to all to whom it may concern in accordance with the provisions of section 11 (1) of the Right to fair compensation and transparency in Land Acquisition, Rehabilitation and Re-settlement Act.2013 (Central Act No.30 of 2013).

Now, therefore in exercise of the powers conferred under section 12 of the Act, the District Collector, Srikakulam hereby designated the Special Deputy Collector (LA), Hiramandalam Unit II, his staff and workmen to exercise the powers conferred under the above said section.

Under Section 11 (4) of the Act, no person shall make any transaction or cause any transaction of the land i.e., sale/purchase etc., or create any encumbrances on such land from the date of this notification without the prior approval of the Collector/Land Acquisition Officer.

Objections to the acquisition, if any, may be filed by the person (s) interested within 60 (sixty) days from date of publication of this Notification as provided under section 15 of the Act before the Collector/Land Acquisition Officer.

SCHEDULE

District : Srikakulam. Mandal : Laxminarsupeta

Village : MALLIKHARJUNA PURAM

Sl. No.	Survey No.& Sub/Div. No.	Classification	Total Extent (In Acs)	Extent under Acquisition	Name of the Land Owner	Boundaries North	South	East	West	Details of Trees, Structures etc., if any
1	2	3	4	5	6	7	8	9	10	11
1	1-10	Manavari	0.18	0.18	Menda Sudarshana W/o Pentayya	Village Boundary	15	S.No.4	9/1	
2	1-11	Manavari	0.13	0.13	Ravada Tavitayya S/o Latchanna	10	12B	S.No.4	9/2	
3	1-12B	Manavari	0.40	0.26	Menda Sudarshana W/o Pentayya	11	S.No.1	S.No.4	12A,14B	
4	1-13B	Dry	0.11	0.02	Ravada Tavitayya S/o latchanna	12B	4	13A	14B	
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
65	18-6B	Manavari	0.59	0.43	Kota Annapurna W/o Ramarao	18	S.No.17	5	5B	
66	18-5A	Manavari	0.51	0.20	Kota Srinu S/o Suryanarayana	S.No.16	6A	5B	1	
67	18-6A	Manavari	0.25	0.11	Kota Srinu S/o Suryanarayana	5A	7A	6B	4	
68	18-7A	Manavari	0.38	0.22	Kota Appalanaidu S/o Ramulu	6A	8A	7B	4	
69	18-8A	Manavari	0.45	0.31	Kota Viswanadham S/o Ramamurthy Yenda Dhanalakshmi	7A	9A	8B	1	
70	18-9	Manavari	0.40	0.26	Kintali Ammnaidu S/o Narayya	7A	10	9B	1	
71	18-10	Manavari	0.30	0.30	Kota Annapurna W/o Ramarao	9	11A	11B,12A	1	
72	18-11A	Dry	0.37	0.25	Kota Annapurna W/o Ramarao	10	12B	13	4	
73	18-11B	Dry	0.37	0.37	Kota Ammanaidu S/o Tavudu	11A	Village Boundary	13	4	Teak-2 Teak-1
74	18-13A	Manavari	0.37	0.06	Yenda Dhanalakshmi	5A	11A	13B	10	
	Total:			22.26						

K. Dhananjaya Reddy, I.A.S.

District Collector, Srikakulam

రసాయనాలతో బెల్లం తయారీ!

- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- క్యాన్సర్‌కు కారణమంటున్న శాస్త్రవేత్తలు
- మాకు సంబంధం లేదంటున్న తహశీల్దారు
- స్పందించని ఆహార తనిఖీ అధికారులు




విశాలాంధ్ర - చీడికాడ : ధనార్జనే ధ్యేయంగా బెల్లం తయారీకి ప్రాణాంతకమైన రసాయనాలు వాడుతున్న తయారీదారులపై రెవెన్యూ, ఆహార తనిఖీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వీరి వ్యాపారం మూడు చెరకుగెడలు, ఆరు బెల్లం దిమ్మలుగా విరాజిల్లుతోంది. విశాఖజిల్లా చీడికాడ మండలంలో చెరకు పంట అధికంగా ఉండటంతో గోవాడ షుగర్స్‌లో సభ్యరైతులు సైతం బెల్లం తయారీపైనే మక్కువ చూపుతున్నారు. ఇక్కడ తయారుచేసిన బెల్లం అనకాపల్లి మార్కెట్టుకు తరలిస్తుంటారు. అయితే రైతాంగం స్వతహాగా తయారుచేసే బెల్లం నల్లగా ఉండటంతో వినియోగదారులు ఆసక్తి చూపకపోవటం, తెల్ల (రంగు) బెల్లంపైనే వినియోగదారులు శ్రద్ధ చూపిస్తుండటంతో పిఠాపురానికి చెందిన కొందరు దళారీ వ్యాపారులు ఈ మండలంపై కన్నువేశారు. ఈ ప్రాంతంలో అనధికారికంగా క్రషర్లు ఏర్పాటుచేసి రైతుల నుండి చెరకు కొనుగోలు చేసి కొన్ని విషతుల్యమైన రసాయనాల వాడకంతో రంగు (తెల్ల) బెల్లం తయారుచేస్తున్నారు. బెల్లం తెల్లగా ఆకర్షణగా, గట్టిగా ఉండేందుకు నిషేధిత రసాయనాలు వాడుతున్నారు. దళారీ వ్యాపారులు తయారు చేసిన రంగు బెల్లంపైనే వినియోగదారులు శ్రద్ధ చూపుతుండటంతో అనకాపల్లి మార్కెట్టుకు తరలించి, నెంబరు ఒన్ రకంగా చూపి వినియోగదారులను మోసం చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. బెల్లం రంగు మారేందుకు, తెల్లగా కనపడేందుకు సూపరు ఫాస్ఫేట్, గరుకు సోడా, హైడ్రాస్ జిగురు పేస్టు వాడుతున్నారు. హైడ్రాస్ ద్రావణం కారణంగా భయంకరమైన క్యాన్సర్ సోకుతుందని, బట్టల సోడాలో ఉపయోగించే గరుకు సోడా, సూపరు ఫాస్ఫేట్, జిగురు పేస్టుల వలన కీళ్లు, ఎముకలకు సంబంధించిన వ్యాధులతోపాటు కిడ్నీలు పాడవుతాయని వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన విభాగం ప్రధాన శాస్త్రవేత్త పి.వి.కె.జగన్నాథం తెలిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ వ్యాపారాలు చేస్తున్న వీరు ఆయా గ్రామాల్లో చోటామోటా నేతలు సహకరిస్తుండటంతో ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా క్రషర్లు ఏర్పాటు చేస్తున్నారనేది బహిరంగ రహస్యం. అయితే వ్యాపార పరంగా ఏదైనా క్రషర్లు ఏర్పాటు చేయాలంటే ముందుగా గ్రామ పంచాయతీ అనుమతితోపాటు తహశీల్దారు అనుమతులు పొందవలసి ఉంది. కానీ, అటువంటివేమీ జరగకుండానే ప్రతి ఏడాది క్రషర్లు ఏర్పాటు చేస్తున్నారు. రసాయనాలు ఉపయోగించి బెల్లం తయారు చేస్తున్నారు.

మాకు సంబంధం లేదు : ఈ సమస్యపై స్థానిక తహశీల్దారు కె.భాగ్యవతిని వివరణ కోరగా క్రషర్లు ఎక్కడ ఏర్పాటు చేశారు, మాకు తెలియదే అంటూ, అయినా వాటిలో కల్తీ జరిగితే ఆహార తనిఖీ అధికారులు చూడాలి కానీ, మాకు సంబంధం లేదు, మీరు చెప్పారు కనుక పరిశీలిస్తామని సమాధానమిచ్చారు. మండల మేజిస్ట్రేట్ అయిన తహశీల్దారుకు మండలంలో అమలు జరిగే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సమస్త ఆస్తులపై అధికారం కలిగి ఉండి వ్యాపార విభాగాలపై కూడా పర్యవేక్షించి తప్పులు జరిగితే తగిన చర్యలు తీసుకునే అధికారం ఉంది. అటువంటిది మాకు సంబంధం లేదనడం ఆశ్చర్యకరం.

కనిపించని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు : హోటళ్లు, దుకాణాల్లో అవినీతి అక్రమాలు, కల్తీ జరగకుండా పర్యవేక్షించాల్సిన అధికారులు అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. చర్యలు తీసుకోవలసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఎప్పుడూ కనిపించరు. ఏడాదిలో దసరా ముందు ఫుడ్ ఇన్‌స్పెక్టరు, సిబ్బంది మండలాల్లో పర్యటించి దుకాణదారులు, హోటళ్ల వారితో మాట్లాడి వెళతారే కానీ, దాడులు జరపడం సరకులు పరిశీలించడం వంటివి చేయరు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వస్తాం, చర్యలు తీసుకుంటాం అని సమాధానమివ్వడమే తప్ప ప్రజా ఫిర్యాదులపై స్పందించడం, తనిఖీలు చేయడం వంటి చర్యలు మండలంలో ఎక్కడా కానరావటం లేదు.

చీపురుపల్లి సబ్‌జైలు నుంచి రిమాండ్ ముద్దాయి పరారీ

విశాలాంధ్ర - చీపురుపల్లి : విజయనగరం జిల్లా చీపురుపల్లి సబ్‌జైలులో ఉన్న రిమాండ్ ముద్దాయి గొల్లపల్లి గోవింద్ జైలు నుండి పరారీ కావడంతో ఇన్‌చార్జ్ హెడ్ వార్డర్ బీవీ వెంకట్రావు, వార్డర్లు జేపీ సూరిబాబు, నర్సింహులను సస్పెండ్ చేస్తున్నట్లు జైళ్ల జిల్లా అధికారి ఎస్. కిషోర్‌కుమార్ తెలిపారు. స్థానిక సబ్‌జైలును బుధవారం ఆయన సందర్శించారు. జైలు పరిసరాలను, ముద్దాయి గోవింద్ తప్పించుకున్న పరిస్థితిని పరిశీలించారు. సిబ్బంది ఎవరు విధుల్లో ఉన్నారో తెలుసుకున్నారు. విధులు ఉల్లంఘించిన హెడ్ వార్డర్, ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారు. సెక్యూరిటీ గార్డు విధుల్లో ఉండాల్సిన సిబ్బంది కూడా విధుల్లో లేకపోవడంతో గార్డు డ్యూటీ సిబ్బంది పై చర్యలు తీసుకునేందుకు ఎస్పీకి నోటీస్ పెట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 20న గుర్ల మండలం పల్లి గండ్రేడు గ్రామానికి చెందిన పాతనేరస్తుడు గొల్లపల్లి గోవింద్ పాలకొండ సబ్ జైలు నుండి చీపురుపల్లి సబ్ జైలుకు రిమాండ్‌పై వచ్చాడని జిల్లా అధికారి కిషోర్‌కుమార్ తెలిపారు. గరివిడి, గుర్ల, చీపురుపల్లి పోలీస్ స్టేషన్లలో 6 కేసుల్లో గోవింద్ ముద్దాయిగా ఉన్నాడన్నారు. ఫిబ్రవరి 26న గజపతినగరం కోర్టులో గోవింద్ పై దొంగతనం కేసు రుజువు కావడంతో ఏడాది జైలుశిక్ష పడిందన్నారు. ఫిబ్రవరి 27 ఉదయం చీపురుపల్లి సబ్ జైలు నుండి తహశీల్దార్ కార్యాలయం వైపు మార్గం ద్వారా పెంకులు విరిచి తప్పించుకున్నాడని ఆయన తెలిపారు. విధుల్లోకి రావాల్సిన వార్డర్ విధుల్లోకి రాకుండానే అప్పటి వరకు విధుల్లో ఉన్న వార్డర్ వెళ్లి పోవడంతో జైలు నుండి పారిపోయినట్లు తెలిపారు.



గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో - విజయనగరం : గ్రామాల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ బి.రామాంజనేయులు తెలిపారు. బుధవారం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో పార్వతీపురం, విజయనగరం డివిజన్లలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ అనుసంధానంతో చేపట్టిన పనుల పురోగతి పంచాయతీ రాజ్, డీఆర్‌డీఏ గ్రామీణ నీటి సరఫరా విభాగం, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ, ఐసీడీఎస్ అధికారులు, సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను సంపూర్ణ ఓడీఎఫ్‌గా తీర్చిదిద్దడానికి జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్ చేసిన కృషిని అభినందించారు. 75 ఏళ్లుగా జిల్లా ప్రజలను పీడిస్తున్న పీడ కలకు ఫుల్‌స్టాప్ పెట్టి అద్భుతమైన విజయం సాధించారని ప్రశంసించారు. రాష్ట్ర విభజనలో ఆర్థిక ఇబ్బందులున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆత్మవిశ్వాసంతో కుటుంబ వికాసం, సమాజ వికాసం అనే 25 అంశాలపై ప్రజలకు భద్రత కల్పించే అంశాలుగా 7 మిషన్లు, 5 గ్రిడ్లు, 5 కాంపైన్లతో అనుసంధానించి గత మూడున్నరేళ్లలో గ్రామం ఒక యూనిట్‌గా తీసుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి లోకేష్ 25 అంశాలను 11 స్టార్స్‌గా క్రోడీకరించి పంచాయతీల అభివృద్ధి సూచనలు చేసే విధంగా పరిపూర్ణమైన అభివృద్ధి పంచాయతీగా ఎంత సమయం పడుతుందో తెలుసుకోవడమే 11 స్టార్ల ఉద్దేశ్యం అని చెప్పారు. ప్రతి కుటుంబానికి నెలకు 10 వేల రూపాయల ఆదాయం పొందేలా అదనపు స్వయంఉపాధి పథకాలు మంజూరు చేస్తామని చెప్పారు. భూగర్భ జలాలు పెరిగే విధంగా పంట పొలాల్లో ఫారం పాండ్స్ నిర్మించాలని చెప్పారు. కుటుంబ సర్వతోముఖాభివృద్ధికి ఉపాధి హామీ దోహదపడుతుందన్నారు. బాల్య వివాహాలు విడనాడాలని, గిరిజన ప్రాంత విద్యార్థులను మైదాన ప్రాంతాలలో చదివించాలని సూచించారు. కలెక్టర్ వివేక్‌యాదవ్ మాట్లాడుతూ పని కల్పించాలన్న కోరిక, వారందరికీ ఉపాధి పనులు కల్పించడమే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ లక్ష్యమని చెప్పారు. 2005 సంవత్సరం నుండి ఉపాధి హామీ పథకం అమలు జరుగుతోందన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పనులు బాగా జరుగుతున్నాయని తెలిపారు. ఓడీఎఫ్‌లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టి ఓడీఎఫ్ ప్లస్ వెళుతున్నామన్నారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించి చర్యలు తీసుకోవడమైందన్నారు. జిల్లాలో 1130 మిల్లీమీటర్ల వర్షపాతం ఉందన్నారు. భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. 18 శాతం మాత్రమే భూగర్భ జలాలను వినియోగిస్తున్నారని అన్నారు. మార్చి నెలాఖరు నాటికి లక్ష్యాలను సాధిస్తామని అన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి డాక్టరు లక్ష్మీశా మాట్లాడుతూ గిరిజన ప్రాంతానికి ఉపాధి హామీ పథకంలో రూ. 219 కోట్లతో 450 రోడ్లు మంజూరు చేసినందుకు గిరిజన ప్రాంతం రుణపడి ఉంటుందన్నారు. ప్రతి మండలంలో పది వేల మంది కూలీలు పనిచేయాలనేది లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ గ్రామాల మాదిరిగా గిరిజన ప్రాంతాల్లో 150 పనిదినాలు కల్పించాలనే డిమాండ్ ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ రాజగోపాల్‌రావు, డీఆర్‌డీఏ పీడీ సుబ్బారావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ వివి రమణమూర్తి, పంచాయతీరాజ్ ఎస్ఈ మోహన్ మురళి, పార్వతీపురం, విజయనగరం డివిజన్ల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తహశీల్దార్‌పై వంశధార నిర్వాసితుల దాడి

13 మందిపై నాన్‌బెయిలబుల్ కేసు



విశాలాంధ్ర - హిరమండలం : అర్హులకు యూత్ ప్యాకేజీలు అందజేయకుండా అనర్హులకు అందజేశారన్న ఆగ్రహంతో నిర్వాసిత దుగ్గుపురం గ్రామానికి చెందిన నిర్వాసితులు తహశీల్దార్‌పై దాడిచేశారు. శ్రీకాకుళంజిల్లా హిర మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం.కాళీప్రసాద్‌పై వంశధార నిర్వాసిత గ్రామమైన దుగ్గుపురం గ్రామానికి చెందిన వంద మంది నిర్వాసితులు బుధవారం ఉదయం దాడి చేశారు. దాడి విషయం రెవెన్యూ సిబ్బంది ద్వారా పోలీస్ స్టేషన్‌కు చేరడంతో నిర్వాసితులందరినీ స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గాయపడిన తహశీల్దార్ ఎం.కాళీప్రసాద్‌కు స్థానిక హిర మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పి.నీలిమ, ప్రాథమిక వైద్య చికిత్సను అందించి అనంతరం రిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, పాలకొండ డీఎస్పీ స్వరూపరాణి, పాతపట్నం సీఐ బీవీవీఎస్ ప్రకాష్, ఇతర మండలాల రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తహశీల్దార్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్వరూపరాణి విలేకరులతో మాట్లాడుతూ దుగ్గుపురం గ్రామానికి చెందిన 13 మంది నిర్వాసితులపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశామన్నారు.

తహశీల్దార్ ఎం.కాళీప్రసాద్ మాట్లాడుతూ నిర్వాసితులు ఒక్కసారిగా తనపై, కుర్చీలో ఉండగానే చేతులతో దాడి చేసినట్లు వివరించారు. నిర్వాసితులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని, స్థిరనివాసం కాని అనర్హులు 21 మందికి యూత్ ప్యాకేజీల కింద ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున స్థానిక రెవెన్యూ అధికారులు అందజేశారని, అర్హులైన చాలా మందికి తహశీల్దార్ ఎం.కాళీ ప్రసాద్ ఇంటి స్థలం, నష్టపరిహారం, యూత్ ప్యాకేజీలు అందజేయడం లేదని తెలిపారు. కలెక్టరేట్‌లో, తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ పరిహారం అందజేయడం లేదని, కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని విలేకరులకు తెలిపారు.

నర్సరీల్లో క్యాంటీన్లు, పార్కులు



విశాలాంధ్రబ్యూరో - శ్రీకాకుళం : రాష్ట్రంలోని అటవీశాఖకు చెందిన నర్సరీలలో పార్కులు, క్యాంటీన్ల ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్సు పి.మల్లికార్జునరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో బుధవారం పర్యటించిన ఆయన అటవీశాఖ సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన 'విశాలాంధ్ర'తో మాట్లాడారు. అటవీశాఖ అంటే ప్రజలతో పని ఉండదన్నట్లు కాకుండా ఇకపై ప్రజా సంబంధాలు మెరుగుపరుచుకునేలా కృషి చేస్తామన్నారు. నర్సరీల రూపురేఖలు మారుస్తామని, ఆహ్లాదం కోసం అన్ని నర్సరీల్లో క్యాంటీన్లు, చిల్డ్రన్స్ పార్కులను తొలి విడతలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించుకున్నామన్నారు. నర్సరీలకు వచ్చే వారికి ఆహ్లాదంతో పాటు, ఇక్కడ మొక్కల పెంపకం, ఉపయోగాలు, ఔషధ గుణాలు ఇంకా వాటి చరిత్రకు సంబంధించిన వివరాలన్నీ అందరికీ తెలియజేసేలా సిబ్బంది స్నేహపూర్వక వాతావరణంలో పనిచేస్తారన్నారు. ఆయన జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. రణస్థలం, నరసన్నపేట నర్సరీలను పరిశీలించారు. ఐఎఫ్ఎస్ అధికారి రాహుల్‌పాండే, డీఎఫ్ఓ శాంతి స్వరూప్, సామాజిక అటవీశాఖ అధికారి ధనుంజయరావు ఆయన వెంట వున్నారు.

అవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు

ముర్తుజా మృతికి సీపీఎం సంతాపం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ముర్తుజా మృతికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు సంతాపం తెలిపారు. పేద ముస్లిం కుటుంబంలో పుట్టిన ముర్తుజా ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్రపతి అవార్డును అందుకున్నారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దక్షిణ భారత హిందీ ప్రచారసభ రాష్ట్ర స్థాయి కార్యదర్శిగా చేసిన ముర్తుజా పేద మైనారిటీ విద్యార్థులకు ఉపకారవేతనాలు, పాఠ్యపుస్తకాలను అందచేయడం వంటి పలు సామాజిక కార్యక్రమాలు చేసారన్నారు. ఈ సందర్భంగా సీపీఎం తరపున సంతాపంతోపాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

ఆప్ ఎమ్మెల్యేల అనర్హతపై తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ:లాభదాయక పదవుల్లో కొనసాగుతున్నారని ఈసీ ఆరోపణలు ఎదుర్కొంటున్న 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై ఢిల్లీ హైకోర్టు బుధవారం తీర్పు రిజర్వు చేసింది. జస్టిస్ సంజీవ్‌ఖన్నా, చంద్రశేఖర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎమ్మెల్యేలు, ఎన్నికల కమిషన్ వాదనలు విన్నాం.. తీర్పును రిజర్వు లో ఉంచాం అంటూ పేర్కొంది. ఎన్నికల కమిషన్ (ఈసీ) కు తమ వాద నలు వినిపించే అవకాశం ఇవ్వకుండా తమను తొలగించిందని, ఇది స్వాభావిక న్యాయప్రక్రియకు ఉల్లంఘనేనని ఆప్ ఎమ్మెల్యేలు మంగళవారం వాదించారు. ఈసీ సిఫార్సుల మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ 20 మంది ఎమ్మెల్యేలపై వేటు వేయడంతో వారు ఢిల్లీ హైకోర్టులో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టుకు

రూ. 190 కోట్ల నాబార్డు రుణం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఏపీ ఉద్యానవనశాఖ అధ్వర్యంలోని సూక్ష్మ నీటి పారుదల ప్రాజెక్టుకు జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) రూ. 190.58 కోట్ల రుణాన్ని బుధవారం మంజూరు చేసింది. ఈ మొత్తం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి (ఆర్ఐడీఎఫ్) నుంచి కేటాయించింది. ఈ ప్రాజెక్టు కింద 60 వేల హెక్టార్లలో బిందు సేద్యం, స్ప్రింక్లర్ నీటిపారుదల వ్యవస్థను అమలు చేసేందుకు ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. దీనివల్ల 33,400 మంది చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ,ఎస్టీ రైతులకు లబ్ధి చేకూరుతుందని నాబార్డు ఏపీ సీజీఎం కె సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు వ్య.కా.సం రాష్ట్ర విస్తృత కార్యవర్గం

విశాలాంధ్ర బ్యూరో -విజయవాడ : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యవర్గ విస్తృత సమావేశం మార్చి 1వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు గుంటూరులోని మల్లయలింగం భవనంలో జరుగుతుంది. ఈ సమావేశానికి కార్యవర్గ సభ్యులతోపాటు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, గౌరవాధ్యక్షులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సకాలంలో హాజరుకావాల్సిందిగా సంఘం ప్రధాన కార్యదర్శి జల్లి విల్సన్ ఒక ప్రకటనలో కోరారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో

రూ.100 కోట్ల అక్రమ మైనింగ్

మాజీ మంత్రి రావెల సంచలన వ్యాఖ్యలు



విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు బుధవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. తన నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై సొంత పార్టీ నేతలు, కుమారులపై బాణం ఎక్కుపెట్టాడు. మంత్రి పుల్లారావుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. దీంతో టీడీపీ నేతలు ఇరకాటంలో పడ్డారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలో పలు గ్రామాల్లో అక్రమ మైనింగ్ జరుగుతుందని ఇటీవల వెలుగులోకి వచ్చింది. దీంతో ఆయన బుధవారం ఓబులనాయుడుపాలెంలో అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇప్పటివరకు దాదాపు రూ.100 కోట్లు అక్రమ మైనింగ్ జరిగిందని, దీనిలో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు కుమారుడు మన్నవ అనిల్ కూడా ఉన్నారని ఆరోపించారు. అనిల్‌పై కేసులు కూడా ఉన్నాయని, అక్రమ మైనింగ్‌పై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. ప్రత్తిపాటి పుల్లారావు పేరుతో అశోక్ బృందం యథేచ్ఛగా అక్రమ మైనింగ్ చేస్తుందని విమర్శలు ఎక్కుపెట్టారు. దీనిలో పోలీసు, మైనింగ్, రెవెన్యూ అధికారులు పెద్దఎత్తున లంచాలు తీసుకుని మౌనంగా ఉన్నారని ధ్వజమెత్తారు. దీంతో జిల్లాలో ఇది తీవ్ర సంచలనం రేపింది. టీడీపీకు చెందిన ఎమ్మెల్యే ఇలా జిల్లాకు చెందిన మంత్రి, టీడీపీ నాయకులపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టడంతో టీడీపీ నాయకులు ఇరకాటంలో పడ్డారు. దీనిపై ప్రత్తిపాటి పుల్లారావుతోపాటు, మన్నవ సుబ్బారావులు కూడా తర్జనభర్జన పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబును గత ఏడాది సీఎం మంత్రి వర్గం నుంచి తప్పించారు. అప్పటి నుంచి టీడీపీ అధిష్ఠానంపై అసంతృప్తిగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. జడ్పీ చైర్‌పర్సన్ జానీమూన్‌తో రావెలకు కొంతకాలం విభేదాలు నడిచాయి. దీంతోపాటు అధిష్ఠానం మాటలను పట్టించుకోకపోవడం వలనే ఈయన్ని మంత్రి వర్గం నుంచి తప్పించినట్లు అప్పట్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే మంత్రివర్గం నుంచి తప్పించిన దగ్గర నుంచి ఆయన అధిష్ఠానంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సొంత పార్టీ నేతలపై విమర్శనాస్త్రాలు ఎక్కిపెట్టినట్లు టీడీపీ నాయకులు చెబుతున్నారు. ఈ వివాదంపై సీఎం చంద్రబాబునాయుడు సీరియస్ అయినట్లు విశ్వసనీయ సమాచారం.

అతిలోక సుందరికి

అంతిమ వీడ్కోలు



ముంబై : తనకు అత్యంత ప్రాణప్రదమైన ఎర్ర కంజీవరం చీరలో... నుదుట ఎర్రటి కుంకుమ...పక్కనే మల్లిపూలు గుభాళిస్తుంటే... దవళ పూలరథంపై శాశ్వత నిద్రలో అందాలరాశి అతిలోక సుందరి...లేడీ లెజెండ్ శ్రీదేవి... తన అభిమానుల గుండెల్ని పిండేసి... కన్నీటి కెరటాల్లో నెట్టేసి తిరిగిరాని యాత్రకు బయలుదేరిన వేళ... విషాదం నిశ్శబ్దంగా అడుగులేసింది. సిరిమల్లెపువ్వు చిన్నబోయింది. చిరునవ్వుల చాందినీ వలవల ఏడ్చింది. యావత్ భారత తారాలోకం తల్లడిల్లిపోయింది. ఏడు కిలోమీటర్ల అంతిమ యాత్రలో అభిమానులు, సినీదిగ్గజాలు, రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు విషణ్ణవదనాలతో తుది వీడ్కోలు పలికారు. సెలబ్రేషన్స్ స్పోర్ట్స్ క్లబ్ నుంచి బుధ వారం అంతిమయాత్ర ప్రారంభానికి ముందు శ్రీదేవి పార్థివ దేహంపై జాతీయ జెండాను ఉంచి, ప్రభుత్వ లాంఛనాలతో సత్కరించారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. శ్రీదేవి చివరి సంతకంగా సంబోధిస్తూ ఈ ఫొటోను అభిమానులు విపరీతంగా షేర్ చేసుకున్నారు. దేశం నలుమూలల నుంచి సినీ, రాజకీయ ప్రముఖులెందరో శ్రీదేవి అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతకముందు సెలబ్రేషన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో శ్రీదేవి పార్థివ దేహాన్ని ఉంచారు. కుటుంబ సభ్యులు బోనీకపూర్, అనిల్ కపూర్, సంజయ్‌కపూర్, హర్షవర్ధన్ కపూర్, సోనమ్ కపూర్, రిహే కపూర్ కన్నీటితో పార్థివ దేహం పక్కన నిలబడ్డారు. శ్రీదేవి కుమార్తెలు జాహ్నవి, ఖుషీ మరో పక్కన దుఃఖిస్తూ నిలబడ్డారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్ర బోరున విలపించారు. సినీ నిర్మాత కరణ్ జోహార్ నిశ్చేష్టులయ్యారు. శ్రీదేవి పార్థివ దేహం పక్కనే రాణి ముఖర్జీ కూర్చున్నారు. ఇక అంతిమయాత్రలో బోనీ కపూర్ కుటుంబీకులందరూ పాల్గొన్నారు. బోనీకపూర్, మొదటి భార్య కుమారుడు అర్జున్ కపూర్, మేనల్లుడు మోహిత్ మార్వా పలువురు సినీనటులు అంతిమ యాత్ర వాహనంలో శ్రీదేవి పక్కన ఉన్నారు. శ్రీదేవి కోరిక మేరకే ఆమె అంతిమయాత్ర వాహనాన్ని మొత్తం వివిధ రకాల తెల్ల పూలతో అలంకరించారు. వాహనం లోపల శ్రీదేవి చిత్ర పటాన్ని పెట్టారు. చిత్రపటం చుట్టూ అల్లిన తెల్లపూలను అలంకరించారు. ఏడు కిలోమీటర్ల అంతిమయాత్ర విల్లేపార్లేలోని సేవా సమాజ్ స్మశాన వాటికలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీదేవి చితికి బోనీ కపూర్ నిప్పంటించారు. ఆ సమయంలో అభిమానులు బోరున విలపించారు.

తారాలోకం భావోద్వేగం...!

నటి ప్రియా ప్రకాశ్ వారియర్ సైతం తన అభిమాన నటి శ్రీదేవికి నివాళులర్పించారు. కరణ్ జోహార్ తెరకెక్కించిన 'కభీ అల్విదా నా కెహనా' (ఎప్పుడూ వీడ్కోలు చెప్పొద్దు) చిత్రంలోని 'తుమ్ కభీ హై ఖబర్ ముఝ్ కో ఖీ.. పెహా రహా హే జుదా..' పాటను ఆలపిస్తూ నివాళులర్పించారు. దీనికి 'చరిత్ర ఎప్పుడూ వీడ్కోలు పలకదు.. కేవలం తర్వాత కలుద్దాం అని చెబుతుంది' అంటూ పేర్కొన్నారు. బాలీవుడ్ ప్రముఖ నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని భావోద్వేగానికి లోనయ్యారు. హఠాన్మరణం చెందిన శ్రీదేవి భౌతికకాయానికి నివాళులు అర్పించేందుకు వచ్చిన ఆమె దాదాపు కంటతడి పెట్టుకున్నారు. 'మరణంలోనూ నిర్మలంగా ఎరుపు చీరలో చాలా అందంగా కనిపిస్తూ శ్రీదేవి పవళిస్తోంది' అంటూ హేమ భావోద్వేగంతో నిండిన ట్వీట్ చేశారు. కడసారి ఆమెను చూసిన హేమమాలిని 'నా నివాళులు అర్పించాను. మొత్తం చిత్ర పరిశ్రమ అక్కడే శోకసంద్రంలో మునిగిపోయి ఉంది. అది ఆమెకు ఉన్న తేజస్సు.. ఆమె నటించిన చిత్రాల మ్యాజిక్.. ఎర్రచీరలో ఆమె చాలా అందంగా కనిపిస్తూ అక్కడ ప్రశాంతంగా పవళిస్తోంది. ఏర్పాట్లు అన్నీ చాలా బాగా చేశారు. గుడ్‌బై మై డియర్ ఫ్రెండ్' అని హేమమాలిని ట్వీట్ చేశారు. అందాలతార శ్రీదేవికి తుది వీడ్కోలు పలికేందుకు కోలీవుడ్, టాలీవుడ్ సెలబ్రిటీలు ముంబై చేరుకున్నారు. సౌత్‌లో టాప్ స్టార్స్ అందరి సరసన నటించిన శ్రీదేవి హఠాన్మరణం వారిని ఎంతగానో బాధించింది. సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లోని శ్రీదేవి పార్థివ దేహానికి రజనీకాంత్, కమల్ హాసన్, చిరంజీవి, వెంకటేష్, నాగార్జున, సురేష్ బాబు తదితరులు నివాళులు అర్పించారు.

బాలీవుడ్ తారలు కదలివచ్చారు. ప్రపంచ సుందరులు ఐశ్వర్య బచ్చన్, సుస్మితాసేన్, జయాబచ్చన్, శ్వేత బచ్చన్, సంజ యలీలా భన్సాలీ, సోనమ్‌కపూర్, మాధురి దీక్షిత్, ఆమె భర్త శ్రీరామ్‌నైన్, జయప్రద, హేమామాలినీ, అర్బాజ్‌ఖాన్, నిమ్రత్ కౌర్, మనిష్‌పాల్, టబూ, సుభాష్‌ఘాయ్, నీలిమా అజ్మీ, ఈషా డియోల్, అజయ్ దేవగన్, కాజోల్, తనిష, ఇంతియాజ్ అలీ, సాజిద్ ఖాన్, విద్యాబాలన్, సిద్దార్థ రాయ్ కపూర్, షమితా శెట్టి, జాన్ అబ్రహాం, రవీనా టాండన్, శేఖర్ కపూర్, రేఖా, రమేష్ సిప్పి, అనుపమ్ ఖేర్ తదితరులు శ్రీదేవికి నివాళి అర్పించారు.

సచివాలయంలో 'సమ్మర్ వాటర్ రూం' : లోకేష్

విశాలాంధ్ర-అమరావతి : వేసవిని దృష్టిలో ఉంచుకొని, ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామీణనీటి సరఫరా శాఖ అధికారులతో మంత్రి నారా లోకేష్ బుధవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. వేసవి దృష్ట్యా సచివాలయంలోని తన కార్యాలయంలో 'సమ్మర్ వాటర్ రూం' ఏర్పాటు చెయ్యాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ స్థాయిలో ప్రతి రోజు వచ్చే ఫిర్యాదులు సమీక్షించాలని నిర్ణయం తీసుకున్నారు. వారానికి ఒక సారి మంత్రి స్థాయిలో సమీక్షించాలని ప్రతి రోజు పత్రికలు, ఛానల్స్‌లో వచ్చే వార్తల పై తక్షణమే స్పందించాలన్నారు. జలవాణి కాల్ సెంటర్ 1800 425 1899 కు వచ్చే ప్రతి ఫిర్యాదు, జిల్లాల వారీగా వచ్చే వార్తలపై స్పందించి, ప్రతి వారం యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తయారు చేయాలన్నారు. అవసరమైన చోట అదనపు నిధులు కేటాయిస్తామని, ప్రజలు తాగునీటి సమస్య గురించి ఫిర్యాదు చెయ్యకముందే క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ అధికారులు, సిబ్బంది సమస్యలను గుర్తించాలని మంత్రి సూచించారు. నీటి లభ్యత లేని చోట ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా అదనపు ట్యాంకర్లతో నీటిని సరఫరా చెయ్యాలన్నారు. దీని ద్వారా ట్యాంకర్లు నిర్దేశించిన చోటుకి వెళుతున్నాయా లేదా అనేది తెలిసిపోతుందన్నారు. వేసవిలో పశువులకు తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, రాయలసీమ జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కొన్ని జిల్లాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్స్ నిర్వహణలో స్యాండ్ ఫిల్టర్లు మార్చకపోవడంతో సమస్యలు వస్తున్నాయని తన దృష్టికి వచ్చిందని యుద్ధ ప్రాతిపదికన స్యాండ్ ఫిల్టర్లు మార్చాలన్నారు. నీటి నాణ్యత అంచనాకు ఓవర్ హెడ్ ట్యాంక్‌ల్లో సెన్సార్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. అలర్ట్ మ్యానేజ్మెంట్ సిస్టమ్ ద్వారా పరిష్కరించిన సమస్యల వివరాలను ఎప్పటికప్పుడు డ్యాష్ బోర్డుకు అనుసంధానం చెయ్యాలని, కుప్పం, ఉద్దానం ఎన్టీఆర్ సుజల క్లస్టర్లను మార్చి నెలాఖరులోగా పూర్తి చెయ్యాలని అధికారులను మంత్రి లోకేష్ ఆదేశించారు.



రాష్ట్రాభివృద్ధి అంటే హెరిటేజ్ అభివృద్ధా ?

100 రోజుల పాదయాత్ర పూర్తి

విశాలాంధ్ర - ఒంగోలు బ్యూరో : రాష్ట్రం అభివృద్ధి అంటే హెరిటేజ్ అభివృద్ధి కాదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ధ్వజమెత్తారు. ప్రజాసంకల్పయాత్ర నూరు రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నూరు కేజీల కేకను కట్ చేశారు. చీమకుర్తిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ ప్రజలు ఇబ్బంది పడుతుంటే సీఎం సిగ్గు మాలిన మాటలు మాట్లాడుతున్నారని జగన్ విరుచుకుపడ్డారు. టీడీపీ హయాంలో మహిళలపై అత్యాచారాలు పెరిగాయని, విశాఖ సమ్మిట్‌లో లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి రాబడతామన్న చంద్రబాబు ఎన్ని లక్షల కోట్లు పెట్టుబడులు రాబట్టాడో చెప్పాలన్నారు. నిరుద్యోగులకు 40 లక్షల ఉద్యోగాలు ఎక్కడని నిలదీశారు. ఓటుకు నోటు కేసులో ఉండి చంద్రబాబు సీఎం పదవిలో కొనసాగుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రకాశం జిల్లాలో 2 వేల గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లున్నాయని, లక్షమంది ఈ పరిశ్రమలలో బతుకుతున్నారని, దీనికి రాయల్టి రూ.3వేలు ఉండగా వైఎస్ రాజశేఖరెడ్డి రూ.1800కు తగ్గించారన్నారు. అయితే చంద్రబాబు రాయల్టీని రూ 4 వేలకు పెంచారని, దీంతో యజమానులు లబోదిబోమంటున్నారని విమర్శించారు. కరెంటు యూనిట్ ఛార్జి రూ 3-70 నుంచి రూ 7-35 పెంచారని రాయల్టీ, కరెంటు ఛార్జీల బాదుడుతో గ్రానైట్ పరిశ్రమ మూతపడుతోందన్నారు. సుబాబుల్ రేటు రూ. 4450 నుంచి రూ 1800 దిగజారినా అడిగే వారు లేరని విమర్శించారు. వైసీపీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈసందర్భంగా ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మోపిదేవి వెంకట రమణ, బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ వైవి సుబ్బారెడ్డి, సంతనూతలపాడు శాసనసభ్యులు ఆదిమూలపు సురేష్, మాజీ శాసనసభ్యులు బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయేంద్ర సరస్వతి మృతికి జగన్ దిగ్భ్రాంతి

కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి శివైక్యం చెందారన్న వార్తపట్ల వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. జయేంద్ర సరస్వతి జగద్గురువుగా ఖ్యాతి పొందారని జగన్ శ్లాఘించారు. ఆది శంకరుల వారసులుగా రెండున్నర దశాబ్దాలపాటు జయేంద్ర సరస్వతి స్వామి కంచి పీఠానికి అందించిన సేవలు ఎన్నటికీ గుర్తుండి పోతాయని జగన్ తన సంతాపంలో పేర్కొన్నారు.

బడ్జెట్ సమావేశాలకు భద్రత కల్పించండి...

వైసీపీ సభ్యులను ఆహ్వానిస్తున్నాం... : ఫరూక్, కోడెల

విశాలాంధ్ర అమరావతి : బడ్జెట్ సమావేశాలకు గట్టి భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను రాష్ట్ర శాసనమండలి చైర్మన్ ఎన్.ఎం.డి ఫరూక్, అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆదేశించారు. మార్చి 5 నుంచి సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో భద్రతపై సచివాలయ అసెంబ్లీ హాల్‌లో పోలీసు ఉన్నతాధికారులతో వారిరువురూ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీకి వచ్చే ప్రధాన ద్వారం వద్ద పనిచేసే పోలీసు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలఫరూక్ కోరగా, బడ్జెట్ సమావేశాలకు మార్చి 5వ అసెంబ్లీకి గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ వస్తున్న నేపథ్యంలో గట్టి భద్రతా ఏర్పాటు చేయాలని అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆదేశించారు. మార్చి 23న జరిగే రాజ్యసభ ఎన్నికలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలన్నారు. భద్రతకు అవసరమైన సిబ్బందిని సమీకరించుకోవాలన్నారు. సందర్శకులకు ముందురోజే పాస్‌లు జారీ చేసి, లోపలికి వచ్చే సమయంలో వారి దగ్గర ఉన్న వస్తువులను స్వాధీనం చేసుకోవాలని కోరారు. సందర్శకులు వేచి ఉండేలా 3వ నెంబర్ గేట్ వద్ద టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. వేసవిలో తాగునీటి కొరత రాకుండా చూడాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం మెరుగపర్చాలని భద్రత విషయంలో ఎక్కడా రాజీపడొద్దని స్పష్టం చేశారు. అవసరమైన చోట మరిన్ని సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆదేశించారు. సభ ఎదుట చలో అసెంబ్లీ, ధర్నాలు వంటి ఆందోళన కార్యక్రమాలు జరగకుండా చూడాలని, ఎవ్వరి పట్ల అనుచితంగా ప్రవర్తించొద్దన్నారు. 8న బడ్జెట్ ప్రవేశపెడుతున్నట్లు ఆయన వెల్లడించారు. గత అసెంబ్లీ సమావేశాలను వైసీపీ సభ్యులు బహిష్కరించారని గుర్తు చేస్తూ, బడ్జెట్ సమావేశాలకు హాజరుకావాలని ఆహ్వానిస్తున్నామన్నారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, సీఎం చంద్రబాబునాయుడు నివాసం సమీపంలోని కరకట్ట మీదుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు సీనియర్ అధికారుల వాహనాల రాకపోకలు సాగించేలా భద్రత చేపట్టామన్నారు. సాధారణ ప్రజలు, ఇతరులకు ఉండవల్లి, పెనుమాక మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గవర్నర్ రానున్న నేపథ్యంలో భద్రత పటిష్టంగా ఏర్పాటు చేస్తూ, రిహార్సల్స్ సైతం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో సచివాలయ అధికారులతో పాటు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతి అడుగు సద్వినియోగమవ్వాలి...

అసెంబ్లీ డిజైన్‌పై స్పీకర్ కోడెల



విశాలాంధ్ర-అమరావతి:అసెంబ్లీ భవన నిర్మాణంలో ప్రతి అడుగు సద్వినియోగమయ్యేలా డిజైన్లు రూపొందించాలని అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు నార్మన్ ఫోస్టర్ ఆర్కిటెక్టర్లకు స్పష్టం చేశారు. సచివాలయంలోని అసెంబ్లీ హాల్ లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ కంపెనీ ప్రతినిధులతో మూడోసారి భేటీ అయ్యామన్నారు. టవర్ నమూనాలో ఉన్న అసెంబ్లీ భవన డిజైన్‌ను శాసన మండలి చైర్మన్ ఎన్.ఎం.డి ఫరూక్‌తో కలిసి తిలకించామని, డిజైన్ బాగుందని, మరికొన్ని సూచనలు చేశామన్నారు. ఐకానిక్ బిల్డింగ్‌గా నిర్మితమవుతున్న అసెంబ్లీ భవనం అందం, ఆకారమే కాకుండా ప్రతి అంగుళమూ వినియోగించేలా తుది డిజైన్లు రూపొందించాలని సూచించామన్నారు.

మూడున్నర లక్షల చదరపు అడుగుల్లో, 250 మీటర్ల ఎత్తులో....

శాశ్వతంగా నిర్మించతలపెట్టిన అసెంబ్లీ భవన నిర్మాణానికి సంబంధించిన నమూనా, డిజైన్లను శాసన మండలి చైర్మన్ ఎన్.ఎం.డి.ఫరూక్, అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావుకు నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులు అసెంబ్లీ కమిటీ హాల్‌లో చూపించారు. మూడున్నర లక్షల చదరపు అడుగుల్లో 250 మీటర్ల ఎత్తు మేర ఈ ఐకానిక్ టవర్ నమూనా భవన నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. అసెంబ్లీలోకి తూర్పు మార్గం నుంచి సీఎం, పశ్చిమం నుంచి మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉత్తర దిశ నుంచి సందర్శకులు, ఇతరులు, దక్షిణం వైపు నుంచి ఉద్యోగులు వచ్చేలా డిజైన్లు రూపొందించినట్లు వారు శాసనమండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్‌కు వివరించారు.

శాసనమండలి చైర్మన్, స్పీకర్ సూచనలు...

గ్రౌండ్ ఫ్లోర్‌లో అడ్మినిస్ట్రేషన్ సిబ్బందికి రెండు బ్లాక్‌లు కేటాయించేలా డిజైన్లు రూపొందించినట్లు నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులు తెలిపారు. అయితే అడ్మినిస్ట్రేషన్ సిబ్బందికి రెండు బ్లాక్ లు కేటాయింపు సరికాదని శాసనమండలి చైర్మన్, స్పీకర్ వెల్లడిస్తూ సిబ్బంది అంతా ఒకేచోట ఉండేలా డిజైన్లు రూపొందించాలన్నారు. సిబ్బంది వేర్వేరుగా ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా డిజైన్ రూపొందించాలన్నారు. భవిష్యత్తు తరాల కోసం 20 శాతం వరకూ ఖాళీ ప్రాంతం విడిచి పెట్టేలన్నారు. నమూనా డిజైన్ బాగుందని, భవనం లోపల గదుల నిర్మాణంపై మరోసారి తుది డిజైన్లు రూపొందించాలని వారిరువురూ తెలిపారు. చీఫ్ సెక్యూరిటీ అధికారులు, మీడియా పాయింట్, లైబ్రరీ, ఉద్యోగుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ డిస్పెన్సరీని కూడా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటయ్యేలా ఆకృతులు డిజైన్ చేసినట్లు నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులు తెలిపారు.

ఫస్ట్ ఫ్లోర్‌లో అసెంబ్లీ, శాసనమండలి...

ఫస్ట్ ఫ్లోర్‌లో అసెంబ్లీ, శాసనమండలి బ్లాకులు ఏర్పాటు చేసేలా డిజైన్ చేసినట్లు వారు తెలిపారు. సీఎం, స్పీకర్, శాసనమండలి చైర్మన్‌తో పాటు ప్రధాన ప్రతిపక్ష నేత, మంత్రులు, చీఫ్ విప్‌ల కార్యాలయాలను కూడా అదే ఫ్లోర్ లో ఏర్పాటు చేయనున్నారు. సెంట్రల్ హాల్, బీఏసీ సమావేశ గదులు కూడా ఫస్ట్ ఫ్లోర్‌లోనే ఉండేలా డిజైన్లు రూపొందించారు. సెకండ్ ఫ్లోర్‌లో పలు కమిటీల పేషీలు, వాటితో పాటు సాంకేతిక బృందం, రిక్రియేషన్, జిమ్ ఏర్పాటు చేయనున్నారు. రెండవ అంతస్తులో మ్యూజియం ఏర్పాటుకు సిద్ధం చేసినట్లు శాసనమండలి చైర్మన్ ఎన్.ఎం.డి ఫరూక్, అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావుకు వివరించారు.

మండలి, శాసనసభల్లో ప్రశ్నలకు

సకాలంలో సమాధానాలివ్వాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్



విశాలాంధ్ర-అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి, శాసన సభలో సభ్యులు అడిగే ప్రశ్నలపై సంబంధిత శాఖలు సకాలంలో సమాధానాలు ఇవ్వాలని అన్ని శాఖల కార్యదర్శులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఆదేశించారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్ర గత శాసన మండలి, శాసన సభల సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఇవ్వాల్సిన సమాధానాలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. దీనిపై త్వరలో ఒక ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆ పోర్టల్ మండలి, శాసన సభల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖలు తీసుకున్న వివరాలను సకాలంలో దానిలో పొందుపర్చనున్నట్లు తెలిపారు. పోర్టల్ త్వరగా అందుబాటులోకి వచ్చేలా కృషి చేయాలని రియల్ టైమ్ గవర్నెన్స్ సిఇఓ బాబును ఆదేశించారు. ప్రస్తుతం ఏ శాఖ వద్ద ఎన్ని ఎల్పిక్యులు, ఎల్ఏక్యులు పెండింగ్‌లో ఉన్నదీ, ఎన్నిటికి సమాధానాలు ఇచ్చారనే దానిపై ఆయా శాఖల వారీగా సమీక్షించి సకాలంలో సమాధానాలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే వచ్చే వారం నుండి ప్రారంభం కానున్న మండలి, శాసన సభ సమావేశాల్లో వచ్చే ఎల్పిక్యు, ఎల్ఏక్యులపై కూడా సకాలంలో కౌన్సిల్, అసెంబ్లీలకు సమాధానాలు పంపాలని, పంపిన సమాధానాల ఒక ప్రతిని సాధారణ పరిపాలన శాఖకు సమర్పించాలని కూడా ఆదేశించారు. పల్లె నిద్ర అంశంపై ఇప్పటి వరకూ ఎంతమంది ఉన్నతాధికారులు గ్రామాల్లో ఎన్ని పల్లె నిద్రలు చేశారో పరిశీలించారు. జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు పల్లెనిద్రలు చేయడంలో కొంత వరకు మెరుగైన రీతిలో ఉన్నారని చెప్పారు. కానీ శాఖాధిపతులు, కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఈ విషయంలో కొంత వెనుకబడి ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు.

ప్రజా ఫిర్యాదులు, విజ్ఞప్తుల పరిష్కారంపై సీఎస్ సమీక్షిస్తూ ఇప్పటి వరకూ వివిధ శాఖల వారీగా ఎన్ని ఆర్థికపరమైన, ఆర్థికేతరమైన ఫిర్యాదులు/విజ్ఞప్తులు వచ్చాయి, వాటిలో ఎన్ని పరిష్కరించారనేది రియల్ టైమ్ గవర్నెన్స్ సిఇఓ బాబు ఎ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆర్థికేతరమైన ఫిర్యాదులను వెంటనే సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. శాఖలవారీగా ఫిర్యాదులు పెండెన్సీపై నివేదికలు సిద్ధం చేసి ప్రతి శాఖకు ప్రత్యేక లాగిన్, పాస్‌వర్డు క్రియేట్ చేసి ఇచ్చి వాటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇ-ఆఫీస్ విధానంపై ఆయన మాట్లాడుతూ అన్ని కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తప్పక అమలు చేయడంతోపాటు ఏప్రిల్ నుండి ఇ-ఆఫీస్ కింద అన్ని కార్యాలయాలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని అందరు కార్యదర్శులను సీఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు.

అటు రన్స్... ఇటు ప్రేమ..

రెండూ గెలిచా..!

క్రికెటర్ మయాంక్ అగర్వాల్



న్యూఢిల్లీ: రంజీ ట్రోఫీలో, టి20 టోర్నీ ముస్తాక్ అలీలో టైటిల్ పోరులో చతికిలపడ్డ కర్ణాటక జట్టు వన్డే ఫార్మాట్ విజయ్ హజారే ట్రోఫీని సొంతం చేసుకుంది. మంగళవారం సౌరాష్ట్రతో ఫిరోజ్ షా కోట్లా మైదానంలో జరిగిన ఫైనల్లో కర్ణాటక 41 పరుగుల తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (79 బంతుల్లో 90, 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టుకు టైటిల్ అందించడంలో తనవంతు పాత్ర పోషించాడు. విజయ్ హజారే ట్రోఫీ నెగ్గి సీజన్‌కు అద్భుత ముగింపు ఇవ్వడంతో పాటు వ్యక్తిగత జీవితంలోనూ తాను విజయం సాధించినట్లు మయాంక్ అంటున్నాడు. 'ఈ సీజన్ నాకెంతో కలిసొచ్చింది. నా ప్రియురాలికి ప్రేమ విషయం చెప్పి, లవ్ ప్రపోజ్ చేయగా.. అందుకు ఆమె ఒప్పుకుంది. మరోవైపు విజయ్ హజారే ఓ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కెరీర్ పరంగా రాణించినందుకు సంతోషంగా ఉంది. ఫైనల్ ఇన్నింగ్స్‌కుగానూ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సొంతం చేసుకున్నానని' పలు విషయాలు మయాంక్ షేర్ చేసుకున్నట్లు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ప్రేయసి వివరాలు లాంటివి మాత్రం క్రికెటర్ వెల్లడించలేదని తెలుస్తోంది.

మయాంక్ పరుగుల రికార్డు

విజయ్ హజారే ట్రోఫీ ఒక సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా మయాంక్ రికార్డు సృష్టించాడు. అతను 8 మ్యాచ్‌ల్లో 723 పరుగులు చేశాడు. గతంలో ఈ రికార్డు 607 పరుగులతో (2016-17) దినేశ్ కార్తీక్ పేరిట ఉండేది. దేశవాళీ క్రికెట్ ఒకే సీజన్‌లో అన్ని ఫార్మాట్‌లలో కలిపి అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాట్స్‌మన్‌గానూ మయాంక్ (2,141 పరుగులు) గుర్తింపు పొందాడు. ఇప్పటిదాకా ఈ రికార్డు ముంబై క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ (1,947 పరుగులు, 2015-16) పేరిట ఉండేది.

యువీ రిటైర్..?



వచ్చే ఏడాది తర్వాతే..
ప్రపంచకప్‌లో తప్పకుండా ఆడతా

మొనాకో: టీమిండియా ప్రపంచకప్‌ల హీరో, సిక్సర్ల వీరుడు యువరాజ్‌సింగ్ తన రిటైర్‌మెంట్ ప్రకటనపై పెదవి విప్పాడు. 2019 తర్వాతే వీడ్కోలు గురించి నిర్ణయం తీసుకుంటానని ప్రకటించాడు. అదే ఏడాది ఇంగ్లాండ్‌లో ఐసీసీ ప్రపంచకప్ జరుగుతున్న సంగతి తెలిసిందే. యువీ టీమిండియా తరపున చివరి వన్డే 2017 జూన్‌లో ఆడాడు. ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్ కొత్త సీజన్‌లో మెరుపులు మెరిపించాలని పట్టుదలతో ఉన్నాడు. భారత టీ20 జట్టులో స్థానం పదిలం చేసుకోవాలని కోరుకుంటున్నాడు. మంచి ప్రదర్శనలతో 2019 ప్రపంచకప్‌లో ఆడాలని అనుకుంటున్నాడు. 'ఐపీఎల్‌లో బాగా ఆడాలని కోరుకుంటున్నాను. 2019 వరకు క్రికెట్ ఆడేందుకు ఐపీఎల్ నాకు కీలకం కానుంది. 2019 వరకు క్రికెట్ ఆడాలన్నది నా ఉద్దేశం. ఇప్పుడు వచ్చే అవకాశాలు, ఆడుతున్న తీరును బట్టే వీడ్కోలు నిర్ణయం తీసుకుంటా' అని పద్దెనిమిదో లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డు వేడుకలకు హాజరైన యువీ అన్నాడు. ఐసీసీ 2011 ప్రపంచకప్ వరకు టీమిండియాలో క్రమం తప్పకుండా ఆడిన యువీకి టెస్టు జట్టులో అనుకున్న రీతిలో అవకాశాలు రాలేదు. 'నేను అత్యుత్తమంగా ఆడుతున్న తొలి 6-7 ఏళ్లలో నాకు టెస్టుల్లో ఆడే అవకాశం ఎక్కువగా రాలేదు. అప్పట్లో దిగ్గజాలంతా టెస్టు జట్టులో ఉండటమే అందుకు కారణం. అంతలోనే క్యాన్సర్ నన్ను వెంటాడింది. అయితే అది రావడం రాకపోవడం నా చేతుల్లో లేనిది' అని యువీ వెల్లడించాడు. 'దక్షిణాఫ్రికా సిరీస్‌లో టీమిండియా అద్భుతంగా ఆడింది. టెస్టు సిరీస్‌లో బాగా పోరాడింది. వన్డేల్లో మాత్రం అదరగొట్టింది. పరుగులు చేస్తూ కోహ్లి జట్టును ముందుండి నడిపించాడు. స్పిన్నర్లు యజువేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్ సఫారీలను బాగా ఇబ్బందుల్లోకి నెట్టేశారు. విదేశాల్లో మూడు సిరీస్‌లు ఆడితే రెండు గెలవడం ఆత్మవిశ్వాసం పెంచేదే. అలాగే ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లో గెలిస్తే ప్రపంచంలోనే ఎక్కడైనా మనం విజయాలు సాధించగలం అన్న విశ్వాసం ఆటగాళ్లకు కలుగుతుంది. అప్పుడు ప్రపంచాన్ని జయించగలం. అండర్-19లో అదరగొట్టిన పృథ్వీషా, శుభ్‌మన్‌గిల్, అభిషేక్ శర్మ త్వరలోనే టీమిండియా తరపున ఆడతారు. వారు ఎంత బాగా ఆడితే అంత ఎక్కువగా సంపాదించుకోగలరు (ఐపీఎల్‌ను ఉద్దేశించి)' అని యువీ ముగించాడు.

వార్మప్‌లో విండీస్‌కు షాక్..!



హరారే: ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫయర్ వార్మప్ మ్యాచ్‌లో మాజీ చాంపియన్ వెస్టిండీస్‌కు అఫ్గానిస్తాన్ షాకిచ్చింది. పేసర్ దౌలత్ జద్రాన్ హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టడంతో అఫ్గాన్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 29 పరుగుల తేడాతో విండీస్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 35 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. వర్షం ఆటంకం కలిగించిన ఈ మ్యాచ్‌లో ఒక దశలో అఫ్గాన్ 71 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. టెయిలెండర్లు గుల్బదీన్ నయీబ్ (48, 3 ఫోర్లు, 2 సిక్సర్లు), నమీవుల్లా పెన్వారి (42, 2 సిక్సర్లు) తొమ్మిదో వికెట్‌కు 91 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. అనంతరం విండీస్ లక్ష్యాన్ని 35 ఓవర్లలో 140 పరుగులుగా నిర్దేశించారు. అయితే గేల్ (9), శామ్యూల్స్ (34, 4 ఫోర్లు)లాంటి సీనియర్లున్న విండీస్ 26.4 ఓవర్లలో 110 పరుగులకే ఆలౌటైంది. ఇన్నింగ్స్ 20వ ఓవర్ వేసిన జద్రాన్ వరుస బంతుల్లో హెట్‌మైర్ (1), పావెల్ (9), బ్రాత్‌వైట్ (0)లను ఔట్ చేసి 'హ్యాట్రిక్' సాధించాడు.

కొత్త ప్రయాణం కోసం... : రాహుల్



ముంబై: ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడిన ఆటగాడు కేఎల్ రాహుల్. ఈ ఏడాది ఆటగాళ్ల కోసం నిర్వహించిన వేలంలో రూ.11 కోట్లకు కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రాహుల్‌ను దక్కించుకుంది. ఐపీఎల్‌లో రాహుల్ వికెట్ కీపర్‌గాను బాధ్యతలు నిర్వహించాడు. విజయ్ హజారే ట్రోఫీ దక్కించుకున్న కర్ణాటక జట్టులో రాహుల్ కూడా సభ్యుడు. తాజాగా రాహుల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..'ఈ ఏడాది కొత్త ఫ్రాంఛైజీకి ఆడుతున్నాను. జీవితంలో ఇలాంటి ఊహించని ప్రయాణాలు చేయడం సర్వ సాధారణం. బెంగళూరు, హైదరాబాద్ జట్ల నుంచి చాలా నేర్చుకున్నాను. అలాగే సహచర ఆటగాళ్లు, స్టాఫ్ నుంచి మద్దతు దక్కింది. ఏ జట్టు తరపున ఆడినా మన ఆట తీరు అయితే మారదు. జట్టు విజయాల కోసం మంచి ప్రదర్శన చేయాలి. త్వరలో పంజాబ్ జట్టుతో కలిసి పని చేస్తాను. ఈ కొత్త ప్రయాణం కోసం ఎదురుచూస్తున్నాను. వీలైనంత వరకు గాయాలకు దూరంగా ఉండి టోర్నీలో ఎక్కువ మ్యాచ్‌లు ఆడాలని అనుకుంటున్నాను' అని రాహుల్ తెలిపాడు.



పాక్ క్రికెటర్‌పై ఏడాది నిషేధం

లాహోర్: పాకిస్తాన్ మాజీ ఓపెనర్ షెజాబ్ హసన్‌పై ఆదేశ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఏడాది నిషేధం, పదిలక్షల రూపాయల జరిమానా విధించింది. గతేడాది దుబాయ్ వేదికగా జరిగిన పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్)లో షెజాబ్‌తో పాటు పలువురు పాక్ క్రికెటర్లు మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు ఎదుర్కొన్నారు. వీరిలో కొంతమందిపై ఇప్పటికే చర్యలు తీసుకున్న పీసీబీ తాజాగా హసన్‌పై నిషేధం విధించింది. ఈ విషయాన్ని బోర్డు లీగల్ అడ్వైజర్ తాఫ్ఫాజుల్ రిజ్వీ ధృవీకరించారు. ఇతర క్రికెటర్లు మ్యాచ్ ఫిక్సింగ్‌లకు పాల్పడకుండా హసన్‌పై మరిన్ని కఠిన చర్యలు తీసుకునేలా చార్జ్ షీట్ దాఖలు చేస్తామని ఆయన మీడియాకు వెల్లడించారు.



ఇవే టోక్యో ఒలింపిక్స్ మస్కట్లు..!

టోక్యో: 2020లో నిర్వహించే క్రీడల మహా సంగ్రామం ఒలింపిక్స్‌కు టోక్యో ఆతిథ్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈ మహా సంగ్రామం కోసం యావత్తు ప్రపంచంలోని క్రీడాకారులతో పాటు అభిమానులు ఆశగా ఎదురు చూస్తుంటారు. తాజాగా నిర్వాహకులు ఒలింపిక్స్ మస్కట్‌లను ఎంపిక చేశారు. సుమారు రెండు వేలకు పైగా సభ్యులు తమ బుర్రలకు పదునుపెట్టి పలు మస్కట్ల నమూనాలకు నిర్వాహకులకు అందించారు. వీటికి ఓటింగ్ నిర్వహించగా.. పక్కన చూస్తున్న మస్కట్లకు రికార్డు స్థాయిలో ఓట్లు దక్కాయి. జపాన్ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. తెలుపు, ముదురు నీలం రంగులో ఉన్న మస్కట్ ఒలింపిక్స్‌కు, తెలుపు, గులాబీ రంగు ఉన్న మరో మస్కట్ పారాఒలింపిక్స్‌ను సూచిస్తుందని నిర్వాహకులు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ఒలింపిక్ మస్కట్లకు మంచి డిమాండ్ ఉంటుంది. కేకులు, బొమ్మలు, ఫుడ్ ఫెస్టివల్స్‌లో ఇవి సందడి చేస్తాయి.

రాయల్స్‌కు కొత్త స్పిన్ కోచ్



ముంబై: టీమిండియా మాజీ స్పిన్నర్ సాయిరాజ్ బహుతులేను రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంఛైజీ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా ఎంపిక చేసింది. రెండేళ్ల నిషేధం తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అడుగుపెడు తున్న రాయల్స్ ఆయన ఎంపికకు మొగ్గుచూపింది. ముంబై తరపున ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడిన బహుతులే 188 మ్యాచుల్లో 26 సగటుతో 630 వికెట్లు తీశారు. బ్యాటింగ్‌లోనూ రాణించి 31.83 సగటుతో 6,176 పరుగులు చేశారు. బహుతులే భారత్ తరపున రెండు టెస్టులు ఆడి 3 వికెట్లు తీశారు. ఎనిమిది వన్డేల్లో ప్రాతినిధ్యం వహించారు. మూడేళ్లుగా ఆయన బెంగాల్ రంజీ జట్టు కోచ్‌గా పనిచేస్తున్నారు. ఐపీఎల్‌లో అవకాశం ఇచ్చినందుకు బహుతులే సంతోషం వ్యక్తం చేశారు. 'రాజస్థాన్ రాయల్స్ శిక్షణ బృందంలో భాగం అవ్వడం గౌరవంగా భావిస్తున్నా. దిగ్గజ స్పిన్నర్ షేన్‌వార్న్ మెంటార్‌గా ఉన్న జట్టులో ఉన్నందుకు సంతోషంగా ఉంది. ఆటగాళ్లకు నా విజ్ఞానాన్ని పంచేందుకు సిద్ధంగా ఉన్నా' అని ఆయన అన్నారు.

కోహ్లీసేనకు జాక్‌పాట్..!

భారీగా పెరగనున్న వేతనాలు

ముంబై: టీమిండియా క్రికెటర్ల పంట పండనుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) త్వరలోనే ఆట గాళ్లకు శుభవార్త తెలపనుంది. బీసీసీఐ బోర్డు పరిధిలో ఆడుతున్న వారందరి జీతాలు భారీగా పెరగనున్నాయి. భారత పురుషుల, మహిళల జట్టుతో పాటు దేశవాళీ, అండర్-19 క్రికెటర్ల జీతాలు పెరగనున్నాయని బీసీసీఐ అధికారి ఒకరు ఓ జాతీయ చానెల్‌కు తెలిపారు. దీనికి సంబంధించిన ప్రక్రియ దాదాపు పూర్తైందని.. సుప్రీం కోర్టు నియమిత పాలకుల కమిటీతో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆ అధికారి వెల్లడించారు. ఇక భారత పురుషుల జట్టు శ్రీలంక పర్యటనకు ముందే సుమారు 25 మంది క్రికెటర్లను ఏ,బీ, సీ మూడు కేటగిరీలుగా విభజించి వార్షిక కాంట్రాక్టులు అమలు చేయనున్నారు. జీతాల పెంపునకు ఆర్థిక కమిటీ ఆమోదం తెలుపడమే తరువాయి. ఐపీఎల్ కన్నా ముందే ఆటగాళ్లకు కాంట్రాక్టులను ఇవ్వాలని బీసీసీఐ యోచిస్తోంది. ఏడాదికి గ్రేడ్-ఏ క్రికెటర్లకు దాదాపుగా రూ.12కోట్లు, బి-గ్రేడ్ రూ.8 కోట్లు, సీ-గ్రేడ్ నాలుగు కోట్లు ఇవ్వనున్నట్లు ఆ అధికారి వెల్లడించారు. ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఆటగాళ్లకు ఏ స్థాయి గ్రేడ్ ఇవ్వాలనేదాన్ని నిర్ణయిస్తుంది. ఆటగాళ్ల జీతాలు పెంచాలని గతంలో కెప్టెన్ విరాట్ కోహ్లి, మహేంద్ర సింగ్ ధోనీ, కోచ్ రవిశాస్త్రిలు బీసీసీఐ, పాలకుల కమిటీతో చర్చించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం గ్రేడ్ ఏ ఆటగాళ్లు రూ.2 కోట్లు, గ్రేడ్ బీ రూ.1 కోటి, గ్రేడ్ సీ ఆటగాళ్లకు రూ.50 లక్షల వార్షిక వేతనం పొందుతున్నారు.

జయేంద్ర సరస్వతి కన్నుమూత...!



జయేంద్ర సరస్వతి

కాంచీపురం: కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి (82) కన్నుమూశారు. శ్వాస సంబంధిత వ్యాధితో కొన్నాళ్లుగా ఆయన బాధపడుతున్నారు. కంచి మఠంలోనే ఉన్న జయేంద్ర సరస్వతి వద్దకు తమిళనాడు గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ మంగళవారం వచ్చి ఆశీర్వాదం తీసుకుని వెళ్లారు. రాత్రి జయేంద్ర సరస్వతికి ఒక్కసారిగా శ్వాస సమస్యలు తలెత్తడంతో కంచి మఠానికి చెందిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆయనకు మెరుగైన చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో బుధవారం ఉదయం 9 గంటల సమయంలో కంచిలోని శంకర మల్టీస్పెషాలిటీలో ఆయన తుదిశ్వాస విడిచారు. అభినవ శంకరులుగా పేరొందిన జయేంద్ర సరస్వతి 1935, జులై 18న తమిళనాడులోని మన్నార్‌గుడి సమీపంలోని ఇరుల్‌నిక్కి గ్రామంలో జన్మించారు. అసలు పేరు సుబ్రహ్మణ్య మహాదేవ అయ్యర్. చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి అనంతరం 1954, మార్చి 24న కంచి పీఠానికి 69వ పీఠాధిపతిగా నియమితులయ్యారు. అనంతరం ఆయన పేరును జయేంద్ర సరస్వతిగా మార్చుకున్నారు. సనాతన ధర్మ పరిరక్షణలో జయేంద్ర సరస్వతి హయాంను ఓ స్వర్ణయుగంగా చెపుతుంటారు. చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి అడుగుజాడల్లో నడిచేందుకు 18వ ఏట సన్యాసం స్వీకరించిన జయేంద్ర సరస్వతి సమాజ అభ్యున్నతి కార్యక్రమాలు నిర్వహించాలని గట్టిగా విశ్వసించేవారు. ఆలయాలతో పాటు విద్యాలయాలు, వైద్యశాలలు అవసరమని భావించారు. దీంతో పాఠశాలల నుంచి వర్సిటీ వరకూ విద్యాభివృద్ధిలోనూ భాగస్వాములయ్యారు. నిరుపేదల కోసం పలు చోట్ల వైద్యశాలలను నెలకొల్పారు. వృద్ధాశ్రమాలు, గోశాలలు ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా ఆలయాల నిర్వహణకు ఇతోధికంగా ఆర్థిక సాయం సైతం అందించారు. జయేంద్ర సరస్వతి నేతృత్వంలో కంచి పీఠం అనేక సామాజిక కార్యక్రమాలను చేపడుతోంది. ఆయన ఆధ్వర్యంలో కంచి పీఠం మరింతగా వృద్ధి చెందింది. మఠం ఆధ్వర్యంలో చెన్నైలోని శంకర నేత్రాలయ, అసోం లోని గౌహతి వద్ద శంకర దేవ నేత్రాలయ వంటివి స్థాపించారు. అనేక పాఠశాలలు, పిల్లల ఆసుపత్రి, హిందూ మిషన్ ఆసుపత్రి వంటివి సైతం కంచి పీఠం నిర్వహిస్తోంది. జయేంద్ర సరస్వతి స్వామి భౌతికకాయాన్ని ఆసుపత్రి నుంచి కంచి మఠానికి తీసుకుని వచ్చారు. అనంతరం ఆయన పార్థివదేహానికి శాంతి పూజ తదితర శాస్త్రోక్తమైన పూజలు నిర్వహించి ప్రజల సందర్శనార్థం ఉంచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన మరణ వార్త తెలియగానే కాంచీపురం, చెన్నై తదితర ప్రాంతాల నుంచి భక్తులు కడసారి దర్శనానికి పెద్ద ఎత్తున మఠానికి తరలివస్తున్నారు. మరోవైపు ఆయన మహాసమాధి తదితర కార్యక్రమ వివరాలను త్వరలో వెల్లడిస్తామని కంచి పీఠం మేనేజర్ సుందరేశ అయ్యర్ తెలిపారు. కంచి మఠానికి చెందిన పంచాగకర్తలు, తదితరులు ఆయన మహాసమాధికి సంబంధించిన రేపు ఓ తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.బుధ, గురు వారాల్లో ఆయన పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచనున్నట్లు తెలుస్తోంది.

ప్రముఖుల సంతాపాలు

జయేంద్ర సరస్వతి అకాల మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ, తమిళనాడు సీఎం పళనిస్వామి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం చంద్రశేఖరరావు, ఉభయ రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సంతాపాన్ని ప్రకటించారు.

కోర్టు బోనులో...పీఠాధిపతి..!

కంచి వరదరాజ పెరుమాళ్ ఆలయ మేనేజర్ శంకరమన్ హత్య కేసు, కంచి మఠంలో ఆడిటర్‌పై దాడి కేసులో...దాదాపు పదేళ్ల పాటు కోర్టు బోనులో నిందితుడిగా నిలబడ్డారు. ఈ రెండు కేసుల్లో 2016లో ఆయనకు విముక్తి కలిగింది. కంచి వరదరాజ పెరుమాళ్ ఆలయ మేనేజర్ శంకరమన్‌ను 2004 సెప్టెంబర్ 3న గుర్తుతెలియని వ్యక్తులు అరెస్టు చేశారు. ఈ హత్యోదంతంపై పాండిచేరికి చెందిన ఓ సామాజిక కార్యకర్త హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. అప్పటి జయలలిత ప్రభుత్వం 2004 నవంబర్ 11 దీపావళి రోజున జయేంద్ర సరస్వతిని అరెస్టు చేసింది. 2013 వరకూ ఈ కేసు విచారణ జరిగింది. అదే విధంగా 2002లో కంచి మఠం ఆడిటర్‌ను అవమానించిన కేసులోనూ జయేంద్ర సరస్వతి సహా 11 మందిని పోలీసులు అరెస్టు చేయగా 2016లో ఈ కేసు నుంచి విముక్తి కలిగింది.

ప్రజాసమస్యలపై సమరశీల పోరు

- సీపీఐ గుజరాత్ రాష్ట్ర మహాసభ నిర్ణయం
- కార్మిక హక్కులను కాలరాస్తున్న మోడీ : బాల్‌చంద్ర కాంగో విమర్శ



ప్రసంగిస్తున్న షమీం ఫైజీ

బాల్‌చంద్ర భాయ్ త్రివేది నగర్ (వదోదర): సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గుజరాత్ రాష్ట్ర 23వ మహాసభ పిలుపునిచ్చింది. రేషన్ షాపులలో పేదలకు ఆహార ధాన్యాలు అందుబాటులో లేకపోవడం, పెరుగుతున్న నిరుద్యోగ సమస్య, దళితులు, మైనారిటీలపై దాడులకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించింది. మహా సభలు వదోదరలోని బాల్‌చంద్ర భాయ్ త్రివేది నగర్‌లో ఆది, సోమవారాలు జరిగాయి. మహాసభకు జీఎస్ పిళ్లై, జ్యోతిబెన్ పర్మార్, స్వనా సుగేత్ పథక్షీ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు భగవాన్‌భాయి వారు పతాకావిష్కరణ చేశారు. మహాసభలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ బాల్ చంద్ర కాంగో మాట్లాడుతూ, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ కనుసన్నల్లో నడుస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కుల, మతలవారీగా సమీకరణాలను వేగిరపరచడం దేశ ఐక్యత, సమగ్రతకు పెనుముప్పుగా పరిణమిస్తోందని హెచ్చరించారు. దేశంలో ఫాసిజం ముప్పుపెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు, రైతులపై కేంద్ర ప్రభుత్వం దాడులను ముమ్మరం చేసిందని విమర్శించారు. కార్మిక సంఘాల హక్కులను కాలరాస్తున్నారని చెప్పారు. అప్పుల వలయం నుంచి బయటపడలేక రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మిగిలివున్న నయాఉదారవాద ఎజెండాను అమలు చేసేందుకు ఈ ప్రభుత్వం తహతహలాడుతోందని అన్నారు. సామాన్య ప్రజలపై మరింత భారాలను మోపి, కార్పొరేట్, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు ప్రయోజనం కలిగించడమే ఈ ఎజెండా లక్ష్యమని అన్నారు. ఆర్థిక నయా-ఉదారవాదం కారణంగా సామాన్యులపై కేవలం ఆర్థిక భారాలు పెరగడం మాత్రమే కాకుండా వారి వాస్తవ ఆదాయం కూడా తగ్గిపోతోందని, నిరుద్యోగం పెరుగుతోందని కాంగో చెప్పారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తానని ఎన్నికల ముందు మోడీ హామీ ఇచ్చారని కానీ అధికారంలోకి వచ్చాక కొత్తగా ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగులను ఊడబెరుకుతున్నారని చెప్పారు. విద్యను ప్రైవేటీకరిస్తున్నారని, సామాన్య ప్రజలకు విద్య, ఆరోగ్యం అందని ద్రాక్షగా మిగిలిపోయిందని కాంగో చెప్పారు. సీపీఐ జాతీయ కార్యదర్శి షమీం ఫైజీ మాట్లాడుతూ, ఈ ఏడాది ఏప్రిల్‌లో కొల్లాంలో జరిగే పార్టీ 23వ జాతీయ మహాసభ ముందు వుంచే ముసాయిదా రాజకీయ తీర్మానంలోని ముఖ్యాంశాలను వివరించారు. రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని పెంచేందుకు ద్రవ్యశక్తులు ప్రయత్నాలను విస్తృతం చేశాయని ఫలితంగా మితవాద శక్తులు ప్రపంచ వ్యాప్తంగా విజృంభించాయని తెలిపారు. ఇందులో భారత్‌కు ఎటువంటి మినహాయింపులేదని అన్నారు. మతోన్మాద శక్తుల ఆగడాలను ఎదుర్కొనేందుకు వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఏకంకావాల్సిన సమయం ఆసన్నమైందని ఫైజీ చెప్పారు.

కార్యదర్శిగా రాజ్‌కుమార్ సింగ్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రాజ్‌కుమార్ సింగ్ రాష్ట్ర రాజకీయ పరిణామాలు, గత మహాసభ నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన కార్యకలాపాలపై నివేదికను ప్రవేశపెట్టారు. జాతీయ సమితి సభ్యులు విజయ్ శెన్మారే నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ రెండు నివేదికలపై జరిగిన చర్చలో 17 మంది పాల్గొన్నారు. మహాసభ 21 మందితో రాష్ట్ర సమితిని, ముగ్గురు కంట్రోల్ కమిషన్ సభ్యులను ఎన్నుకుంది, వారు సమావేశమై ఏడుగురు సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా రాజ్‌కుమార్ సింగ్ తిరిగి ఎన్నికయ్యారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.